www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శుక్రవారం 30 మే 2025
సంపుటి :07 సంచిక : 04 , పేజీలు : 12 వెల:రూ.5/-

## 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

- ధరణి కష్టాలు రిపీట్ కాకుండా భూమాత
- భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ఖమ్మం,మే29( వెలుతురు):
జూన్2 న భూమి లేని నిరుపేద రైతులు ఎవరైతే అసైన్డ్ భూములను సేద్యం చేస్తున్నారో వారికి పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి



## పాక్‌తో యుద్ధం అర్థంతరంగా ఎందుకు ఆపారు

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తడికిఎందుకు తలొగ్గారు
- యుద్ధం ఆపితే అఖిలపక్షానికి ఎందుకు చెప్పలేదు
- గుండెధైర్యం ఉన్నవారే యుద్ధాన్ని గెలిపిస్తారు
- ఇందిరాగాంధీ పాక్‌పై అలాగే గెలిచారు
- జైహింద్ ర్యాలీలో సిఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



మేడ్చల్,మే29( వెలుతురు):
పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే విషయంలో కేంద్రానికి సహకరించామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యుద్ధం అంటే ధైర్యం, వెన్నెముక, యుద్ధతంత్రం ఉండాలని చెప్పుకొచ్చారు. నాలుగు రోజుల యుద్ధం తర్వాత అర్ధాంతరంగా ఎందుకు ఆపేశారని ప్రశ్నించారు. యుద్ధం చేయాలను కున్నప్పుడు అఖిలపక్షాన్ని పిలిచారని.. యుద్ధం ఆపేసినప్పుడు అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తారని తెలిపారు. ఉగ్రవాదులను తుదముట్టిం చేవరకు సైన్యానికి అండగా ఉంటామని తెలిపారు. ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలో గురువారం జై హింద్ యాత్ర నిర్వహించారు. బాచుపల్లి వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి జైహింద్ యాత్ర కొనసాగింది.






## వరుస సంక్షోభాలతో బెంగాల్ సతమతం

- రాష్ట్రంలో నిర్మమత ప్రభుత్వం నడుస్తోంది
- ఇటీవలి అల్లర్లలో గుండాలకు స్వేచ్ఛ
- ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా
- ఆపరేషన్ సింధూర్ ఆగిపోలేదు
- బెంగాల్ ర్యాలీలో మమతపై విరుకుపడ్డ మోడీ

కోల్‌కతా,మే29( వెలుతురు):
ప్రస్తుతం బెంగాల్ రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్, మాల్డాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. గురువారం పశ్చిమ



## భారతదేశ చరిత్రలోనే వరి సాగులో తెలంగాణ నంబర్ వన్..

- అత్యంత పకడ్బందీగా వరి ధాన్యం కొనుగోలు.
- ఎప్పటికప్పుడు రైతులకు డబ్బుల చెల్లింపులు..
- అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం..
- అనర్హులకు అందిస్తే అధికారులపై చర్యలు తప్పవు..
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..
- ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి.
- ఆధునిక పద్ధతుల ద్వారా మేజర్ ప్రాజెక్టు ల డి- సిల్టేషన్ ప్రక్రియ
- పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- 60 లక్షల ఎకరాలలో 130 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండింది
- గతం కంటే నాలుగు రెట్లు అధికంగా రైతులకు ధాన్యం డబ్బుల చెల్లింపులు
- వానాకాలం ముందస్తు సాగు రైతులను సన్నద్ధం చేయాలి
- వానాకాలం పంట సాగుకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా పకడ్బందీగా వ్యవహరించాలి..
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు వానకాలం పంటల సాగు సన్నద్ధతపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో సుదీర్ఘంగా సమీక్ష.
- ఆయా అంశాలపై పూర్తి వివరాల సేకరణ..
- సమస్యల పరిష్కారానికి సూచనలు సలహాలు
- హాజరైన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్

2 లో

## ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు

- రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి..సేకరణ
- ధాన్యం సేకరణలో భద్రాద్రి, ఖమ్మం రికార్డు
- ఎప్పుడూ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లకు ఐదు లక్షలు
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం,మే29( వెలుతురు):
అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. రికార్డు స్థాయిలో వస్తే.. అంతే స్థాయిలో సేకరిస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో ఎలాంటి లోపాలు జరగవద్దు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. పేదల ఇంటి నిర్మాణానికి గత భారాస ప్రభుత్వం కూడా రూ.5 లక్షలు ప్రకటించింది. కానీ పదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. పూర్తిస్థాయిలో భూభారతి అమలుకు సిద్ధం

## అడ్డదారుల్లో బంగ్లా శరణార్థులు

- ఆధార్ కార్డులు సహా సకల సౌకర్యాలు
- నేరాలుచేస్తూ ఇక్కడే ఉండేలా నైజీరియన్లు
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆనంద్ వెల్లడి



హైదరాబాద్,మే29( వెలుతురు):
హైదరాబాదులో నేరాలు చేస్తున్న నైజేరియన్స్‌ను డిపోర్ట్ చేస్తున్నట్లు- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డిపోర్టు

## ముదిరి పాకాన పడ్డ కెసిఆర్ కుటుంబ రాజకీయాలు

- కల్వకుంట్ల కుటుంబలో రాజకీయ తుఫాన్
- బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేసే కుట్రలు
- తనపై లేనిపోని కథనాలు..పెయిడ్ ఆర్టికల్స్
- కొందరు నేతలు పనిగట్టుకుని విమర్శలు
- కెసిఆర్ మాత్రమే మా నాయకుడు
- ఆయనను నడిపించే మొగోళ్లు మీరు
- కెసిఆర్ తప్ప మరొకరి నాయకత్వాన్ని అంగీకరించం
- కెసిఆర్‌కు నోటీసులు వచ్చినా స్పందించని నేతలు
- కావాలనే నిజామబాద్‌లో నన్ను ఓడించారు
- నా జోలికి వస్తే...నేనసలే మంచిదాన్ని కాదు
- కెటిఆర్ లక్ష్యంగా నిప్పులు చెరిగిన సోదరి కవిత




హైదరాబాద్,మే29( వెలుతురు):
కెసిఆర్ కుటుంబ రాజకీయం ముదరి పాకాన పడింది. రాజీకయ తుఫాన్ చెలరేగింది. తీవ్ర వాయుగుండంగా మారింది. తీరం ఎక్కడ ఎలా దాటుతుందో కానీ..అలజడి సృష్టిస్తోంది. గాలిబుడగలా ఉన్న ఐక్యత పేలింది. కెసిఆర్ నాయకత్వాన్ని కెటిఆర్ హైజాక్ చేసి గుప్పిట్లో పెట్టుకున్న తీరుపై సోదరి కవిత బాంబు పేల్చారు. కెసిఆర్ నాయకత్వం తప్ప ఎవరి నాయకత్వాన్ని అంగీకరించేది లేదని సోదరుడు కెటిఆర్‌కు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీని ఇష్టారీతిన నడుపుతూ...బిజెపికి

## నీచ రాజకీయాల చేసే అలవాటు బిజెపికి లేదు

- పదేళ్లలో కెసిఆర్ ముంచితే..పదినెల్లో రేవంత్ ముంచాడు
- బిఆర్ఎస్ విలీనంపైతనకు తెలియదు
- కవిత మాటలను నమ్మడానికి సిద్దంగా లేరు
- కాలేశ్వరం కమిషన్ విచారణకు హాజరవుతా
- మీడియాతో ఈటెల రాజేందర్ వెల్లడి

హైదరాబాద్,మే29( వెలుతురు):
నీచ రాజకీయాలు చేసే అలవాటు బిజెపికి లేదని బిజెపి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నీచ రాజీకీయాలు భాజపాకి అలవాటు లేదు. పదేళ్లలో కేసీఆర్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోయారు. పక్కరాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే..



## రాయలసీమ అడ్డా..టిడిపి గడ్డ

- దేవుని గడపలో మహానాడు సూపర్ సక్సెస్
- వైనాట్ 175 అంటే..ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు
- తాడేపల్లి ప్యాలెస్‌కే జగన్‌ను పరిమితం చేశారు
- ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతాం
- త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం
- అప్పల ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిన జగన్
- రెడ్‌బక్ అంటేనే వణికిపోతున్న నేతలు
- కడప బహిరంగ సభలో లోకేశ్ ఘాటు వ్యాఖ్యలు


కడప,మే29( వెలుతురు):
దేవుని కడపలో మహానాడు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. తిరుమల తొలి గడప.. దేవుని కడప. దేవుని కడప, ఒంటిమిట్ట, అమీన్‌పీర్ దర్గా ఉన్న



## రాష్ట్రం పునర్నిర్మాణమే లక్ష్యం

- విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా పయనం, ● ఒక్కో ఇటుక పేరుస్తూ వస్తున్నాం, ● సంపద సృష్టించడమే తెలుగుదేశం పార్టీ విధానం, ● గొడ్డలిపోటు రాజకీయాలకు టిడిపి దూరం, ● కష్టాలు చూసి బెదురులేదు.. సవాళ్లకు పారిపోలేదు. ● ఉగ్రవాదులనే కాదు..ఆర్థిక ఉగ్రవాదులను తరిమి కొట్టాల్సిందే, ● రాజకీయాల ముసుగులో ల్యాండ్, శాండ్, మైన్స్ దోపిడీ, ● డ్రగ్స్, గంజాయి అమ్మితే అదే చివరి రోజు, ● ఆడబిడ్డల జోలికి వస్తే అవే వారికి అంతిమ ఘడియలు , ● కలసికట్టుగా సాగితే వైకాపా మటుమాయం తప్పదు, ● కడప మహానాడు బహిరంగ సభలో చంద్రబాబు ఉద్వేగ పూరిత ప్రసంగం

కడప,మే29( వెలుతురు):
విధ్వంసానికి గురైన రాష్ట్రం పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఒక్కో ఇటుక పేరుస్తూ పునర్నిర్మాణానికి అంకితమై పనిచేస్తున్నామని తెలుగుదేశం అధినేత, ఏపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వైనాట్ గొడ్డలిపోట్లు అనేవి మన విధానం కాదు. ప్రతిక్షణం కష్టపడి పనిచేయడం మన విధానం. కష్టాలు చూసి బెదిరిపోలేదు.. సవాళ్లు చూసి పారిపోలేదు. క్లైమోర్ మైన్లకే భయపడలేదు.. సమస్యలకు భయపడతానా అంటూ వ్యాఖ్యానించారు.



ఇటుక, ఇటుక పేర్చుతూ విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. పేద ప్రజల జీవన

https://epaper.velthuru.com

జనరల్ వార్తలు

# వెలుతురు

(మొదటి పేజీ తరువాయి..)

## వరుస సంక్షోభాలతో బెంగాల్ సతమతం

బెంగాల్‌లోని అలీపుర్‌దువార్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇండియా... విక్షిత్ భారత్‌గా మారాలంటే.. పశ్చిమ బెంగాల్‌ను కూడా విక్షిత్ పశ్చిమ బెంగాల్‌గా మార్చడం ముఖ్యమని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు కొత్త శక్తిని నింపాల్సిన అవసరం ఉందని.. జ్ఞానం.. విజ్ఞాన కేంద్రంగా 'మేక్ ఇన్ ఇండియా' కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమత (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నిర్వహించిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. ఈ క్రమంలోనే పోలీసులపైనా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో లాఠీఛార్జీకి దారితీసింది. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసానికి దారితీసింది. ఈ ఘర్షణలపై కలకత్తా హైకోర్టు నియమించిన నిజనిర్ధారణ కమిటీ– ఇచ్చిన నివేదికతో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ చట్ట వ్యతిరేక నిరసనల ఫలితంగా చెలరేగిన మతపరమైన ఘర్షణలకు స్థానిక ఎమ్మెల్యే, నాయకులు కారణమని నివేదిక ప్రస్తావించింది. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఎత్తిచూపింది. ఈ వ్యవహారం భాజపా చేతిలో అస్త్రంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో తాజా ర్యాలీలో మమత ప్రభుత్వాన్ని మోదీ ఎండగట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యక్తులు కొన్ని ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే, పోలీసులు దానిని అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా..? బుజ్జగింపు రాజకీయాల పేరిట గూండాలకు స్వేచ్ఛనిచ్చారు. ఇక్కడ ప్రతి సమస్యకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఏదీ పరిష్కారం కాదని మోదీ దుయ్యబట్టారు. ఈ ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఆ ఆపరేషన్ ఇంకా పూర్తికాలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నాను. ఏప్రిల్ 22 జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సిందూరం శక్తి ఏంటో మన ఆర్మీ ఉగ్రవాదులకు రుచి చూపించింది. మనం వారి ఇంట్లోకి ప్రవేశించి, మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ అర్థం చేసుకోవాలని అన్నారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రయిక్స్, 2019లో జరిగిన బాలాకోట్ దాడులు, ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి మోదీ పరోక్షంగా ప్రస్తావించారు.

## 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

నిర్ణయించినట్లు– మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అధికారులతో జరిగిన సమావేశంలో పొంగులేటి కీలక సూచనలు చేశారు. ధరణిలో ఏర్పడ్డ ఇబ్బందులు మళ్ళీ రిపీట్ కావద్దని, ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు– జరగొద్దని తెలిపారు. చిన్న చిన్న భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సరదాల కోసం ఉద్యోగాలు చేయొద్దని స్పష్టం చేశారు. ఇది పేదల ప్రభుత్వం, అలసత్వం వహిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూలో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సూచించారు. ఫారెస్ట్ అధికారులు సంయమనం పాటించాలని తెలిపారు. గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు, ఒక్క కొత్త చెట్టు– కూడా నరక నివ్వొద్దని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇదే అదును చూసుకొని అటవీ అధికారులు చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని.. ఇక నుంచి పోడు సాగుగూర్చి బానర్ ఐటమ్ కథనాలు రావొద్దన్నారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వం చాలా క్లియర్ గా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారం ఉన్నా రాష్ట్రాల్లో కూడా ఇంటికి 5 లక్షలు ఇవ్వడం లేదని.. పేదవాడికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, పైరవీలు చేయొద్దని తెలిపారు. ఒకటికి పది సార్లు చెప్తున్న అనర్హులకు కాకుండా ఇల్లు ఇస్తే సస్పెండ్ కాదు, అంతకన్నా పెద్ద శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఒక్క రూపాయి లంచం తీసుకున్న సహించేది లేదు... ఇందిరమ్మ ఇళ్ల ముసుగు లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. నియోజక వర్గానికి 3500 ఇల్లు కాకుండా ఐటిడిఏ పరిధిలో ఇంకా పెంచుదామని తెలిపారు.

## ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు

అవుతున్నాం. ధరణిని రద్దు చేస్తామని ఎన్నికల అజెండాలోనే పెట్టాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అధికారులతో డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాలకు సంబంధించిన ఇంఛార్జ్ మంత్రులు సమావేశాలు ఏర్పాటు– చేసుకుంటున్నారు.. 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందజలో ఉంది.. వారం రోజుల్లో నగదు కూడా వారి అకౌంట్లలో జమ,ఏశాం.. గతంలో 2, 3 నెలలు అయిన నగదు వేసేవారు కాదు అని ఆరోపించారు. దీనికి అధికారులకు అభినందనలు.. అలాగే, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి.. దేశంలో ఎక్కడ లేని విధంగా 5 లక్షల రూపాయలతో ఇళ్లు శాంక్షన్ చేశాం.. నియోజకవర్గానికి 3500 ఇల్లు కేటాయించడం గొప్ప విషయం.. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి హౌసింగ్ మంత్రి కసరత్తు చేస్తున్నారు.. 4 లక్షల 56 వేల ఇళ్లకు నిర్మాణాలు చేపడుతున్నాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే, సీజన్ మొదలైంది కాబట్టి విత్తనాల పంపిణీ మంచిగా జరగాలి.. నకిలీ విత్తనాలు అమ్మేవారికి జిల్లాలో పుట్టగతులు ఉండవు అని ఉప ముఖ్యమంత్రి భట్టి వార్నింగ్ ఇచ్చారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. ఇక, ధరణి పోర్టల్ ను పదేళ్లు చూశాం.. ధరణిలో బంధించిన వాటిని బయటకు తీసుకుని వచ్చేది, ప్రజలకు సరళమైన, న్యాయమైన హక్కులన్నింటినీ కాల రాసిన చట్టం ధరణి అని ఆరోపించారు. ధరణినీ తొలగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం, దానికి తగ్గట్టు–గానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కసరత్తు చేశారు.. అందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం పేదలకు అనుకూలంగా ఇది పని చేస్తుందని డిప్యూటీ– సీఎం విక్రమార్క పేర్కొన్నారు. ఇక, తెలంగాణ రాష్ట అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన పెద్ద ఎత్తున నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్లు జాగ్రత్తగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి అన్నారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి.. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి లిస్ట్ మొత్తం ఇంఛార్జ్ మంత్రికి అప్పగించాలి అని సూచించారు. అధికారులు ఎక్కడ కూడా ఉదాసీనత వ్యక్త పర్చొద్దు.. గతంలో ఉన్న ప్రభుత్వం అన్ని విభాగాలను గాలికి వదిలి వేసింది.. బడ్జెట్ పరంగా ఏ ఇబ్బంది లేదు, పూర్తి స్థాయిగా నిధులు విడుదల చేస్తామన్నారు. సీజన్ వ్యాధులకు సంబంధించి కలెక్టర్లు సీరియస్ గా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. తాగునీరు లీకేజీలపై శ్రద్ధ వహించాలని, ఆసుపత్రుల్లో సేవలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. గతంలో ప్రభుత్వాలు విభాగాలను గాలికి వదిలేశాయి. కానీ ప్రస్తుతం బడ్జెట్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేదు, నిధులు విడుదల చేస్తాం అన్నారు. పదేళ్లు వెనుకపడ్డాం. ఇప్పుడు పరుగులు పెట్టక తప్పదు. లక్ష్యాలను చేరుకోవాలంటే ఇదే మార్గం అంటూ భట్టి స్పష్టమైన సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## అడ్డదారుల్లో బంగ్లా శరణార్థులు

చేసిన తర్వాత కూడా చాలా మంది నకిలీ పాస్‌పోర్ట్ లతో ఇండియాలోకి ప్రవేశిస్తున్నారని, అలాంటి వాళ్లను కూడా అరెస్ట్ చేస్తున్నట్లు– వెల్లడించారు. హైదరాబాద్ లో జోనల్ సైబర్ సెల్స్ ను ప్రారంభించిన కార్యక్రమంలో ప్రసంగించారు. నైజీరియన్లను వాళ్ళ దేశానికి డిపోర్ట్ చేస్తారని భయంతో ఏదో ఒక కేసులో ఇన్వాల్వ్ అవుతున్నారని సంచలన విషయాన్ని తెలిపారు. చివరికి 498 కేసులో అయిన ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టించు కుంటున్నారని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. నైజేరియన్స్ పై కేసు నమోదు అయితే చట్టపరంగా డిపోర్ట్ చేయలేమని స్పష్టం చేశారు. వారిపై కేసు ట్రయల్ పూర్తి చేసి క్లోజ్ అయ్యే వరకు డిపోర్టు చేయలేమని వివరించారు. బంగ్లాదేశ్ కి చెందిన పౌరులు కూడా శరణార్థులుగా ఇక్కడికి వస్తున్నారని.. ఈ వ్యవహారాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు– తెలిపారు. అడ్డదారుల్లో ఇక్కడ ఆధార్ పొందుతున్నట్లు– గుర్తించినట్లు– చెప్పారు. ఈ వ్యవహారంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. ఉగ్రవాద లింక్స్ ఉన్న సమీర్ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుందని సీపీ స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఎన్ఐఏ నాలుగు చోట్ల సోదాలు చేసిందని.. ఎన్ఐఏ విచారణ, సోదాలకు హైదరాబాద్ పోలీసుల సహకారం అడిగితే చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ లో సమీర్ తో ఇంకా ఎవరెవరికి లింక్స్ ఉన్నాయనే అంశాన్ని ఎన్ఐఏ దర్యాప్తులో బయటికి వస్తాయని తెలిపారు. అలాగే.. ఫోన్ టాపింగ్ కేసులో విచారణ కొనసాగుతుందని సీపీ ఆనంద్ వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని..ప్రస్తుతానికి ఉన్న చర్యలు అన్ని హోల్డింగ్ లోకి వెళ్లిపోతాయన్నారు. కొత్త పాస్‌పోర్టు జారీ పక్రియ మొత్తం కూడా విదేశీ వ్యవహారాల శాఖ చూసుకుంటుందని.. పాస్‌పోర్టు ఎప్పుడు ఎలా జారీ చేస్తారనే విషయాన్ని తాము కూడా తెలుసుకోవాలన్నారు. ఇంటర్‌పోల్, డిస్పోర్ట్ ఇతర ఇతర చర్యలు అన్ని కూడా హోల్డింగ్ లోకి పోతాయని వెల్లడించారు.

# భారతదేశ చరిత్రలోనే వరి సాగులో తెలంగాణ నంబర్ వన్..

**కరీంనగర్ వెలుతురు మే29:**
గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పండని విధంగా అత్యధికంగా దేశ చరిత్రలోనే తెలంగాణ వరి సాగులో నంబర్ వన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాలేశ్వరం సుందిళ్ల అన్నారం మేడిగడ్డ బ్యారేజీ లో నుంచి చుక్క నీరు రాకున్నా అధికారుల సహకారం ప్రభుత్వం చేపట్టిన పకడ్బందీ చర్యల వల్ల అత్యధికంగా వరి సాగైందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.
గురువారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వానాకాలం పంటల సాగు సన్నద్ధతపై కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్సింగ్ ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య చిన్నమైలు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం.. భూభారతి వరి ధాన్యం కొనుగోళ్లపై దాదాపు నాలుగు గంటల పాటు మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో ఎస్సారెస్పీ నీటి విడుదల ప్రణాళికలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపి లను భాగస్వామ్యం చేస్తామని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం సిల్ట్ కారణంగా తగ్గిందని, రాష్ట్ర ప్రభుత్వం పాలసీ ప్రకారం ఎస్సారెస్పీ రిజర్వాయర్ పూడికతీత, డీ సిల్టేషన్ ఆధునిక పద్దతుల్లో పూర్తి చేసి పూర్వపు సామర్థ్యం తీసుకొని వస్తామని అన్నారు. అదేవిధంగా కడెం ప్రాజెక్టు తో పాటు ఇతర ప్రాజెక్టుల్లో సిల్ట్ తొలగించేందుకు అత్యాధునిక పద్ధతులను వినియోగిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాలువలు, తూములు, ఓటి మరమ్మత్తు పనులు ఓ & పి క్రింద పూర్తి చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించి సాగునీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే ప్రతిపాదన రూపొందించాలని వాటికి సంబంధించిన నిధులు వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. కరీంనగర్ జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని ఇందుకు మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ సాకారంతో ముందుకు వెళ్తానని ప్రకటించారు. 28 మే నాటికి యాసంగి పంట కొనుగోలు కోసం రైతులకు రాష్ట్రంలో దాదాపు 13 వేల కోట్లు చెల్లించామని, గత ప్రభుత్వ హయాంలో ఇదే సమయం 2023 సంవత్సరానికి 3 వేల 500 కోట్లు మాత్రమే చెల్లించారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో రైతులకు మనం 2 వేల 782 కోట్ల చెల్లిస్తే 2023 లో 538 కోట్లు మాత్రమే చెల్లించారని అన్నారు.ప్రజా ప్రభుత్వం 28 మే నాటికి 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే , 2023 లో 46 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కోనుగోలు చేసిందని పేర్కొన్నారు. సింగరేణి భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బండ్ల వాగు ఎత్తిపోతల పథకాన్ని వారం రోజులలో ప్రారంభిస్తామని, పాలకుర్తి



ఎత్తిపోతల పథకం పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. నీరు అందుబాటులో ఉండి, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని అన్నారు. యాసంగి సీజన్ లో తెలంగాణ రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని, స్వతంత్ర భారతదేశంలో ఎక్కడ కూడా ఇంత పెద్ద ఎత్తున ధాన్యం సాగు జరగలేదన్నారు. దేశంలో వరి పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని అన్నారు. ప్రాజెక్టులలో ఉన్న నీళ్ల సమర్థవంతంగా వినియోగించడం వల్ల పెద్ద ఎత్తున పంటలు పండాయన్నారు. సాగునీటిని పొదుపు క్రమంగా వాడటం వల్లే పెద్ద ఎత్తున పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. యాసంగి పంట సన్న రకాల వడ్లను బాయిల్డ్ రైస్ గా మార్చేందుకు ప్రభుత్వం రైస్ మిల్లుల్లో ప్రతిపాదనలు ఆమోదిస్తుందని అన్నారు. ఈ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోను చర్చిస్తామని తెలిపారు. నీటి పారుదల శాఖ పరిధిలో 1100 ఇంజనీర్లు, 1800 మంది లష్కర్లను నియమించామని అన్నారు. సాగునీటిపారుదల శాఖను పూర్తిగా రక్షణ చేశామని తెలిపారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి శాఖను సమగ్రంగా ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. రోళ్ళ వాగు ప్రాజెక్టు అటవీ అనుమతులు వచ్చేలా జగిత్యాల జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అందుకోసం అవసరమైన ఉన్నతాధికారులతో నిత్యం సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తమ ప్రభుత్వం కొనుగోలు చేసి తీరుతుందని పేర్కొన్నారు. నారాయణపురం రిజర్వాయర్, కొండగట్టు ఎత్తిపోతల పథకం,, కలికోట సూరమ్మ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో రాజకీయాలు ఉండవని మంత్రి తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో ప్రతిపక్ష ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను కూడా తీసుకుంటామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చెప్పారు. రాజకీయాలు అతీతంగా తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కలెక్టర్లు మరో వారం రోజులపాటు కొనుగోలు పట్ల ప్రత్యేక శ్రద్ధ కొనసాగించాలని , జిల్లాలో అవసరమైన మేర ధాన్యం రవాణా కోసం వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడా లారీలు కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలులో జాప్యం జరగవద్దని లారీల కొరత ఉన్నచోట ట్రాక్టర్లను ఏర్పాటు చేసి వెంటవెంటనే మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. భారతదేశంలో మొదటి సారిగా రాష్ట్రంలోనే 84% జనాభాకు ఉచితంగా ఆరు కిలోల సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. దేశ చరిత్రలోనే విప్లవాత్మకమైన పథకమని సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతున్నామని తెలిపారు. సన్న బియ్యం సరఫరా వల్ల రేషన్ అక్రమాలు గణనీయంగా తగ్గిపోతాయని, ప్రజలకు 100% ఆహార భద్రత లభిస్తుందని అన్నారు. భారతదేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పథకం అమలు కావడంలేదని మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొన్నారు.



మేడిగడ్డ ప్రాజెక్టు అంశంలో జ్యుడీషియల్ కమిషన్ కు నాయకులు సహకరించాలని మంత్రి కోరారు. జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ప్రకారం తప్పనిసరిగా చర్యలు ఉంటాయని అన్నారు. మీడియా మిత్రులకు ఎస్సారెస్పీ దగ్గర అందుబాటులో ఉన్న భూములు పంపిణీకి ఉన్న సమస్యలు పరిష్కరించి త్వరలోనే ఇంటి పట్టాలు కేటాయిస్తామని అన్నారు. కరీంనగర్ మీడియా మిత్రులు ఇండ్ల పట్టాల పంపిణీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ తో చర్చించి త్వరలోనే పట్టాలు అందించే కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాలన దక్షత కారణంగా దేశంలోనే అత్యధికంగా వరి పంట మన తెలంగాణ రాష్ట్రంలో సాగు జరిగిందని, అదే స్థాయిలో భారీ ఎత్తున కొనుగోలు కూడా చేశామని అన్నారు. ఎన్.డి.ఎస్.ఏ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా పాటిస్తామని అన్నారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల పరిహారం క్రింద 51 కోట్లు విడుదల చేశామని అన్నారు. తడిసిన ధాన్యం కూడా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. అకాల వర్షాలతో రైతుల నష్టపోకుండా అవసరమైన టార్పాలిన్ కవర్లు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో పెట్టాలని అన్నారు. భూ భారతి చట్టంతో పట్టాదారులకు ఎటువంటి నష్టం రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పట్టాదారులను భయభ్రాంతులకు గురి చేసి గతంలో పేరు మారిన పట్టాలు సైతం అసలైన అర్హులకు చేరాలని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ కార్డు సర్వే నెంబర్, యాజమాన్యం, విస్తరణ, బౌండరి వివరాలు ఉండేలా అందిస్తామని అన్నారు. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందాలని, పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక జరగాలని అన్నారు.

## నీచ రాజకీయాలచేసే అలవాటు బిజెపికి లేదు

తెలంగాణ వెలవెలబోతోందని వ్యాఖ్యానించారు. అందుకే తెలంగాణలో భాజపా అధికారంలో ఉంటే బాగుండని ప్రజలు భావిస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో ఎవరూ కొత్తగా పార్టీ పెట్టబోరని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థం కావడం లేదని తెలిపారు. భాజపా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా స్టేట్ ఫైట్ తప్ప.. స్ట్రీట్ ఫైట్ చేయదు. అప్పుల ఊబి నుంచి రాష్ట్రం బయటపడాలంటే భాజపా అధికారంలోకి రావాలన్నారు. కవిత తెలంగాణ వాదులను కలవడం నేరం కాదు..కానీ, నాయకులు, కుటుంబీకుల ఫోన్లు ట్యాప్ చేయడం మాత్రం నేరం. ఇవన్నీ నేర్పించింది కేసీఆర్ కాదా? నేతల మధ్య కంచెలు నాటింది కేసీఆర్.. దాన్ని రేవంత్ కొనసాగిస్తున్నారు. కేసీఆర్ ఎదురుపడితే నమస్కారం పెడతా.. అది సంస్కారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు బాధ్యతాయతమైన ఎంపీగా, ఆర్థికశాఖ మాజీ మంత్రిగా హాజరవుతానని ఈటల తెలిపారు.భారాస.. భాజపాలో ఎందుకు విలీనమవుతుంది. మేమెందుకు వారిని చేర్చుకుంటాం. ఉద్యమకారులను కలిసి ఎమ్మెల్సీ కవిత ఏం చేస్తారు. కవిత దగ్గర ఉద్యమకారుల జాబితా ఉందా? మావోయిస్టుల అంశంపై కేసీఆర్ ద్వంద్వ వైఖరి కనబరిచారు. అధికారంలోకి రాకముందే జైలుకు వెళ్లి.. కూర రాజన్నను కలిశారు. అధికారంలోకి వచ్చాక నెల రోజుల్లోనే ఆయనలో భూమికి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా వచ్చింది. ఇటీవల నిర్వహించిన భారాస సమావేశంలో అపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు రాశారా అని ఈటల ప్రశ్నించారు. ఇకపోతే కొత్తగా ఎవరు పార్టీ పెట్టినా నమ్మే పరిస్థితి లేదని ఈటల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలో కలుపుతున్నారన్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవిత జైల్లో ఉన్నప్పుడు విలీనం కోసం బీఆర్ఎస్ ప్రయత్నం చేయొచ్చన్నారు.. బీజేపీ నుంచి ఎవరూ ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను కలుస్తానని కవిత అంటోందని.. కవిత కలిసి ఏం చేస్తదని విమర్శించారు. అందులో కొందరు చనిపోయారని.. కొందరు ఇంకెక్కడో ఉన్నారో తెలియదు, మరి కొందరు పార్టీలు మారారని చెప్పారు. రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ ముంచితే.. పది నెలల్లోనే రేవంత్ ముంచాడని ఎద్దేవా చేశారు. వీళ్లకు మరోసారి ఓటు వేయద్దొని ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు. పక్క రాష్ట్రం కేంద్ర సహకారంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని.. ఇక్కడ మాత్రం అప్పులతో ఇబ్బంది పడే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలంటే బీజేపీ వస్తేనే సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కవిత విలీనం కామెంట్లపై ఈటల రాజేందర్ స్పందించారు.. గాలి వార్తలకు నేను ఏం సమాధానం చెప్పాలి.. తెలిస్తే చెబుతా కానీ, తెలియకుండా ఏం చెప్పాలి.. నేను జిమేదార్ ఉన్న రాజకీయ నాయకుడిని.. వాస్తవం ఉంటే మాట్లాడతా, లేకుండా మాట్లాడనని స్పష్టం చేశారు.

## రాష్ట్రం పునర్నిర్మాణమే లక్ష్యం

ప్రమాణాలు మెరుగుపర్చడం నా జీవిత ఆశయం. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ తెలుగుదేశం పార్టీ. నా కష్టం నాకోసం కాదు.. నన్ను నమ్మిన జనం కోసం పాటుపడుతున్నానని అన్నారు. మూడ్రోజుల కడప మహానాడు ముగింపు సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. దేశానికి ఉగ్రవాదుల వల్ల చాలా నష్టం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదుల వల్ల కూడా అంతే నష్టం. ఆర్థిక ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తాం. రాజకీయాల ముసుగులో ల్యాండ్, శాండ్, మైన్స్ దోచేశారు. డ్రగ్స్, గంజాయి అమ్మితే అదే చివరి రోజని హెచ్చరిస్తున్నా. ఆడబిడ్డల జోలికి వస్తే అవే వారికి అంతిమ ఘడియలు అని హెచ్చరించారు. మనం కలిసికట్టుగా ఉంటే.. వైకాపా అడ్రస్సే ఉండదని చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవుని గడపలో తొలి మహానాడు సూపర్ హిట్ అయిందని చంద్రబాబు అన్నారు. కడప..తెలుగుదేశం పార్టీ అడ్డా అన్నారు. అది నిరూపించేందుకే ఇక్కడ మహానాడు నిర్వహించామన్నారు. అన్ని దారులు కడపవైపే ఉన్నాయి.. పార్టీ శ్రేణులతో కడప దిగ్బంధమైంది. కడప గడపలో మార్పు కనిపిస్తోంది. అహంకారంతో విర్రవీగే వారికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు. వైకాపాకు రాయలసీమలో 7 సీట్లు వస్తే.. కడప జిల్లాలోనే కూటమి 7 గెలిచింది. 2029 ఎన్నికల్లో ఉమ్మడి కడపలో పదికి పది స్థానాలు గెలవాలి. తెదేపా కార్యకర్తలే నా బలం, బలగం. మొన్నటి విజయం వెనుక కార్యకర్తల పోరాటం, త్యాగం, కష్టం ఉంది. గత పాలనలో హింసా రాజకీయాలు, కేసులు, అణచివేతలు రాజ్యమేలాయి. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిస్తామని తెదేపా, జనసేన, భాజపా కూటమి ఏర్పాటు– చేసి ప్రజలముందుకొచ్చాం. 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో అదిరిపోయే విజయం సాధించాం అని వివరించారు. ప్రజలకు అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందిస్తాం. జూన్ 12 నాటికి 500 సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. వాట్సప్‌లో హాయ్ అని పెడితే పనులు జరుగుతాయి. 2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. గత పాలనలో భూతానికి పరిశ్రమలు వెనకడుగు వేశాయి. భూతాన్ని శాశ్వతంగా భూస్థాపితం చేస్తున్నామని హామీ ఇచ్చా. రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత నాది. రాయల సీమను రాష్ట్రానికి మణిహారంగా మారుస్తాం. రాయలసీమ అభివృద్ధికి బ్లూప్రింట్ ఉంది. ఆరు నెలల్లో కడప హజ్‌హౌస్ పూర్తి చేస్తాం. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా వస్తుంది. జూన్ 12లోగా కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. జన సముద్రంతో కడప నిండిపోయింది అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంచి చేస్తే ప్రజలు అండగా ఉంటారని కడప ప్రజలు నిరూపించారు.. ఉదయం నుంచి అన్ని దారులు కడప వైపే చూస్తున్నాయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జరిగిన మొదటి మహానాడు సూపర్ హిట్ అయింది.. కడప గడపలో మార్పు వస్తుందని ఆనాడే చెప్పాను.. అహంకారంతో విర్రవీగే వారికి కడప జిల్లా ప్రజలు బుద్ధి చెప్పారు.. 2029లో పదికి పది సీట్లు సాధించడానికి మీరు సిద్ధమా.. సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు.. రాయలసీమలో వైసీపీకి ఏడు సీట్లు– వస్తే, కూటమికి అధిక సీట్లు– వచ్చాయి.. ఓడిపోయిన పార్టీ ఇప్పటికీ అర్థం చేసుకోలేదు అర్థం చేసుకోదు కూడా.. ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి పుట్టిన పార్టీ టీడీపీ.. ప్రపంచంలోనే ఒక కేస్ స్టడీ వైసీపీ అని చంద్రబాబు మండిపడ్డారు. ఇక, ఎన్నికల్లో గెలుపులు ఓటములు కొత్త కాదు.. కార్యకర్తలే నా బలం బలగం అని సీఎం చంద్రబాబు అన్నారు. జనసేన, బీజేపీతో కలిసి కూటమి ఏర్పాటు– చేసాం.. దాని ప్రభావం అంతా ఇంతా కాదు.. 83 మంది ఎమ్మెల్యేలకు 30 వేల మెజార్టీ వచ్చింది అన్నారు. ముగ్గురికి 90 వేల పైన మెజార్టీ వచ్చింది.. గొడ్డలి పోటుమన రాజకీయం కాదు..

ప్రతి క్షణం కష్టపడి పని చేయడం మన విధానం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేశాం.. ఎస్సీలకు సామాజిక న్యాయం చేసింది.. ఇక, టీడీపీకి వెన్నెముక బీసీలు.. బీసీలకు నేను సామాజికంగా ఆర్థికంగా పెద్దపీట వేస్తాను అన్నారు. రూ. 47,756 కోట్లు కేటాయించాం.. ఎస్సీ, ఎస్టీలకు రుఫ్టాప్ సోలార్ ఏర్పాటుకు ఉచితంగా డబ్బులు ఇస్తాం.. బీసీలకు మూడు కిలోవాట్ల వరకు 98,000 సబ్సిడీ ఇస్తాం అని హామీ ఇచ్చారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా చేపడతాం అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసింది టీడీపీ.. కూటమి ప్రభుత్వం రాకుండా ఉండి ఉంటే మీ భూములు గోవిందా అయ్యేవి.. ఇక, రాబోయే మహానాడు నాటికి భూ సమస్యలు లేకుండా చూస్తానని చంద్రబాబు అన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో 10 నిమిషాల్లో టెర్రరిస్టుల స్థావరాలను మన సైన్యం ధ్వంసం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అలాగే, డ్రగ్స్, గంజాయితో యువత నిర్వీర్యమైపోయింది.. ఎవరైనా సరే గంజాయి, డ్రగ్స్ అమ్మితే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. మా ఆడబిడ్డల జోలికి వస్తే ఖబడ్దార్ జాగ్రత్తగా ఉండండి అన్నారు. ఇక, పోలవరం రాష్ట్రానికే ఒక వరం.. కేంద్రానికి చెప్పి పోలవరాన్ని ఒక గాడిన పెట్టాం.. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తాం.. గత పాలనలో మూడు ముక్కలు ఆట ఆడి రాజధాని లేకుండా చేశారు అని సీఎం చంద్రబాబు ఆరోపించారు.

## చిన్నారులను ఆశీర్వదించిన జాజుల శ్రీనివాస్ గౌడ్



**మునుగోడు,మే29(వెలుతురు):**
మండలంలోని సింగారం గ్రామానికి చెందిన కుంభం దయాకర్ రెడ్డి–వాణి దంపతుల కుమారుడు,కుమార్తె నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం మండల కేంద్రంలోని పి.ఆర్.ఆర్ గార్డెన్ లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి బి సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బి సి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్,విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ , జాజుల ప్రభాకర్,వీరమల్ల కార్తీక్,వీరమల్ల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాల ఆదాయం రూ.2.83 కోట్లు



**భూపాలపల్లి జిల్లా వెలుతురు మే 29:**
భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన సరస్వతి పుష్కరాలు సోమవారంతో ముగిసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కాళేశ్వరంలో పుష్కర హుండీని అధికారులు లెక్కించారు. 12 రోజులకు రూ. 2.83 కోట్లు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా వచ్చిన ఈ పుష్కరాలకు తెలంగాణతో పాటు ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ తదితర రాష్ట్రాల నుంచి 30 లక్షల మంది భక్తులు వచ్చారు.

## పూలే చిత్రానికి పన్ను నుండి మినహింపు ఇచ్చి తెలుగులోకి అనువదించాలి.

\- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 29:**
పూలే చిత్రాన్ని పన్ను నుండి మినహాయించి తెలుగులోకి అనువదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు టిపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు మరియు ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలల్లో గ్రామాలలో దానినీ ప్రదర్శించాలని ఆ చిత్రంలో చదువు యొక్క ప్రాముఖ్యతను, దాని విలువను గొప్పగా చూపారని అన్నారు. ఈ చిత్రాన్ని పన్ను రహితంగా చేయడం వలన విస్తృత ప్రచారానికి సాధ్యమవుతుందని మరియు విద్యార్థులు మరియు సాధారణ ప్రజలు మహాత్మా జ్యోతిబా పూలే యొక్క భారతదేశ సామాజిక సంస్కరణ ఉద్యమ చరిత్రను బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుం దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్, ఓయు జెఎసి చైర్మన్ బండి నరేష్,మాల మహానాడు అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో అలసత్వం తగదు

**హైదరాబాద్,మే29( వెలుతురు):**
ఇందిరమ్మ ఇళ్ల జాబితా రూపకల్పనలో అలసత్వం తగదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నిబంధనల మేరకు జాబితా సిద్ధంచేయాలన్నారు. నిర్దేశిత సమయానికి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ల తీరుపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అనుమతుల మంజూరులో నిర్లక్ష్యం తగదన్నారు. జూన్ 6లోపు లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాతో ప్రొసీడింగ్స్ కాపీలను అందించాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటి నియంత్రణకు పోలీస్, వ్యవసాయ శాఖ సమన్వయంతో పని చేయాలన్నారు.

# నకిలీ విత్తనాలు, ఎరువుల అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలి

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హన్మకొండ వెలుతురు మే 29:**




నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను ఉక్కు పాదంతో అరికట్టాలన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మినట్లయితే ఉపేక్షించేది లేదు. పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిలో ఎంతటి వారైనా ఉన్నా సరే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలులో మొదటి స్థానంలో రాష్ట్రం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారులకు ఏజ్ లిమిట్ లేదు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిర్లక్షం పట్ల కలెక్టర్ల పై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫైర్.. జిల్లా కలెక్టర్లకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇకపై ఇలాంటి నిర్లక్ష్యం ఉంటే కుదరదు ఇప్పటివరకు కనీసం 50 శాతం కూడా లిస్ట్ ప్రకటించక పోవడం బాధాకరం బెనిఫిషర్ లిస్ట్ ఫ్రేమ్ కట్టుకోవడానికి కాదు.. కలెక్టర్లు ఎందుకు జాప్యం చేస్తున్నారు.. ఒక్కో కలెక్టర్ పరిధిలో ముగ్గురికి మించి ఎమ్మెల్యేలు లేరు, ఎందుకు సమన్వయం చేసుకోలేక పోతున్నారు.. ఇందిరమ్మ ఇళ్ల పోస్టింగ్స్ లబ్ధిదారులకు ఇవ్వకుండా మీ దగ్గర పెట్టుకోవడం కలెక్టర్లకు సరికాదు జూన్ 06 లోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలి లబ్ధిదారుల ఎంపికలో వయో పరిమితి లేదు.. జూన్ 6 కటాఫ్ డేట్ గా ఇందిరమ్మ ఇళ్ల పథకం అప్లికేషన్ల క్లియర్ చేయాలి.. గురువారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో జిల్లా ఇంచార్జ్ మంత్రి, రా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, తదితరులతో కలిసి ధాన్యం కొనుగోళ్లు, సేకరణ, వ్యవసాయం, వర్షాకాలం ముందస్తు ప్రణాళికా, ఇద్దరమ్మ ఇండ్లు, భూ భారతి, వరంగల్ ఎయిర్ పోర్టు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు,



# సబండ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప సామాజికవేత సురవరం ప్రతాపరెడ్డి.

- **బుల్లెట్ చెయ్యలేని పనులు సాహిత్యం చేస్తుంది.**
- **ప్రారంభ సభ ముఖ్య అతిథి. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి**
- **ముగింపు సభ ముఖ్య అతిథి. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు మే 29:**
తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో గోలుకొండ సాహితీ కళా సమితి, తెలుగు భాషా చైతన్య సమితి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి ముగింపు సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజం స్వార్థంతో నిండిపోయిందని ఈ కలుషితమైన సమాజాన్ని శుద్ధి చేయవలసిన బాధ్యత ఈ తరం కవుల పైన ఉన్నదని అన్నారు. బుల్లెట్టు చెయ్యలేని పని కలం చేస్తుందని పేర్కొన్నారు. సాహిత్యం యొక్క గొప్పతనం స్వాతంత్ర పోరాటంలో గాని నిజాం విముక్త పోరాటంలో గాని ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తెలిసి వచ్చిందన్నారు. సురవరం ప్రతాప రెడ్డి గారి జయంతి ఉత్సవాలు ప్రభుత్వం తరపున జరపడానికి ప్రయత్నం చేస్తానని సురవరం ప్రతాపరెడ్డి గారి పేరు మీద ఉత్తమ పరిశోధకులకు మరియు కవులకు పురస్కారాలు అందజేసేందుకు గాను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. ఉదయం ప్రారంభ సభకు తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నా రెడ్డి పాల్గొని సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి ఉత్సవాలను



ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో చిన్నారెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి గారి సాహితీ సేవను తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరూ తెలుసుకునే విధంగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో మరియు వనపర్తి పట్టణంలోనూ ప్రధాన కూడలిలో ఆయన విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు గాను ప్రయత్నిస్తానని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి సబ్బండ వర్గాలకు అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప సామాజికవేత్తయని పేర్కొంటున్నారు. సమాజంలో ఉన్న లోపాలను ఆనాటి ఆయన రచనలలో పేర్కొని సమాజాన్ని మార్చే ప్రయత్నం చేశారని గోల్కొండ పత్రికను నడిపి ఆనాటి ప్రభుత్వాలను మార్చే విధంగా నా రాతలు ఉండేవని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడే సాబ్ గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షులు అర్ధచంద్ర ప్రకాష్ రెడ్డి. ఉపాధ్యక్షులు గంటా మనోహర్ రెడ్డి తెలుగు భాష చైతన్య సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎడ్ల కల్లేష్ ఉపాధ్యక్షులు శ్రీ పబ్బేటి మల్లికార్జున. ఈ కార్యక్రమంలో సభా ప్రారంభకులు సురవరం కృష్ణ వర్ధన్, సభాధ్యక్షులు గంటా మనోహర్ రెడ్డి, గౌరవ అతిథి ఎన్ బాలా చారి ప్రత్యేక అతిథి ఏనుగు నరసింహారెడ్డి. వెలుదండ నిత్యానంద రావు మరియు పాలడుగు సరోజినీ దేవి నక్క



శ్రీనివాస్ యాదవ్ డాక్టర్ రాధా కుసుమ పాల్గొన్నారు. ముగింపు సభలో సభాధ్యక్షులుగా అర్ధచంద్ర ప్రకాష్ రెడ్డి, గౌరవ అతిథులు జే చెన్నయ్య, దొరవేటి చెన్నయ్య, ప్రజ్ఞా రాజు, రామకృష్ణ చంద్రమౌళి, నాలేశ్వరంశంకరం, గజవెల్లి సత్యనారాయణ స్వామి

## పాక్‌తో యుద్ధం అర్థంతరంగా ఎందుకు ఆపారు

జై హింద్ యాత్ర అనంతరం నిజాంపేట కొలన్ గోపాల్‌రెడ్డి కన్వెన్షన్‌లో ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ.. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్థంతరంగా ఆపేశారా అని నిలదీశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం ఆపానని ప్రకటించారని గుర్తుచేశారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధాంతరంగా ఆపేశారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. పీవోకేను స్వాధీనం చేసుకోవాలని మోదీతో తాము చెప్పామని అన్నారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌ను ఓడించామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. భారత్ వైపు ఎవరు కన్నెత్తి చూసినా కనుగుడ్లు పీకేస్తామని.. చైనాకు ఇందిరాగాంధీ వార్నింగ్ ఇచ్చారు. గతంలో యుద్ధం ఆపాలని ఇందిరాగాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారు. ఇందిరాగాంధీ అమెరికా బెదిరింపులకు లొంగలేదు. నాటి ఇందిర యుద్ధతంత్రాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఇందిరాగాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి. 1967 చైనా, 1971లో పాకిస్థాన్‌ని ఓడించినందుకా కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనుకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలి. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు. భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు- పెడతారా. యుద్ధం అంటే ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. భారతదేశ భద్రత విషయంలో అందరం ఏకమవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాలకు అండగా నిలిచామని ఉద్ఘాటించారు. దేశంపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని ధ్వజమెత్తారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడిస్తే.. 14 రోజుల్లోనే మల్కాజ్‌గిరిలో ఎంపీగా గెలిపించారని ఉద్ఘాటించారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికయ్యానని.. ఇప్పుడు తెలంగాణ సీఎంగా ప్రజల ముందుకువచ్చానని గుర్తుచేసుకున్నారు. మేం నిర్వహించిన ర్యాలీ ఎన్నికలు, ఓట్ల కోసం కాదు.. సైనికుల ఆత్మ స్థయిర్యం, ఆత్మగౌరవం నిలబెట్టడానికి. కాలం చెల్లిన రూపాయి ప్రధాని మోదీ. దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం. బలూచిస్థాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయమన్నాం. ఇది చేతకాదు కానీ.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. యుద్ధంలో ఎన్ని రఫెల్ విమానాలు నేలకూలాయో లెక్క చెప్పండి. పాక్‌ను ఓడించాలంటే ఇందిరాగాంధీ మార్గంలో..నడవాలని ప్రధాని మోదీకి సూచించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ముదిరి పాకాన పడ్డ కెసిఆర్ కుటుంబ రాజకీయాలు




గొడుగు కిందకు చేరుస్తు న్నారంటూ మండిపడ్డారు. వందిమాగధులతో విమర్శలు చేయిస్త ఊరుకునేది లేదని ఘాటు హెచ్చరికలు చేశారు. తనను సవాల్చేయాలనకుంటే ఉఫ్‌న ఊదేస్తానని హెచ్చరించారు. ట్విట్టర్ రాజకీయాలను సహించేది లేదని తేల్చారు. మొత్తంగా అన్న కెటిఆర్‌పై కవిత యుద్ధం ప్రకటించారు. పట్టుతప్పుతున్న పార్టీని కాపాడుకోవడమే తన లక్ష్యమని చెప్పకనే చెప్పారు. ఈ మేరకు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం కవిత మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు నీతులు చెబుతోన్న బీఆర్‌ఎస్ పార్టీ నేతలు.. తెలంగాణ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలంటూ సూచించారు. కేసీఆర్ నీడలో పని చేస్తోన్న వారు.. తనపై ప్రతాపం చూపిస్తున్నారంటూ మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని ఆమె తెలిపారు. తాను జైలులో ఉన్నప్పుడే కుట్ర మొదలైందన్నారు. ఇంటి ఆడబిడ్డపై పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తారా అని పరోక్షంగా కెటిఆర్ మండిపడ్డారు. జైలుకు వెళ్లేటప్పుడే పార్టీకి రాజీనామా చేస్తానన్నానని తెలిపానని అన్నారు. పార్టీ సోషల్ మీడియాలో తనను టార్గెట్ చేశారని, తన లేఖ లీక్ చేసిందెవరో చెప్పాల్సిందేనని మండిపడ్డారు. లీకు వీరులను పట్టుకోమంటే, గ్రీకువీరులు దండెత్తారని మండిపడ్డారు. తన జోలికి వస్తే బాగుండదని అంటూనే తానసలే మంచిదానిని కాదన్నారు. కేసీఆర్‌ను తామే నడిపిస్తున్నామని చెప్పుకుంటున్నారని, కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లా మీరు..అని ప్రశ్నించారు. తనపై తప్పుడు వార్తలను పార్టీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు వస్తే ఎందుకు నిరసనలు తెలపలేదని, ఇంకో నేతకు నోటీసులు వస్తే ఎందుకు హంగామా చేశారని ప్రశ్నించారు. తాను వాళ్లలా చిల్లర రాజకీయాలు చేయనని, హుందాగా ఉంటానని పేర్కొన్నారు. పార్టీ చేయాల్సిన పనులు జాగృతి తరపున చేస్తున్నానని, కోవర్టులు ఉన్నప్పుడు ఎందుకు పక్కన పెట్టడం లేదని అన్నారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ ఒక్కరే నాయకుడని, పార్టీలో ఇంకెవరి నాయకత్వాన్ని అంగీకరించనని నిర్మొహ మాటంగా తేల్చేసారు. మా నాన్నకు తాను లేఖ రాస్తే తప్పేంటి? అయినా నీకు నొప్పి ఏందిరాబయ్? అంటూ ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత తన అన్న కెటిఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. ఇంటి ఆడబిడ్డపై ఎటు పడితే అటు మాట్లాడితే సరి కాదన్నారు. దమ్ముంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీపై మీ ప్రతాపం చూపించాలంటూ ఈ సందర్భంగా పార్టీ నేతలకు ఆమె సవాల్ విసిరారు. తాను అసలే మంచి దాన్ని కాదని.. తాను నోరు విప్పితే తట్టుకోలేరంటూ బీఆర్‌ఎస్ నేతలను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేయకుండా.. ట్విట్టర్‌లో మెసేజ్‌లు పెడితే సరిపోతాయా? అంటూ ఆమె ప్రశ్నించారు. తనను రేవంత్ రెడ్డి కోవర్ట్ అనటం కరెక్టేనా అని నిలదీశారు. పెయిడ్ ఆర్టిస్ట్‌లతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ పార్టీ నేతలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓ మునిగిపోయే నావ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌తో రాయబారాలు జరిపే అవసరం తనకు లేదన్నారు. తనకు, కేసీఆర్ మధ్య దూరం పెంచే కుట్ర జరుగుతోందన్నారు. తనను దూరం చేస్తే ఎవరికి లాభమో అందరికీ తెలుసునని, కావాలనే తనను ఎంపీ ఎన్నికల్లో ఓడించారని కూడా కవిత భగ్గుమన్నారు. పార్టీని బీజేపీలో కలపాలని చూస్తున్నారు. బీజేపీలో విలీనం చేయొద్దని చెప్పాను. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనంపై.. నేను జైల్లో ఉన్నప్పుడే అడిగితే చెప్పాను. 101 శాతం బీజేపీలో కలిపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఉంటే బీజేపీలో కలపడం కుదరదని.. అందుకే నన్ను కేసీఆర్‌కు దూరం చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనపై, తన రాజకీయ భవిష్యత్తుపై జరుగుతున్న కుట్రలపై స్పష్టంగా మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లోనే ఉన్న కొందరు కోవర్టులు నన్ను ఓడించేందుకు ప్రయత్నించారని, పేయిడ్ న్యూస్‌లు వేసి, లేఖల్ని లీక్ చేసి, బీజేపీలోకి బీఆర్‌ఎస్‌ను కలిపే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండాలంటే ట్వీట్లు- చేయడం మాత్రమే కాదు, కార్యాచరణ చూపించాలి. పార్టీ నడిపించే సత్తా మీకు లేదని నన్ను తప్పుబడుతున్నవారు ముందుగా వాళ్లు ఏం చేశారో చెప్పాలని అంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. తమపై కుట్రలు జరుగుతున్నాయని, తనను బీఆర్‌ఎస్ నుంచి బయటకు నెట్టాలని ప్రయత్నాలు జరుగు తున్నాయని కవిత ఆరోపించారు. నాకు ఒక్క నాయకుడు మాత్రమే ఉన్నాడు..ఆయన కేసీఆర్. కొత్త పార్టీలు ఎందుకు..ఉన్న బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను కాపాడితే చాలు. తెలంగాణ జాగృతి ద్వారా నేను పార్టీకి, రాష్ట్రానికి సేవ చేస్తున్నా,అని స్పష్టం చేశారు. నేను పదవులు అడిగినవాళ్లలోని కాదు. కేసీఆర్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో పని చేస్తున్నా. నా కడుపులో బిడ్డ ఉన్నప్పుడు కూడా తెలంగాణ కోసం పోరాడిన నేను.మామూలు నాయకురాలు కాదు. నాతో పెట్టుకుంటే తీపిగా ఉండదని ఇప్పటికైనా గ్రహించాలి,అంటూ కవిత మరోసారి వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ నేతలకు చెందిన హాస్పిటల్స్ ప్రారంభోత్సవాలకు వెళ్ళింది ఎవరో అందరకీ తెలుసునంటూ పార్టీలోని అగ్రనేతలను ఆమె పరోక్షంగా విమర్శించారు. తన లేఖ లీక్ చేసిందెవరు తేల్చమంటే.. తనపై పడి ఏడుస్తున్నారంటూ మండిపడ్డారు. పదవులు కోరినట్లు తనపై పత్రికల్లో తప్పుడు వార్తలు రాయించారన్నారు. కేసీఆర్ లెక్క.. తాను చాలా తిక్కదానినని ఆమె పునరుద్ఘాటించారు. వెన్నుపోటు రాజకీయాలు తనకు రావని.. సూటిగా మాట్లాడుతానని కుండ బద్దలు కొట్టారు. సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానన్నారు. మావాళ్ళు కొందరు..సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. వారు స్థాయికి మించి ఊహించుకుంటు న్నారంటూ ఎద్దేవా చేశారు. వరంగల్ సభ తమ వలనే సక్సెస్ అయిందని కొందరు ఊహించు కుంటున్నారన్నారు. కేసీఆర్‌ను మోసేంత పెద్ద వాళ్ళు అయిపోయామని వారంతా భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిజామాబాద్ ఎంపీగా తనను ఓడించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా ఉండగా చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ఏమి చేసినా.. కేంద్రం అడ్డుకోవటం లేదని ఒకింత అసహనాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇప్పటికీ గోదావరి నదీ జలాలు పంపకం సరిగా జరగలేదన్నారు. ఏపీ చేపట్టనున్న బనకచర్ల ప్రాజక్టుతో తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ మాత్రమే తన నాయకుడని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ తప్ప.. ఇతర నేతల నాయకత్వంలో తాను పనిచేయనని కుండ బద్దలు కొట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న వారిని గౌరవిస్తానని కవిత పేర్కొన్నారు.

వెలుతురు ఎడిటోరియల్

https://epaper.velthuru.com


# సంపాదకీయం..

## కులమతాలే రాజకీయ ఎజెండా !

దశంలో కుల రాజకీయాలు మళ్లీ ఊపందుకున్నాయి. కులాల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నది మాత్రరం..అగ్రకులాల వారే. ఇతర కులాల వారికి ఓ బొక్కేసి...వారిపేరు చెప్పి అధికారం చెలాయిస్తున్నారు. అంతే తప్ప వారికి రాజ్యాధికారం మాత్రం అప్పగించడం లేదు. ఎస్సీ,ఎస్టీలకు అధికారం చెలాయించే పదవులు లేనేలేవు. రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము ఉన్నా... ఆ పదవి ఓ ఉత్సవ విగ్రహం లాంటిదే. పార్టీ అధ్యక్ష పదవులు మొదలు సిఎంలు, ప్రధానులు, ఇలా అంతా అగ్రకులాల పెత్తనమే నడుస్తోంది. బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను కేవలం ఓటు బ్యాంక్ చేసుకుని రాజకీయాలు చేస్తూ..అధికార పెత్తనం చెలాయిస్తూ దేశాన్ని అభివృద్దిలో పరుగులు పెట్టకుండా అడ్డుకుంటున్నారు. కులాల కుంపట్లు రగిల్చి సాధించేదేమీ లేదు. అవతల అన్ని దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే మనం మాత్రం కులాలు, వర్గాలు అంటూ కొట్టుకు చస్తున్నాం. దీనికితోడు సిద్ధాంత నిబద్ధత లేని రాజకీయాలు సాగుతున్నాయి. విద్వేషాలు, విభేదాలతో రాజకీయాల్లో నెగ్గుకు కావడం కుదరదు. దేశంలో అనేక తప్పిదాలకు కారణమైన కాంగ్రెస్ ఇప్పుడు ఎదుటి పార్టీని విమర్శిస్తూ అధికరాం కోసం అర్రులు చాస్తోంది. ఇకపోతే అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఎ పదేళ్ల కాలంలో చేసినన్ని తప్పులు లెక్కించడానికి సమయం సరిపోదు. పదేళ్లలో దేశాన్ని వెనక్కి నెట్టిన ఘనులు వీరు. ఆపరేషన్ సిందూర్‌ను విమర్శించడం దారుణం కాక మరోటి కాదు. గతంలో సర్జికల్ స్ట్రయిక్స్‌ను సైతం విమర్శించారు. ఇవన్నీ ప్రజలు ఇంకా మరచిపోలేదు. వీటిని విస్మరించి బిజెపి చేస్తున్న పాలనపై విమర్శలు చేయడం ద్వారా తమ తప్పులను కప్పిపుచ్చు కోవడం కుదరదు. దమ్ముంటే తాము చేసి తప్పులను, తప్పుడు నిర్ణయాలపై చర్చకు రావాలి. ఇకపోతే ఎంతసేపు విభజించు పాలించు అన్న రీతిలో కులమతాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావడం కూడా కుదరకపోవచ్చు. కేవలం బిజెపి హిందుత్వాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పడం ద్వారా మైనార్టీ ఓట్ల కోసం వెంపర్లాడే రాజకీయాలను అన్ని పార్టీలు దూరం పెట్టాలి. నిజానికి మైనార్టీల సంతుష్టీకరణతో విభజన రేఖలు గీస్తున్నది రాజకీయ పార్టీలే. అన్ని వర్గాలను సమానంగా చూసే రాజకీయాలు దేశానికి అవసరం. ఇప్పటికే మత ప్రాతిపదికన దేశం విచ్ఛిన్నం అయ్యింది. దేశ విభజన జరిగింది. ఇంకా ఆ పీడకల నుంచి మనం బయటపడలేదు. ఈ క్రమంలో సమాజంలో జరుగుతున్న అకృత్యాలను ఎవరు చేసినా..చేపట్టినా నిర్ద్వందంగా ఖండించాల్సిందే. అఘాయిత్యాలను ఎత్తి చూపాల్సిందే. ప్రజా సంక్షేమానికి పోరాడాల్సిందే. ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని మంచి పాలన అందించేందుకు అసవరమైన సూచనలు ఇవ్వాల్సిందే. కానీ ఇంకా దేశంలో సగం జనాభాగా అవుతున్న వారిని కూడా మైనార్టీలుగా చూపుతూ.. ఓటు బ్యాంకుగా చూసే దుస్థితి పోవాలి. వారిని ఈ దేశ సంస్కృతి లో భాగంగా చూడాలి. అలాగే సమస్యలను అజెండాగా చేసుకుని పోరాడితే తప్ప ప్రజలు నమ్మరని గుర్తించాలి. ప్రధానంగా ఈ దేశంలో కమ్యూనిస్టులు ఇంకా మేల్కోవడం లేదు. పడికట్టు పదాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి రాజకీయ పబ్బం గడపాలనుకోవడం వారి దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. ప్రజల్లో ఐక్యతా నినాదాన్ని తీసుకుని రావాలి. కలసి పనిచేయాలన్న సంకల్పంతో ముందుకు సాగితే తప్ప ప్రజలు నమ్మరు. సమస్యలపై పోరాటం ప్రాతిపదికగా కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలి. అంతేగాని హిందుత్వ పేరుతో హిందువులను కించపరిచే రాజకీయాలు చేయడం మానాలి. ఎంతసేపు ఆర్‌ఎస్ఎస్ చేతుల్లో కేంద్రం కీలుబొమ్మగా మారిందనీ..మోదీ సర్కారు నియంతృత్వ విధానాలను అవలంబిస్తోందని, హిందుత్వ విధానాలు అవలంబిస్తోందని కాంగ్రెస్, వామపక్ష నేతలు చేస్తున్న విమర్శలు హిందువులను అవమానించడం తప్ప మరోటి కాదు. మతోన్మాదం విషయంలో లెఫ్ట్ రెండు నాల్కల ధోరణితో ఉంది.హిందువులు ఏదైనా చేస్తే దానిని భూతద్దంలో చూపించి హిందూ మతోన్మాదం అన్న ముద్ర వేస్తున్నారు. ముస్లిం తీవ్రవాదాన్ని మాత్రం గట్టిగా ఖండించడంలో నాలుకలు మడతపడే స్తున్నారు. ఇందుకు మొన్నటి పహల్గామ్ దాడి తరవాత ముస్లిం టెర్రరిజాన్ని గట్టిగా కడిగి పారేయడంలో రాజకీయ పార్టీలు వెనకంజ వేశాయి. అందుకే ఈ జాడ్యం నుంచి వారు బయటపడక పోవడంతో హిందువుల్లో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ టెర్రరిజం విషయంలో కఠినంగా లెఫ్ట్ ఉండలేక పోతోంది. మతోన్మాద రాజకీయాలను భాజపా సర్కారు ప్రోత్సహిస్తోందని.. అంటున్న వారు ఇస్లామిక్ ఉగ్రవాదుల ఊచకోతను తీవ్రంగా వ్యతిరేకించి అందుకు అనుగుణంగా ఉద్యమించ లేకపోతున్నారు. వామపక్షాల ఐక్యత అన్నది నినాదంగా మారుతోంది. ఏళ్లుగా ఈ విషయంలో తర్జనభర్జనలే తప్ప కార్యాచరణ లేకుండా పోవడానికి వారి పిడి వాదాలే కారణం. ప్రపంచం అంతా మారుతోంది. ఏ దేశమైనా సమస్యలతోనే పోరాడుతోంది. వీరు నమ్ముతున్న చైనా కూడా ప్రజల సమస్యలను ఎజెండా చేసుకునే పోరాడుతోంది. అయినా అక్కడ ఇస్లాంకు స్థానం లేకుండా అణచి వేస్తున్నారు. దీనిని ఇక్కడి కమ్యూనిస్టులు గుర్తించరు. ప్రస్తావించరు. చైనా తీరును ఎండగట్టరు. కానీ భారతదేశంలో కలసిమెలసి జీవించే విధంగా ప్రజలు ముందుకు సాగుతున్నా..వీరు ఆజ్యం పోస్తుంటారు. ఈ ప్రయత్నాల నుంచి వారు బయటప పడాలి. విపక్షాలు కూడా ప్రజల ఎజెండాతో ముందుకు సాగాలి. అప్పుడే ప్రజలు కూడా ఆదరిస్తారు. కులమతాలను పక్కన పెట్టి పేదల ఆర్థిక అభివృద్ధికి ముందుకు సాగాలి. పేదలు లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలి. అప్పుడే దేశం బాగుడపుతుంది.

# ఉనికి కోల్పోతున్న కమ్యూనిస్టులు

- బలమైన ప్రజా ఉద్యమాల నిర్వహణలో విఫలం
- కలసి నడవాలన్న ఆలోచనలకు దూరం



**న్యూఢిల్లీ,మే29( వెలుతురు):**
దేశంలో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్వహించిన లెఫ్ట్ పార్టీలు ఇప్పుడు చతికల పడ్డాయి. వాటికి ఎజెండా అన్నది లేకుండా పోయింది. బర్దన్, సీతరాం ఏచూరి వంటి మహానేతలు అంతరించడంతో వారి స్థాయినేతలు కానరావడం లేదు. కమ్యూనిస్టులు అనే పదం కాలం చెల్లిందన్న రీతిలో రాజకీయాలు సాగుతున్నాయి. ఇక లెఫ్ట్ ఐక్యత లేదా విలీనం విషయంలో సిపిఐ ఎప్పుడూ ఉదారంగా మాట్లాడుతుంటుంది. కానీ సిపిఐకి బలం లేకుండా పోయింది. ఇటీవల ఉన్న జాతీయ పార్టీ ముద్రను కూడా కోల్పోయింది. ప్రతిసారీ జరిగే లెఫ్ట్ సమావేశాల్లో ఐక్యత, ఐక్య పోరాటల గురించి చెబుతున్నా కార్యాచరణ అన్నది లేకపోవడం కారణంగా కమ్యూనిస్టులు ముందుకు సాగడం లేదు. అందుకే ఒక్కో రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోతున్నారు. సత్వర రాజకీయ అవసరాలపైనా చర్చించి ప్రజల్లో నమ్మకం కలిగేలా చేస్తే తప్ప లెఫ్ట్‌కు అవకాశాలు లేవనే చెప్పాలి.ఈ క్రమంలో తమ ఆలోచనలకు దగ్గరగా ఉన్న లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి ఐక్య కార్యాచరణ రూపొందించాలి. వామపక్ష ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలి. రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించేలా లెఫ్ట్ పార్టీలు ముందుకు రావాలి. ఈ క్రమంలో లెఫ్ట్ పార్టీలు నిర్మాణాత్మక రాజకీయాలకు పూనుకుంటే తప్ప ప్రజలు నమ్మరు. ఇప్పటి నుంచే ఈ రకమైన భావజాలంతో ముందుకు సాగితే ఫలితం ఉండొచ్చు. ఇకపోతే వారు తమ ఉనికిని మరచి రాజకీయాలు చేయడం వల్లనే ప్రజలకు దూరమవుతూ వచ్చారు. ప్రజలను కలుపుకుని పోరాడాలన్న ఆకాంక్ష కమ్యూనిస్టు కార్యకర్తల్లోఉన్నా నేతలు ముందరి కాళ్లకు బంధం వేస్తున్నారు. ఇతర పార్టీలతో పొత్తులకు వెంపర్లాడుతున్న లెఫ్ట్ నేతలు సంస్థాగతంగా బలహీనం అవుతున్నాయి. గతంలో కమ్మూనిస్టులకు ఉన్న ప్రజాదరణ కాలక్రమేణా కనుమరుగవుతోంది. మారుతున్న కాలానుగుణంగా సిద్ధాంతాలను మార్చుకోకపోవడం లేదు. వీరు ఎంతసేపూ మరో పార్టీకి తోకపార్టీగా మారడం మినహా గట్టిగా చేస్తున్న ప్రయత్నాలు చేయడం మానేశారు. ఆయా రాష్ట్రాల్లో పూర్తిగా అదృశ్యం అయిన లెఫ్ట్ పార్టీలు.. ఇతర పార్టీల తోక పట్టుకుని నడిచే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఆ పార్టీల్లో ఆత్మవిమర్శ అన్నది మచ్చుకైనా కానరావడం లేదు. పోరాటాల్లో ఆరితేరిన లెఫ్ట్ పార్టీలు ఎందుకనో ప్రజల్లో స్థానం సంపాదించు కోలేక పోతున్నారు. లెఫ్ట్ బలహీనం కారణంగా ఇతర రాజకీయ పార్టీలు తమ స్థానాలను పదిలం చేసుకోవడంతో పాటు బలపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం అవసరం. అందుకు లెఫ్ట్ పార్టీలు విభేదాలు పక్కకు పెట్టి కనీసం కూటమిగా అయినా ముందుకు సాగాలి. కానీ కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా కూటమి అవకాశాలను వారే దెబ్బతీస్తున్నారు. విలీనం కావాలన్న ఆశ ఎలాగూ నెరవేర నప్పుడు కనీసం కూటమిగా ముందుకు సాగాలన్న గట్టి నిర్ణయం తీసు కోవడం లేదు. ప్రస్తుతం దేశం క్లిష్టపరిస్థితులను ఎదుర్కొం టోందనీ.. ఈ దశలో వామపక్షాల ఐక్యత అత్యవసరమని పలు వామపక్ష పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, బ్యాంకు ఉద్యోగులు, మేధావులు వేర్వేరు రూపాల్లో నిరసన గళం వినిపిస్తున్నారు. ఇది మరింత విస్తృతమవ్వాల్సి ఉంది. ఇందుకు కమ్యూనిస్టులు నిస్వార్థంగా అడుగులు వేయడం లేదు. అందుకే భాజపా వ్యతిరేకగళాలు ఒకేతాటి మీదికి రావాలన్న ఆకాంక్ష బలంగా వినిపిస్తున్నా కార్యరూపంలోకి రావడం లేదు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు, మేధావులు, సిద్ధాంత కర్తలు, మైనారిటీలు, దళితులందరూ ఒకే వేదిక మీదకు రావడంపై తక్షణం దృష్టిపెట్టాల్సి ఉంది. వామపక్ష కూటమి విదేశాల్లో విజయాలపై చర్చిస్తున్నా దేశంలో మాత్రం అందుకు అనుగుణంగా అడుగులు పడడం లేదు.

# కార్పొరేట్ గుప్పిట్లో ఆర్థిక వ్యవస్థ


- కుదేలవుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ
- మాంద్యం నుంచి బయటపడే మార్గమేది?



**న్యూఢిల్లీ,మే29( వెలుతురు):**
మోడీ సర్కార్ వచ్చాక ఆయన తీసుకున్న నిర్ణయాలు కేవలం ధనికవర్గాలకే మేలు చేశాయన్న విమర్శలు ఉన్నాయి. నిజానికి దేశంలో ధనిక, పేద వ్యత్యాసం బాగా పెరిగిపోతోంది. తాజా అధ్యయనా మేరకు ధరాఘాతం పేదలను మరింత పేదలుగా మారుస్తోంది. కేవలం కొన్ని కుటుంబాలే సంపద ఫలాలు అనుభవిస్తున్నాయి. కొన్ని కార్పోరేట్ శక్తుల చేతుల్లోనే ఆర్థిక చట్రం ఇమిడి ఉంది. వారు చెప్పినట్లుగానే దేశీయ ఆర్థిక విధానాలు సాగుతున్నాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా ఉండేలా విధానాలు రూపకల్పన చేస్తున్నారు. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల, మత, వర్ణ వివక్ష తీవ్ర రూపం దాల్చాయి. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్న విమర్శలు బలపడుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ధరల పెరుగుదల తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. జీఎస్టీ వల్ల సామాన్య ప్రజల్లో కష్టాల్లో మగ్గుతున్నారు. నల్లధనాన్ని వెలికితీస్తానన్న మోదీ.. ఆ దిశగా చర్యలేవీ చేపట్టలేదు. నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో మోదీ విఫలమయ్యారు. ఫలితంగా నిరుద్యోగం పెరిగింది. భాజపా ప్రభుత్వం పూర్తిగా నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోంది. ఈ ప్రభుత్వ వైఖరితో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రైతులు, కార్మికులు, మహిళలు, మైనారిటీలు, యువత.. ఇలా అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం ద్వారా మన దేశంలో అంతగా ఫలితాన్ని సాధించడం లేదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడం లేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. దేశం నాలుగో అర్థిక శక్తిగా ఎదిగిందని చెప్పుకోవడం తప్ప ఎక్కడా దాని ఫలితం కానరావడం లేదు. డాలర్ మారకం రేటు అంతకంతకూ పెరుగుతోంది. పెట్టుబడుల వృద్ధిరేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రైవేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనే లేదు. చైనాలాంటి దేశాలు ఆర్థిక కట్టుబాట్లను అవలంబిస్తోంది. దేశంలోని అధికార పదువుల్లో ఉన్న వారి ఖర్చుల్లో కోత పెట్టారు. కానీ మనదేశంలో వారికే ఎక్కువ వెసలుబాట్లు ఉన్నాయి. అత్యధిక జీతాలు, భత్యాలు పొందుతున్న వారిలో వారే ముందు వరసలో ఉన్నారు. ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏయే పద్దుల మీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి. సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహద పడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతుల కోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్ లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్ లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు. ఈ క్రమంలో దేశీయ ఆర్థిక విధానం అవసరం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించాలి. దేశ స్ఫూర్తిని పరిరక్షించు కోవడానికి, భాజపా వ్యతిరేక శక్తులను ఐక్యం చేయడానికి ఇదే సరైన సమయం అంటున్న నేతలు అందుకు కార్యాచరణ గురించి చర్చించి ఉంటే బాగుండేది. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు చర్చించడం లేదు. ఓ రకంగా విపక్షాలకు కూడా సరైన ఆర్థిక విధానాలు లేవని అర్థం అవుతోంది.

(ఆధ్యాత్మిక చింతన )

# మంచి మాటలే.. కొండంత ఓదార్పు!



**తిరుమల,మే29( వెలుతురు):**
మాటలను ఆచితూచి వాడాలి. వినయంగా ఉండాలి. ఎదుటివారికి స్వాంతన కలిగించేలా మాట్లాడాలి. మన ప్రవర్తన ఎదుటివారిలో ధైర్యాన్ని నింపాలి. నేనున్నానని భరోసా ఇవ్వగలగాలి. భగవంతుడు కూడా ఇదే కోరుకుంటాడు. కొంతమంది అకారణంగా మాటల ఈటెలతో ఎదుటివారి మనసును గాయ పరుస్తారు. అది వారి నైజం. శారీరక గాయంలా, మానసిక గాయం బయటికి కనిపించదు గాని ఆలోచనలను అస్థిరపరుస్తుంది. అటువంటివారిని కనిపెట్టి ఉపశమనంగా చెప్పే మాటలు మనసు గాయానికి చల్లదనాన్ని ఇచ్చే లేపనమై కర్తవ్యాసక్తులను చేస్తాయి. అందరూ మానసికంగా దృఢంగా ఉండరు. మానసిక అధైర్యులు ఉంటారు. వారిని కనిపెట్టుకుని ఉండాలి. వీలైనంత వరకు వారితో గడుపుతూ మాటల ఉత్ప్రేరకాన్ని అందిస్తుండాలి. మనసు నెమ్మదించిన మనిషికి ఆకాశమే హద్దు. అలాంటి వారే విజయం సాధిస్తారు. వ్యాకులత చెందిన వారిని దగ్గరకు చేర్చాలి. ధైర్యం కల్పించాలి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెడితే ఎంత ఆనందం లభిస్తుందో అంతటి ఆనందం మంచి మాటల వల్లా కలుగుతుంది. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటేనే పరమాత్ముడు కూడా అనుగ్రహస్తాడు. ఆకలిగొన్నవాడికే అన్నం పెట్టాలి. కడుపు నిండిన వాడికి అన్నం పెట్టడం సరికాదు. విజయం సాధించిన వారినే ప్రజలు వెన్నంటి ఉంటారు. అతడిని అంతా తమవారుగా పొగిడేస్తారు. అలా అతడిని అంటిపెట్టుకుని ఎంతోమంది ఉంటారు. అది లోక సహజం. అపజయం పొందిన వ్యక్తికి ఆసరాగా నిలవడమే నిజానికి గొప్ప విషయం. ఆ సమయంలో వ్యక్తపరచే సంఘీభావం ఓటమి పాలైన మనిషికి వెన్నుదన్ను అవుతుంది. తనకు మానసిక ప్రశాంతత ప్రసాదించిన వ్యక్తిని ఎన్నటికీ మరవడు. జీవితమంటే కష్ట సుఖాల కలయిక.. బాధల్లో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వ లక్షణం. అదే జీవితాన్ని నిలబెడుతుందని గుర్తించి మసలుకోవాలి.

# కరెంటు షాక్ తో గృహిణి మృతి.

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 29**



విద్యుత్ ఘాతంతో గృహిణి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని కురుమవాడలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం కురుమవాడకు చెందిన జూకంటి అనిత (30) రోజు మాదిరిగానే గురువారం ఉదయం తన ఇంట్లో ఉన్న, నీటి సంపుకు ఉన్న విద్యుత్ మోటార్ ను ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు ఆరు సంవత్సరాలోపు, రెండు సంవత్సరాల వయసున్న ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆమె భర్త జూకంటి మహేష్ వ్యవసాయమే వృత్తిగా, జీవనం సాగిస్తున్నారు. మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ పి మల్లయ్య తెలిపారు.

# ఈ నెల 30న ఇంటర్వ్యూ

● **జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. హరీషారాజ్**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29**

జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద ఎన్.హెచ్.ఎం. విభాగంలో ఖాళీగా ఉన్న 2 నర్సింగ్ ఆఫీసర్, 1 డి.డి.ఎం. పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య–ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్రజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు (1:3) ఈ నెల 30వ తేదీన ఉదయం 11 గం?లకు జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య–ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జిల్లా అధికారిక వెబ్సైట్ https://mancherial.telangana.gov.in55 . సంప్రదించాలని తెలిపారు.

# లే-అవుట్లను నిబంధనలకు లోబడి అనుమతించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29**

భూముల లే–అవుట్ల కొరకు అందిన దరఖాస్తుల సంబంధిత భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు లోబడి అనుమతించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో లే–అవుట్ కొరకు అందిన దరఖాస్తు సంబంధిత భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల అభివృద్ధి, ఇండ్ల నిర్మాణం, వెంచర్ల ఏర్పాటులో భాగంగా లే–అవుట్ కొరకు అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నియమ, నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. లే–అవుట్ దరఖాస్తు సంబంధిత భూమి నిషేధిత జాబితా, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఉన్నది.. లేనిది.. నిర్ధారించుకోవాలని, లే–అవుట్ సమీపంలో చెరువులు, వాగులు ఇతర ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూములు రక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను చట్టం ప్రకారం చర్యలు తీసుకొని స్వాధీనపర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- ఖేడ్ ఎస్ఐ విద్యాచరన్ రెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ మే 29 :**

నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉన్న ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ ఎస్సై చరణ్ రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ పట్టణంలో ఎరువుల ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ దుకాణాలలో మరియు గోదాములలో నారాయణఖేడ్ ఏవో శంకర్ తో కలిసి గురువారం తనిఖీలు నిర్వహించారు. విత్తనాల అమ్మకాలలో రైతులకు మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట వ్యవసాయ అధికారులు పోలీసు సిబ్బంది ఉన్నారు.



# నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29**



ప్రజలకు నిరంతరం త్రాగునీటిని అందించేందుకు అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో నిర్మిస్తున్న అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణతో కలిసి సందర్శించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం, అమృత్ 2.0 పథకాల ద్వారా ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో పట్టణంలో చేపట్టిన అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని ఆస్నాద్, గంగారం గ్రామాలలో ఏర్పాటు చేసిన



వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహశిల్దార్ మల్లిఖార్జున్తో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న అకాల వర్షాల పరిస్థితులలో కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

# మంచిర్యాల జిల్లాలో 24 వేల 705 మంది రైతుల ఖాతాలలో 262 కోట్ల రూపాయల జమ

● **జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29**



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 24 వేల 705 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 73 వేల 814 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 262 కోట్ల 10 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 205 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 2 వేల 500 నుండి 5 వేల టన్నుల ధాన్యం పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

# ఎస్సీ గురుకులాల కార్యదర్శి, అలుగు వర్షిణిని, విధుల నుండి తొలగించాలి.

మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు.




**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ గురుకులాల కార్యదర్శి, అలుగు వర్షినినీ వెంటనే విధులను తొలగించాలని, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు, డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ గురుకుల సొసైటి కార్యదర్శి అలుగు వర్షిణి ఇటీవల మాట్లాడుతు, గురుకుల పాఠశాలలో విద్యార్థులు టాయిలెట్లు, కడుగుతే తప్పేంటనీ, వారి రూమ్ లు వారే క్లిన్ చేసుకోవాలని, వారి బట్టలు వారే ఉత్కోవాలని, ఎవరచ్చి చేస్తారు, వారేమైన పై కులం నుండి వచ్చారా, అని విద్యార్థుల పట్ల అవమాన కరంగా మాట్లాడిన గురుకులాల సొసైటి సెక్రటరీ, అలుగు వర్షిణిని తన విదుల నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి కాబట్టే, మీరు గురుకుల పాఠశాలలకు సెక్రటరీ గా ఉన్నారన్న విషయాన్ని మర్చిపోవద్దని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి ఎస్టీ, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగ స్థానాల్లో గౌరవ ప్రదంగా ఉండాలని, చదువు ద్వారానే ఒక సామాన్యుడు అసామాన్యుడుగా మారి, సమాజంలో గౌరవం పొందుతాడని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఆలోచనలతో లక్షలాది రూపాయలు వెచ్చించి, గురుకుల పాఠశాలలు నిర్మించి, వేలాదిరూపాయల జీతాలు ఇస్తూ, మిమ్మలను నియమిస్తే, మీరు ఎస్సీ గురుకుల విద్యార్థుల పట్ల అత్యంత అవమానకరంగా మాట్లాడడం బాధాకరమన్నారు. ఎస్సీ గురుకుల పాఠశాలల సొసైటి సెక్రటరీగా, ఎస్సీలను మాత్రమే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగారపు రమేష్, కుషణపల్లి నారాయణ,అకునూరి రాజ్ కుమార్, ఇడిగిరాల ప్రసాద్,గొగర్ల శేఖర్,ఎనగందుల శివాజీ, బెజ్జలా సంపత్,వేముల మల్లేష్, తుంగపల్లి వెంకటేశ్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

# వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించిన, కాసిపేట గురుకుల పాఠశాల కు, 5 లక్షల చెక్కు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలోని గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు, నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినందుకు గాను, ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్ కు, బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేతుల మీదుగా ఐదు లక్షల చెక్కును, ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ఇటీవల వెలువడిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో, నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి నందుకుగాను, బుధవారం హైదరాబాదులోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో, ఐదు లక్షల చెక్కును, ప్రశంస పత్రాన్ని ఇచ్చారని, రాష్ట్రంలో ఉన్న 239 సాంఘిక సంక్షేమ గురుకులాలలో వంద శాతం సాధించిన 14 గురుకులాల్లో కాసిపేట గురుకులం ఉండడం హర్షనీయమన్నారు. పదవ తరగతి ఫలితాలలో స్కూల్ టాపర్ గా సిహెచ్ చైతన్య 549, అలాగే 500 పైగా మార్కులు 22 మంది విద్యార్థులు సాధించారన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం, కామన్ డైట్ మెనూ అమలు చేయడం వలన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండి చదువు పట్ల దృష్టి సారించడం జరుగుతుందన్నారు. మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషిచేసిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ స్ఫూర్తితో భవిష్యత్తులో ఇంకా మంచి ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నూరు శాతం ఫలితాలను సాధించిన ప్రిన్సిపాల్ లను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ , సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిని, కాళేశ్వరం జోన్ –1అధికారిని అరుణ కుమారి ప్రత్యేకంగా అభినందించారు.





## ప్రభుత్వ బొగ్గు సంస్థలు, డిమాండ్, మేరకు
# నాణ్యమైన బొగ్గును అందించేలా చర్యలు తీసుకోవాలి

- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి, కిషన్ రెడ్డి.

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29**

రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే దిశగా, ప్రభుత్వ బొగ్గు సంస్థలు, డిమాండ్ కు తగినట్టు నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి, కిషన్ రెడ్డి అన్నారు. గురువారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన, ఢిల్లీ నుండి జరిగిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో సింగరేణి, కోల్ ఇండియా, అధికారులు, కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవదత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, బొగ్గు ఉత్పత్తి ఖర్చును గణణీయంగా తగ్గించాలని, ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతిని మెరుగుపరచాలని, నాణ్యత ప్రమాణాలు పెంచుకుంటూనే, నూతన గనులను సాధించుకోవడానికి కృషి చేయాలని సూచించారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించడానికి సింగరేణి అధికారులు, బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో, కమిటీని ఏర్పాటు చేయాలని, ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు చేసి, ఉత్పత్తి ఖర్చులు తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యత పై దృష్టి పెట్టాలన్నారు, బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా, తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లను, వాటిపై తీసుకోవలసిన చర్యలపై ఈ సమావేశంలో దిశా నిర్దేశం చేశారు. కార్యదర్శి, విక్రమ్ దేవదత్ మాట్లాడుతూ, బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి ఖర్చును తగ్గిస్తూ, వినియోగదారులకు బొగ్గు




ధరలను అందుబాటులోకి తీసుకురావచ్చని, దీనితో విద్యుత్తు ఉత్పత్తి ఖర్చు తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ చైర్మన్ ఎన్ బలరాం, హైదరాబాదులోని సింగరేణి భవన్ నుండి సమీక్ష సమావేశం సమావేశంలో పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు, తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో కోల్ ఇండియా, సిగ్గేరేణి, గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి, సత్యనారాయణ రావు, ఎల్ వి, సూర్యనారాయణ రావు, కే, వెంకటేశ్వర్లు, ఏం సుభాని, తదితరులు పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి తరపున సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఎన్.బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ... బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఈడీ ఎస్డీఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రత విషయంలో అప్రమత్తంగా వుండాలి

- కేసులలో పరిశోధన పారదర్శకంగా ఉండాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపిఎస్






**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29**

శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, IPS పోలీస్ అధికారులకు సూచించారు.ఁనెలవారి సమీక్షాలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈరోజు కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపి లు, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్లవారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్షీట్కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోద్కెన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతో పాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని మొదల్కెన అంశాలపై పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్షా జరిపారు. అదేవిదంగా నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించడంతో పాటు, అధికారులతో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .... సూదీర్ఘకాలంగా పెండింగ్ లో వున్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయడంతో పాటు, నిందితులకు కోర్టులో శిక్షలు పడేవిధంగా తగు సాక్ష్యాధారాలను కోర్టుకు అందజేయాల్సిందిగా అలాగే మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో అధికారులు వేగం స్పందించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహిరంచాలని దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుంటూ, విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ప్రధానం చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతో పాటు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోవడంలో అధికారులు సమయస్ఫూర్తి వ్యవహరిస్తూ దర్యాప్తు కోనసాగించాలి అని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులతో కలసి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లలో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. తరుచుగా నేరాలకు పాల్పడే నేరస్థులపై సస్పెక్ట్, రౌడీ షీట్ల తెరవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాల్సి వుంటుందని పోలీస్ అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారితో స్నేహపూర్వకంగా వుండాలని భాధ్యయుతంగా విధులు నిర్వహిస్తూ బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డిసిపి కరుణాకర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఏం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీఐ లు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

# వైభవంగా జూపల్లి భాస్కర్ రావు నూతన గృహ ప్రవేశం...

- అభినందనలు తెలిపిన వివిధ పార్టీల నాయకులు, పలువురు ప్రముఖులు, గ్రామస్థులు



**వెలుతురు,చారకొండ 29మే:**

వెల్దండ సింగిల్ విండో ఛైర్మన్ జూపల్లి భాస్కర్ రావు నూతన గృహ ప్రవేశం కార్యక్రమం బుధవారం చారకొండ మండల పరి ధిలోని జూపల్లి గ్రామంలో వైభ వంగా జరిగింది. ఈ నూతన గృహప్రవేశానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎస్.కె. బాలమియా, తిరుపతయ్య, నృపా ల్ నాయక్, బాలరాజ్, వెంకటయ్య గౌడ్, తిరుపతయ్య రజక, వెలిజాల వెంకటేష్, ఇంగ్లీష్ జంగయ్య, నిరంజన్, తిరుపతయ్య యాదవ్, భగవంత్, బిక్షపతి గ్రామ ప్రజలు, పలువురు ప్రముఖులు తదితరులు హాజరై వారికి శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సత్యనారాయణ వ్రతం పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

*పోలీసులకు విధి పత్రం అందించిన బిజెపి నాయకులు*

**వెలుతురు నారాయణఖేడ్ మే 29 :**

నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్.. గోవుల సంరక్షణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పెద్ద శంకరంపేట మండలం బిజెపి పూర్వ అధ్యక్షులు కోణం విఠల్.. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ బిజెపి నాయకులు బుధవారం పోలీస్ స్టేషన్ లో ట్రైనీ ఎస్ఐ అరవింద్.. పోలీస్ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా మెదక్ జిల్లాలో గోవులను అక్రమంగా కబేలాలకు తరలించి నిర్దాక్షిణ్యంగా వధిస్తున్నారని పేర్కొన్నారు.. గోవద చట్టాన్ని ముల్లంగించి గోసంతతి యొక్క అక్రమ రవాణా విపరీతంగా జరుగుతుందన్నారు. ఆటోలు లారీల్లోనే కాకుండా కంటైనర్ లలో రవాణా చేస్తున్నారన్నారు.. గోవులతోపాటు ఆరోగ్యకరంగా ఉన్న ఎద్దులు దున్నలు గేదెలు లేక దూడలను సైతం




అనుమతులు లేకుండా అక్రమంగా వధిస్తున్నారని.. గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేకంగా పోలీసులు నిఘబెట్టి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.. సకల దేవత స్వరూపం గోమాత వేద కాలం నుండి గోవును ఆరాధ్య దేవతగా భావించి పూజించడం జరుగుతుందన్నారు.. అలాంటి గోవులను వధించడంతో గోసంతతి తగ్గిపోతుందని గోవులను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. నాయకులు ఎర్ర శ్రీహరి.. రవీందర్ సుభాష్ మహేష్ అంజయ్య శ్రీనివాస్ తదితరులున్నారు..

## బిఆర్ఎస్లో దయ్యాలను పెంచి పోషించిన కెసిఆర్

- పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారు
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

**కామారెడ్డి,మే29( వెలుతురు):**

ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. కేసీఆర్ దేవుడు.. కానీ ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్న కవిత కామెంట్స్లో ఆయన రియాక్ట్ అయ్యారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని.. ఆయన కూతురు కవిత చెప్పిన దాంట్లో అబద్ధం ఏమి లేదు. బీఆర్ఎస్లో ఆ దెయ్యాలను పెంచి పోషించింది స్వయంగా కేసీఆరేనని జూపల్లి హాట్ కామెంట్స్ చేశారు. గురువారం కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. గత పదేళ్లు తెలంగాణను పాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కార్ చేసిన అప్పులకు ప్రతి నెల మా ప్రభుత్వం వడ్డీ కడుతోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బీఆర్ఎస్ ఆగం చేసిన.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మా ప్రభుత్వం పథకాలను ఆపకుండా నిరంతరంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. కానీ అమెరికా మాట విని మధ్యలోనే ఆపరేషన్ సిందూర్ ఆపడం సరికాదని అన్నారు. ఇందిరాగాంధీ ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపారని.. ఆమె హయాంలో పాక్తో యుద్ధం ఆపడానికి అమెరికా రాయబారం చేస్తే అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దని అగ్రరాజ్యానికి తేల్చి చెప్పారని గుర్తు చేశారు. ఇక, తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు గెలుపు దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 70, 80 శాతం సీట్లు-కైవసం చేసుకోవాలని సూచించారు.

## 17 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు





**వెలుతురు నారాయణఖేడ్ మే 29 :**

నారాయణఖేడ్ మండలం లో సంజీవనరావుపేట గ్రామం 2007-8 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 17 సంవత్సరాల తర్వాత అందరూ కలుసుకోవడంతో చాలా సంతోషంగా పాత జ్ఞాపకాలను చేసుకున్నారు. అలాగే తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇలా 17 సంవత్సరాల తర్వాత కలుపుకోవడం పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పటి స్కూల్ టీచర్ రాములు విజయ్ కుమార్, చంద్రకాంత్, విట్టల్ నాయక్, సాయిబాబా, భూమయ్య విద్యార్థులు రవీందర్ రెడ్డి, సాయిలు, విష్ణు, కాంతరెడ్డి, దివ్యభారతి, పద్మ,పూజిత, శైలజ, జీవిత, కవిత తదితరులు ఉన్నారు.

## బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం కృషి చేద్దాం

- అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం తోనే దేశం అభివృద్ధి
- ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**వెలుతురు నారాయణఖే మే 29 :**

నారాయణఖేడ్ నియోజకవర్గం లో నాగల్గిద్ద మండలం శికారా?నా గ్రామంలో ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి వారు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క విగ్రహావిష్కరణ చేశారు. పాల్గొన్ని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడు అని అన్ని వరగాల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప మహనీయుడని కొనిఆడారు అలాగే అన్ని వర్గాల హక్కులకు ప్రజలను సమాన హక్కుల తోని జీవించాలని రాజ్యాంగంలో పొందుపరచాలని గుర్తు చేశారు. దేశంలో అంబేద్కర్ రాసినటువంటి రాజ్యాంగానికి వ్యతిరేకంగా కొందరు దుష్టశక్తులు ఆయన అంటరాని వాడని భావించడం చాలా బాధాకరమన్నారు. ఈ దేశంలో ఆయన రాసిన రాజ్యాంగం వల్లనే దేశం ప్రశాంతంగా అన్ని వర్గాల ప్రజలు జీవిస్తున్నారని అన్నారు అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం తోనే దేశం అభివృద్ధి జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో కారముంగి మాజీ సర్పంచ్ గుండరావు పాటిల్, అంబేద్కర్ పూలే సేవ సమితి,జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత రహీం, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమ్యాల మాణిక్యం కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు కోటారి నర్సింహులు , అంబేద్కర్ పూలే సేవాసమితి డివిజన్ అధ్యక్షులు ఎస్ నర్సింహులు , అంబేద్కర్ పూలే సేవా సమితి డివిజన్ ప్రధాన కార్యదర్శి వినోద్, మండల బాధ్యులు శివానంద్, , కెవిపియస్ నాయకలు, గణపతి. దాసు ప్రవీణ్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిఏ బకాయిలు చెల్లించాలి

- తపస్ జిల్లా అధ్యక్షులు దత్తాత్రి



**వెలుతురు నారాయణఖేడ్ మే 29 :**

నారాయణఖేడ్ నియోజకవర్గంలో ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ ఉద్యోగులకు రావాల్సిన డి ఎ బకాయిలు అన్నీ చెల్లించాలని,పాఠశాలలు ప్రారంభానికి ముందే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షులు దత్తాత్రి నారాయణ ఖేడ్ వచ్చిన సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. పి ఆర్ సి గడువు ముగిసినందున ఉద్యోగులందరికి పి ఆర్ సి ఇవ్వాలని, కోరారు. అలాగే ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల బలోపేతనికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా బాద్యులు చంద్రశేఖర్, మల్లయ్య స్వామి,మరియు సంజీవ్ కుమార్, రతన్ సింగ్, జగదీశ్వర్, కిరణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లిలో గర్భిణీ స్త్రీలకు మెడికల్ కిట్ల పంపిణీ



**వెలుతురు, చారకొండ 29మే :**

చారకొండ మండలంలోని జూపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో గ్రామంలోని గర్భిణీ స్త్రీ లకు మెడికల్ కిట్లని పంపిణీ చేయ డం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుపత య్య, శ్రీరాములు, బిక్షపతి, సైదులు గౌడ్, సైదులు నాయక్, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ప్రశాంత్, మల్లేష్, ఉప్పల వెంకటేష్ యువసే న మున్నా నాయక్, హెల్త్ డిపార్ట్మెం ట్, అంగన్వాడి టీచర్, ఆశవర్క ర్లు, గ్రామ పెద్దలు, మహిళలు తది తరులు పాల్గొన్నా రు.

## హెచ్ఎంఐఎస్, రొటాసిల్ వ్యాక్సిన్, క్యాచ్ అప్ క్యాంపెయిన్ పై సమీక్ష మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహణ

**వెలుతురు మేడ్చల్ - మల్కాజిగిరి, మే 29:**



జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. సీ. గౌరి గారి ఆధ్వర్యంలో, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయం, అంటాయిపల్లిలోని సమావేశ మందిరంలో, శిక్షణ మరియు సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (HMIS) రెండు డోసుల రొటాసిల్ వ్యాక్సిన్ పరిచయం టీకా క్యాచ్ అప్ క్యాంపెయిన్ పై సమీక్ష జరిగినది. జిల్లాలోని అన్ని రిపోర్టింగ్ సూపర్వైజర్లు, ఏఎన్ఎమ్ మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. వారికి డేటా నమోదు, కొత్త టీకా షెడ్యూల్ అమలు మరియు ఎన్ఆర్వీ క్యాంపెయిన్ నిర్వహణ పై పూర్తి వివరాలు అందించబడింది. ఈ సందర్భంగా డా. సీ. గౌరి మాట్లాడుతూ, పిల్లలను జబ్బుల నుండి రక్షించడంలో సమయానికి టీకాలు ఇవ్వడం చాలా ముఖ్యమని అన్నారు. అలాగే, హెచ్ఎంఐఎస్ లో ఖచ్చితమైన ప్రతిఒక్కరి డేటా నమోదు చేయడం ద్వారా ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచవచ్చని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. శోభారాణి మరియు జిల్లా టీకాకరణాధికారి డా. కౌశిక్ పాల్గొన్న సిబ్బందికి సాంకేతిక మార్గదర్శకత్వం అందించారు.

## మన్ననూరులో విలేకరులకు శిక్షణ.

- ముఖ్యఅతిథిగా కూచుకుల్ల దామోదర్ రెడ్డి.



**వెలుతురు న్యూస్, అమ్రాబాద్:**

నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల్ల అటవీ ప్రాంతం అమ్రాబాద్ మండలం మన్ననూర్ లో అటవీశాఖ పర్యావరణ విజ్ఞాన కేంద్రం, వనమాలికలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ శిక్షణకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కూచుకుల దామోదర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక విలేకరులకు ఇలాంటి శిక్షణ తరగతులు అప్పుడప్పుడు నిర్వహించడం వలన వారికి సమాజంలో కచ్చితత్వ సమాచారం సేకరించుకొని సమాజ బాగు కోసం పనిచేస్తారని తద్వారా వారికి మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి నల్లమల్ల అటవీ ప్రాంతం మన్ననూర్ అటవీ శాఖ సౌజన్యంతో అల్లాదకరమైన వాతావరణంలో నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. ఇట్టి శిక్షణ తరగతులను పత్రికేయులు మిత్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్, అటవీశాఖ ఆర్గనైజర్ శ్వేతా, ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ ,విశాలాంధ్ర దినపత్రిక ఎడిటర్ ఆర్ వి రామారావు, పి యు డబ్ల్యు జె, ఐ జె యు జిల్లా నాయకులు సుదర్శన్ రెడ్డి తొలివెలుగు రాములు మీడియా సిబ్బంది పూర్ణచంద్రరావు మేనేజర్ శనేశ్వర రెడ్డి ఓ ఎస్ డి ,రెహమాన్ స్థానిక జర్నలిస్టులు సాయిబాబా ప్రభాకర్ వెంకటయ్య శ్రీధర్ లక్ష్మీపతి 80 మంది పాత్రికేయులు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

**డాక్టర్ వెంకటి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి హైదరాబాద్**



**హైదరాబాద్ వెలుతురు మే 29:**

గురువారం రోజున తన కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు .

1. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ఇప్పటినుండి ఇంటింటికి సర్వే చేపట్టి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలలో అవగాహన కల్పించాలని తెలియజేశారు.
2 ప్రైవేట్ ఆస్పతులను సందర్శించి నోటియబుల్ డిసైస్ యొక్క సమాచారాన్ని ప్రతిరోజు పంపాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యానికి తెలియజేసి సమాచారం వచ్చే విధంగా SPHO's, MO 's పర్యవేక్షించాలని కోరారు.
3. వైద్యులు, సిబ్బంది, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకొని ప్రజలకు సత్వర సేవలందించాలని కోరారూ.
4. గర్భవతులను సకాలంలో గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి నాణ్యమైన పరీక్షలు చేసి సలహాలు, సూచనలు, మందులు ఇవ్వాలని, ఫాలోఅప్ గురించి గర్భిణీ స్త్రీలకు తెలియ చేయాలని, గర్భిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ తెలియజేయాలని కోరారు.
5. హై రిస్క్ గర్భవతులను గుర్తించి , వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, కాన్పు సమయంలో వారిని డెలివరీ కోసం రిఫరల్ ఆస్పత్రి పంపడానికి ఆస్పత్రికి గుర్తించి సుఖవంతమైన ప్రసవం జరిగేటట్టు చేయాలని కోరారు.
6. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిగేటట్టు ప్రోత్సహించి గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రి తీసుకుని ఆసుపత్రిలో కాన్పులు జరగటానికి వైద్యులు సిబ్బంది, చేయాలని కోరారు
7. ప్రతి ఒక్క పిల్లవాడికి పూర్తి వ్యాధి నిరోధక టీకాలు అందేవిధంగా ప్రతి ఇంటింటికి సర్వే చేసి వ్యాధి నిరోధక టీకాలు పూర్తి గా అందే విధంగా వైద్యుల సిబ్బంది పని చేయాలని ఆదేశించారు



8. శాశ్వత, తాత్కాలిక పద్ధతులపై ప్రజలలో అవగాహన తీసుకువచ్చి కుటుంబ సంక్షేమ కార్యక్రమం పై ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు.
9. కాన్పు అయిన తర్వాత తల్లులు పిల్లలను వైద్య పరీక్ష నిర్వహించి తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు
10. జిల్లాలోని క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకొని హాస్పిటల్స్, క్లినిక్స్ గుర్తించి వారికి నోటీసులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా SPHO's, MO 's చర్యలు తీసుకోవాలని కోరారు.
11. ఈ కార్యక్రమంలో డాక్టర్ తుకారాం రాథోడ్ DM&HO, ఖైరతబాద్ , డాక్టర్ జయమాలిని , Addl Dmho, Spho's, ఏంఓస్, జె. రాములు మీడియా ఆఫీసర్, అంజయ్య డ్యూపూటి డెమో , నరసింహ డ్యూపూటి డెమో సూపర్వైజర్ స్టాప్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు

# జిల్లా అభివృద్ధిలో కంకణబద్ధులం అవుతాం

- పనిచేయని, పట్టించుకోని వారి భరతం పడతాం
- సమగ్ర కులగణన చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు
- నామినేటెడ్ పదవులలో ఉమ్మడి జిల్లా బీసీలకు తీవ్ర అన్యాయం
- మంచిని హర్షిస్తాం.. చెడుపై సమరం చేస్తాం.. అవినీతిని ఎండగడతాం..
- వనపర్తి జనభేరి బహిరంగ సభలో రాచాల










**వనపర్తి వెలుతురు మే 29:**

అణగారిన వర్గాల ప్రజల హక్కుల సాధన కోసం.. సబ్బండ వర్గాల సమస్యల పరిష్కారం కోసం..రాజ్యాధికారం పేద, బీద వర్గాలకు దక్కడం కోసం...నిరంతరం పోరాటం చేస్తున్న మమ్మల్ని ఆశీర్వదించడానికి... మేమున్నామని భరోసా అందించడానికి.. వచ్చిన అవ్వలు, తాతలు, అన్నలు,తమ్ములు అక్కలు,చెల్లెల్లు, పెద్దలు,మిత్రులు.. శ్రేయోభిలాషులకు పేరు పేరున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. బీసీ పొలిటికల్ జెఏసి ఆధ్వర్యంలో బుదవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. బీసీల రాజ్యాధికారం లక్ష్యంగా బీసీ పొలిటికల్ జేఏసీని స్థాపించి.. ఈ ప్రాంత బిడ్డగా.. ఇక్కడ జరుగుతున్న అవినీతిని.. అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వాన్ని ఎండగడుతున్నానన్నారు. ఓర్వలేని వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ముందుకు వెళ్తూనే ఉన్నాం... ఇకముందు కూడా మరింత వేగంగా, దూకుడుగా పోరాడుతామని స్పష్టం చేశారు. పనిచేయని, పట్టించుకోని వారి భరతం పడతాం.. జిల్లా అభివృద్ధిలో కంకణబద్ధులం అవుతాం.. మంచిని హర్షిస్తాం.. చెడుపై సమరం చేస్తాం.. అవినీతిని ఎండగడతాం.. ఇన్నాళ్లు కొందరితో సాగిన మా సేన.. ఇప్పుడు ఇంతింతై వటుడింతై అన్నట్లుగా అన్ని మండలాలు, విభాగాలతో విస్తృతమవుతోందన్నారు. ఇప్పుడు ప్రశ్నించడానికి ఈ ఒక్క రాచాల యుగంధరే కాదు.. వేల సంఖ్యలో సైన్యం ఆ దిశగా అందరినీ చైతన్యవంతులను చేస్తున్నాం.. ఉద్యమ కాంక్ష అనేది ఒక్క రోజులో సఫలీకృతం కాదు.. దానికి దీర్ఘకాలికంగా పోరాడాలి. ఈ పోరాటంలో ఏళ్లుగా రాజ్యాధికారం అనుభవిస్తున్న వారు హేలన చేసినా.. తప్పుడు కేసులతో ఇబ్బందులు పెట్టాలని చూసినా నేను బెదరలేదు.. నా చుట్టూ ఉన్నవారు అదరలేదన్నారు. ఓ వైపు బీసీల హక్కుల కోసం పోరాడుతూనే సిద్ధమవుతోందన్నారు ఓవైపు బీసీలకు రాజ్యాధికారం, వారి హక్కుల సాధన కోసం పోరాడుతూనే.. మరోవైపు వనపర్తి జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి గళమెత్తుతానని, అందులో కొన్నింటిని మీముందు ఉంచుతున్నాను.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోపు ఆ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదేనన్నారు. లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ పొలిటికల్ జేఏసీ తమ అభ్యర్థులను నిలబెట్టి.. ప్రజల ఆశీర్వాదంతో గెలిపించుకుని పరిష్కరిస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సీఎం రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ప్రభుత్వం ఏర్పడటంలో కీలకపాత్ర పోషించిన బీసీ వర్గాలకు నామినేటెడ్ పదవులలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయి పదవులు దాదాపు 10 కి పైగా ఉమ్మడి జిల్లాకు ఇచ్చినప్పటికీ.. అందులో ఏ ఒక్క బీసీ నాయకునికి ఇవ్వకపోవడం చాలా బాధాకరమని, త్వరలో చేపట్టబోయే వాటిలోనైనా బీసీలకు అవకాశం ఇవ్వాలని కోరారు.

## గురుకుల విద్యార్థులపట్ల అవమానకరంగా మాట్లాడిన అలుగు వర్షిణిపై కఠిన చర్యలు తీసుకోవాలి

***బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్,***

**హైదరాబాద్ వెలుతురు మే 29:**

ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి గారు ఇటీవల ఓ ఆడియోలో మాట్లాడిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. బాలల హక్కుల కార్యకర్తలను,విద్యావేత్తలను ఆవేదనకు గురిచేశాయి. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులు టాయిలెట్లు కడగడం, ఎవరి రూమ్ వాళ్లే క్లీన్ చేసుకోవటంలో తప్పేంటి. ఎవరొచ్చి చేస్తరు. వాళ్లది వాళ్ళు చేసుకోవడంలో తప్పేంటి. గురుకులాల పిల్లలు టూ మచ్ పోష్ సొసైటీ నుంచి రాలేదు నుంచి రాలేదు. వాళ్ల టేబుల్ మీదకి ఫుడ్ రాదు. కిచెన్ లో రోటీలు చేయాల్సిందే. అది కూడా నేర్చుకోవడంలో భాగమే కదా అని వ్యాఖ్యానించడాన్నీ బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) తీవ్రంగా ఖండిస్తోంది. ఆమె మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నాయి. ఆమె మాటలు చాలా దారుణంగా ఉన్నాయి. అట్టడుగు వర్గాల పిల్లను అవమానిచేవిగా ఉన్నాయి. సభ్యసమాజంలో ఇలాంటి అధికారులు ఉండడం అక్షేపణీయం. ఆమె మాటలు గురుకుల విద్యార్థుల పట్ల అవమానకరంగా,కుల వివక్షను ప్రోత్సహించేలా ఉన్నాయని బాలల హక్కుల సంక్షేమసంఘం(బిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. బాలకార్మికులతో పనిచేయించడం నేరం అని తెలియదా? అని ప్రశ్నించారు. తక్కువ జాతికి చెందిన పిల్లలు అని అర్థం వచ్చేలా మాట్లాడటం తగునా అని అన్నారు. తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని వెంటనే క్షమాపణ చెప్పాలి. విద్యార్థులతో టాయిలెట్లు కడిగించడం, వంటలు చేయించడం వంటివి కుల వివక్షకు సంబంధించినవే. అవి బాలల హక్కులను ఉల్లంఘించేవే. ఇది శ్రమ గౌరవాన్ని నేర్పడం కంటే, వెట్టిచాకిరి చేయించేవే అని వారున్నారు. గురుకులాల్లో విద్యాబోధన చేస్తారా లేదా వెట్టిచాకిరి చేయిస్తారా అని వారు



ప్రశ్నించారు. గురుకులాల వ్యవస్థను మసక బార్చడం కోసం కార్పోరేట్ శక్తుల ప్రసన్నం చేసుకోవడం కోసమా వీరి వ్యాఖ్యల అంతరార్థం అని వారు ప్రశ్నించారు. గతంలో కూడా అలుగు వర్షిణి గారు అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నప్పుడు గురుకుల అధ్యాపక సంఘాలు ప్రశ్నించినప్పుడు అప్రజాస్వామికంగా నియంతృత్వపూర్వకంగా మాట్లాడేవారు. ఇప్పుడు చివరకు విద్యార్థులు ఎవరి టాయిలెట్స్ వాళ్లే కడుక్కోవాలి ఇది శ్రమ సంస్కృతి నేర్పుతుంది, ఈ పిల్లలేమన్న ఉన్నత వర్గాల నుండి వచ్చారా అని మాట్లాడిన గురుకులాల సొసైటీ సెక్రెటరీ అలుగువర్షిణి గారు బాలల హక్కులను ఉల్లఘించడమే. విద్యాశాఖను తానే నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుందని వారున్నారు.

## భజన సంఘాల సమ్మేళనం




**కరీంనగర్ వెలుతురు మే 29:**

అహల్యా బాయి హెూల్కర్ 300 వ జయంతి ఉత్సవాల సందర్భంగా మే 29 గురువారం రాత్రి నగనూరు గ్రామం



కేంద్రంగా 15 గ్రామాల భజన సంఘాలతో సమ్మేళనం జరిగింది. సుమారు 200 మంది భజన భక్తులు వచ్చారు. కుల వివక్షత, అంటరాని తనం లేని సమరసత కలిగిన సమాజాల్ని నిర్మించుకోవాలని, వేదం, ఉపనిషత్తులు, రామాయణ, భారతాల్లో లేని దురాచారాలు నేడు పాటించటం సరియైనది కాదని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవటం, ప్రజల్లో ఆధ్యాత్మిక భావాల్ని వ్యాప్తి చేయటంతో పాటు భగవంతుని ముందు అందరూ సమానమేనని అనే ఆలోచన కలిగించటంలో భజన బృందాలు ప్రముఖ పాత్ర పోషించాలని, మహిళా సాధికారత కు ప్రతీకగా నిలిచిన అహల్యా బాయి బాటలో నడిచి,దేశభక్తి,దైవ భక్తి అలవర్చుకోవాలని ముఖ్య అతిథి,అఖిల భారత సమరసత కళా విభాగం కన్వీనర్ శ్రీ అప్పాల ప్రసాద్ జి ఉద్బోధించారు.రాష్ట్ర కార్యదర్శి రామారావు,జిల్లా అధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి, ఆలయ నిర్వహకులు శ్రీహరి రెడ్డి,జగన్,నర్సింగ్,జిల్లా ప్రధాన కార్యదర్శి దావు సంతోష్ పాల్గొన్నారు..



## రాయలసీమ అడ్డా..టిడిపి గడ్డ

పుణ్యభూమి. పౌరుషం, ఆత్మీయత, మహిళలను గౌరవించడం నేర్చుకోవాల్సిన గడ్డ ఇది. మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు జెండా రెప రెపలాడుతోందని అన్నారు. మహానాడు బహిరంగ సభలో తన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. 2024లో మాస్ విక్టరీ మనందరం చూశాం. 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రను తిరగరాశాం. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటు దెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు, పార్టీ లేకుండా చేస్తామన్నారు.. కానీ వారే అడ్రస్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు.. వారికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని నారా లోకేశ్ అన్నారు. 175 నియోజకవర్గాలకు గాను 164 సాధించాం ఇది ఆల్ టైం రికార్డ్ అని పేర్కొన్నారు. జెండా పీకేస్తాం అన్నారు.. ఇప్పుడు వాళ్ళ పార్టీ ఆఫీసుకు టూలెట్ బోర్డు పెట్టారని ఆరోపించారు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేశారు.. ప్రజలు ఇప్పుడు ఫుట్‌బాల్ అడుకునే పరిస్థితి వచ్చింది. ఏ తప్పూ చేయని మన అధినేత చంద్రబాబును జైల్లో పెడితే.. ప్రజలు జగన్‌ను తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టి లాక్ చేశారు. మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు.. ట్రెండ్ సెట్ చేస్తారు. అది సినిమా స్క్రీన్ అయినా..పొలిటికల్ స్క్రీన్ అయినా.. ఆయన ఒక లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, కృష్ణుడు, అర్జునుడు, భీముడు, కర్ణుడు అంటూ గంభీరఉపన్యాం ఇచ్చారు. సీబీఎన్ అంటే ప్రజలందరికీ ధైర్యం. అభివృద్ధి వికేంద్రీకరణ అనేది మన అజెండా. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ప్రదేశ్‌గా మార్చింది. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా..పక్క రాష్ట్రానికి పంపారు. ప్రమాదకర మద్యంతో 30వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. గత ప్రభుత్వం మద్యం ద్వారా రూ.వేల కోట్లు లూటీ చేసింది. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కూటమి ఏర్పడింది. ప్రజలు కూటమిని ఆశీర్వదిస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి హామీ నిలబెట్టుకుంటున్నాం అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.అప్పుడు హైటెక్ సిటీ ఇప్పుడు క్వాంటం హోలీ అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇక, నా పైన కూడా 23 కేసులు పెట్టారు.. తగ్గేదే లేదు అని ఆనాడే చెప్పాం.. విధ్వంసం పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది.. ఒక్క కంపెనీ తీసుకురాక పోగా ఉన్న కంపెనీలను పక్క రాష్ట్రాలకు వెళ్లేలా చేశారు.. జే బ్రాండ్ లిక్కర్ పేరుతో మద్యం కంటే విషం పంచారని ఆరోపించారు. అయితే, పవన్ కళ్యాణ్ నాకు అన్నతో సమానం.. జెండాలు, అజెండాలు పక్కన పెట్టి పవన్ కళ్యాణ్ మన కోసం పని చేశారని చెప్పుకొచ్చారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులలో ఫ్రీబస్ ను నా అక్కా చెల్లెమ్మలకు కల్పిస్తున్నాం అన్నారు. అలాగే, 16 వేల మందితో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం.. గత ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులందరూ కూటమి ప్రభుత్వానికి సహకరించారు.. ఉద్యోగుల సమస్యలన్నింటినీ ఒక పద్ధతి ప్రకారం కూటమి సర్కార్ పరిష్కరిస్తుంది.. 8 లక్షల కోట్ల పెట్టుబడులు ఒప్పందాలు కుదిరాయి, దీని ద్వారా 6 లక్షల ఉద్యోగాలు వస్తాయని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.అలాగే, వైసీపీ హయాంలో ఇబ్బంది పడ్డ కుటుంబాలను కలుస్తున్నాను అని మంత్రి లోకేష్ తెలిపారు. వైసీపీ కార్యకర్తల్లారా ఏనాడైనా మీ నాయకుడు కలిశారా?.. 25 ఎంపీ స్థానాల్లో కూటమి 21 స్థానాల్లో గెలిచింది.. దీంతో కేంద్ర ప్రభుత్వం మనతో కలిసి పని చేస్తుంది.. మూడు పార్టీలు కలిసి ఉన్నప్పుడు చిన్న చిన్న సమస్యలు సహజం.. మిస్ ఫైర్లు, క్రాస్ ఫైర్లు, విడాకులు ఉండకూడదు.. ఈగోలు వదిలి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. ఇక, తల్లిని చెల్లిని గెంటింది ఎవరు?.. బాబాయినీ చంపింది ఎవరు?.. జే బ్రాండ్ అమ్మి ప్రజల రక్తం పీల్చింది ఎవరు?.. అందరూ రెడ్ బుక్ రెడ్ బుక్ అంటున్నారు.. ఎందుకయ్యా అంత భయం.. రెడ్ బుక్ అనగానే ఒకడికి గుండెపోటు–, ఇంకొడికి బాత్ రూంలో కాలు విరిగింది, మరొక్కడు ఎక్కడ ఉన్నాడో తెలియదు.. అర్థ మైందా రాజా.. రాయలసీమ గడ్డా టీడీపీ అడ్డా అని నారా లోకేష్ వ్యాఖ్యానించారు.

# భూ మాఫియా..ఆరాచకం




**అదిలాబాద్, మే 29, ( వెలుతురు)**

తెలంగాణ రాష్ట్రంలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇప్పల్ నవేగామ్ గ్రామంలో భూ మాఫియా రెచ్చిపోతోంది. గ్రామానికి చెందిన వందకు పైగా కుటుంబాలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నాయి. తమ భూమి, ఇళ్లను ఖాళీ చేయాలంటూ ముగ్గురు వ్యక్తులు రెండు సంవత్సరాలుగా నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామీణులు స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.ఆసిఫాబాద్ మండలానికి చెందిన శ్రీనివాస్, చరణ్ దాస్, మనోజ్ అనే ముగ్గురు వ్యక్తులు ఇప్పల్ నవేగామ్ గ్రామానికి చెందిన భూమి తమదేనని, తమ పేరున పట్టా ఉందని గ్రామస్తులతో ఇళ్లను ఖాళీ చేయాలంటూ బెదిరిస్తున్నారు. గ్రామంలో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నారు. ఇలా వారు గత రెండు సంవత్సరాలుగా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు ఆర్డీఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ముగ్గురు వ్యక్తులు తమ పలుకుబడిని ఉపయోగించి.. గ్రామస్తులను మానసికంగా వేధిస్తున్నారని, కొన్నిసార్లు భౌతిక దాడులకు కూడా ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల గ్రామస్థులు నిరంతరం భయంతో బతుకుతున్నారని.. తమ ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.బాధితుల వాదన ప్రకారం.. వారు నివసిస్తున్న ఈ స్థలంలో గత 200 సంవత్సరాలుగా వారి పూర్వీకులు నివసిస్తున్నారు. తరతరాలుగా ఇదే గ్రామంలో నివాసముంటూ.. ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు వంటి అన్ని రకాల ప్రభుత్వ పన్నులను సక్రమంగా చెల్లిస్తున్నట్లు గ్రామస్తులు రుజువులు చూపిస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో కూడా తమ పేర్లు ఉన్నాయని, అన్ని రకాల హక్కులు తమకే ఉన్నాయని వారు బలంగా చెబుతున్నారు. తాము నివసిస్తున్న భూమిపై అసలు ఎలాంటి వివాదం లేదని.. అక్రమంగా ఆ ముగ్గురు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.భూ మాఫియా బెదిరింపుల వల్ల గ్రామంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, తమకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా కూడా నిర్వహించారు. అధికారులు తక్షణమే స్పందించి, బెదిరింపులకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని.. తమ భూములకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రేషన్ కార్డులలో అక్రమాలపై కొరడా



**నిజామాబాద్, మే 29, ( వెలుతురు)**

చాలారోజుల తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. సాధారణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం అక్రమ రేషన్‌కార్డుల గుట్టు రట్టు చేస్తోంది. రేషన్ కార్డుల జారీపై అనుమానాలు వ్యక్తం చేసింది.తెలంగాణలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. లక్షలాది మంది కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరికొందరు మార్పులు, చేర్పుల కోసం అప్లై చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి.. నూతన కార్డులను జారీ చేస్తున్నారు. ఈ సమయంలో.. కేంద్ర ప్రభుత్వం ట్విస్ట్ ఇచ్చింది. కొత్తగా జారీ అవుతున్న కార్డులకు సంబంధించి అక్రమాలు జరిగినట్టు గుర్తించింది.కేంద్ర ప్రభుత్వం అక్రమ రేషన్‌కార్డుల గుట్టు రట్టు చేస్తోంది. ఉదాహరణకు ఒక్క కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 1700 అక్రమ కార్డులున్నట్లు అనుమానం వ్యక్తం చేసింది. ఆ కార్డుల వివరాలను జిల్లాకు పంపించడంతో.. అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే 83 శాతం పూర్తయింది. కేంద్రం అభ్యంతరం తెలిపిన కార్డుల్లో 1400 వరకు వివరాలపై ఆయా మండలాల్లో తహసీల్దార్లు విచారణ పూర్తిచేశారు. మరో 280 పరిశీలించాల్సి ఉంది.ఇప్పటి వరకు విచారణ చేసిన కార్డుల వివరాల నివేదికలను.. అధికారులు ఆన్‌లైన్‌లో కేంద్రానికి పంపిస్తున్నారు. ఇందులో చాలా కార్డులు అనర్హత కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 2.56 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా.. క్షేత్రస్థాయిలో మరోమారు రేషన్‌కార్డులపై విచారణ చేయిస్తే.. మరికొందరు అనర్హుల వివరాలు బయట పడే అవకాశముంది.కేంద్రం ఇచ్చిన జాబితా ప్రకారం.. రేషన్ కార్డులు విచారణ చేసి ఆన్‌లైన్‌లో నివేదిక పంపిస్తున్నామని డీఎస్‌వోలు చెబుతున్నారు. అటు క్షేత్రస్థాయిలో నిర్వహించిన విచారణలో.. విస్తుపోయే విషయాలు తెలుస్తున్నాయి. మైనర్ల పేరిట కూడా కార్డులు జారీ అవుతున్నట్టు విచారణలో తేలింది. నకిలీ ఆధార్ కార్డులు పెట్టి రేషన్ కార్డులు పొందిన వారు కూడా ఉన్నారు.ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోనూ రేషన్ కార్డులు ఉన్నట్లు విచారణలో తేలింది. ఇవే కాకుండా.. రేషన్‌కార్డులో పేరొకరిది.. ఆధార్‌కార్డు మరొకరిది ఉన్నవి కూడా బయటకు వస్తున్నాయి. సైలెంట్ కార్డులు భారీగా ఉన్నట్టు తెలుస్తోంది. వీరు ఆరు నెలల నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా బియ్యం తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. కొందరు మృతిచెందినా.. వారి కార్డులు రద్దు కాలేదు. మరికొందరికి బియ్యం అవసరం లేకున్నా కార్డులు తీసుకున్నారు. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైన తర్వాత.. ప్రతీ నెల 10 నుంచి 15 శాతం మంది రేషన్ సరకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు.

# జూన్ 2 ఏం జరగబోతోంది...

**హైదరాబాద్, మే 29, ( వెలుతురు)**

సొంత పార్టీపై అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దారెటు అనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీతో దూరంగా ఉంటున్న కవిత.. సొంత పార్టీ దిశగా అడుగులు వేస్తున్నారనే ఊహాగానాలు తెలంగాణ రాజకీయవర్గాల్లో జోరందుకుంది. ఇక నిన్న కవితతో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదరరావుతో పాటు పార్టీ లీగల్ సెల్ ఇంచార్జ్ గండ్ర మోహనరావు సమావేశమయ్యారు. కవితను బుజ్జగించేందుకు ఆ ఇద్దరు నేతలు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలుస్తోంది.మరోవైపు కవిత వ్యవహారంపై బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. తండ్రి, కూతురి మధ్య మధ్యవర్తులెందుకని ప్రశ్నించారు. జూన్ 2న కవిత కొత్త పార్టీ పెడుతున్నారని.. షర్మిల తరహాలో కవిత కూడా పాదయాత్ర చేస్తారని కామెంట్ చేశారు. ఇదిలా ఉంటే తన యాక్షన్ ప్లాన్ అమలు చేసే దిశగా కవిత అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ జాగృతికి సంబంధించి 11 ఏరియాలకు కోఆర్డినేటర్లను నియమించారు. సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటు చేశామన్నారు. టీజీబీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామమని.. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందన్నారు. మోదీ కోసమే సీఎం రేవంత్ పనిచేస్తున్నారని విమర్శించారు.ఇటీవలె ఆమె బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వ్యక్తిగతంగా రాసిన ఒక లేఖ లీక్ అయిన విషయం తెలిసిందే. దానిపై కవిత స్పందిస్తూ.. తన లేక ఎలా లీక్ అయింది అంటూ ప్రశ్నించారు. పార్టీలో కోవర్టులు ఉన్నారని, కేసీఆర్ దేవుడే కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ మండిపడ్డారు. కవిత లేకపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పరోక్షంగా స్పందించిన విషయం తెలిసిందే. ఎవరైనా లేఖలు రాయొచ్చని, తమది ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ అని.. అయితే సమస్యలుంటే అంతర్గతంగా పరిష్కరించుకుంటామని కూడా ఆయన అన్నారు.

# ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్న మల్ రెడ్డి

**హైదరాబాద్, మే 29, ( వెలుతురు)**



రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావావుల్లో మళ్ళీ కదలిక మొదలైంది. రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ పై గత మూడు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ నేత కేసి వేణుగోపాల్ సుదీర్ఘ మంతనాలు జరిపారు.సామాజిక సమీకరణలు జిల్లాల వారీగా మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యే వివరాలను అధిష్టానం ఇప్పటికే సేకరించింది. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ,రెడ్డి సామాజిక వర్గాల వారిగా మంత్రి పదవులు ఆశిస్తున్న వారి జాబితాను సైతం రూపొందించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన అనంతరం మంత్రి పదవి విస్తరణలో మొదలు తన పేరు తప్పకుండా ఉంటుందని ఎంతో ధీమా పెట్టుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి విషయంలో ఆదిలోనే ఆయనకు చుక్కెదురైంది. మొదటిసారి మంత్రివర్గ విస్తరణలో దక్కని మంత్రి పదవి....రెండోసారి మంత్రివర్గ విస్తరణలో ఎలాగైనా చోటు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.గత ఏడాది న్నర నుంచి ఆయన మంత్రి పదవి దక్కించుకునేందుకు లాబీయింగ్ సాగిస్తూనే ఉన్నారు. మంత్రి పదవి కోసం తొక్కని గడపలేదు...కలవని మనిషంటూ లేడు.మంత్రి పదవీ పైరవీలో తలమునకైలయినా మల్రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గంలో తక్కువ ఢిల్లీలో ఎక్కువ అంటూ ఆయనపై నియోజకవర్గ ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం సెటైర్లు వేయడం నియోజకవర్గం లో హాట్ టాఫీక్ గా ఈ అంశం మారింది.దీంతో ఆయన మంత్రి పదవి పై ఆయన ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు దీన్నిబట్టే అర్థమవుతుంది.మంత్రివర్గ విస్తరణ బెర్త్ లో చోటు దక్కించుకునేందుకు ఏ అవకాశం ఉన్న వదలడం లేదు... గల్లి నుంచి మొదలుకొని అగ్రరాజ్యం వరకు తనకున్న పలుకుబడిని వినియోగించుకొని పట్టువదలని విక్రమార్కుడిలా పూర్తి లాబింగ్ నడిపిస్తున్నాడు.మంత్రివర్గ విస్తరణలో రంగారెడ్డి జిల్లాకు కేటాయింపు విషయంలో అధిష్టానం ఏమి ఆలోచన చేస్తుందో పార్టీ నేతలకు ఎవరికి అంతుచికడం లేదు. జిల్లాలో పార్టీ నేతలు కార్యకర్తలు పార్టీ అధిష్టాన నిర్ణయం పై కొంత అసంతృప్తి రగులుతుంది పదవుల పంపకాల్లో పూర్తిగా అన్యాయం జరిగిందని సమయం సందర్భం వచ్చినప్పుడు అల్లా తన మనసులోని మాటను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్లారెడ్డి రంగారెడ్డి తో పాటు పార్టీ జిల్లా నేతలు బహిరంగనే విమర్శలు గుప్పిస్తున్నారు.ఇటీవల శంషాబాద్ లో జరిగిన జిల్లా ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సైతం మల్రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి కేటాయించాలంటూ ఏకవాక్యంగా పార్టీ నేతలు తీర్మానం చేసిన కాపీని పార్టీ అధిష్టానానికి సైతం పంపారు తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ప్రపంచ స్థాయిలో ప్రభుత్వం చేపడుతున్న ఫ్యూర్తి సిటి తమ జిల్లాలోనే ఉందని తమ జిల్లాకు మంత్రివర్గ విస్తరణలో ప్రాథమిధ్యం లేకపోతే ఎలా అంటూ వారు పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నించినట్లు సమాచారం రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనా అంటూ కరాకండిగా నేతలు ఒకే మాటగా చెబుతున్నారు. మంత్రి వర్గ విస్తరణలో తనకు అవకాశం దక్కకపోతే ఎమ్మెల్యే పదవికి సైతం తాను రాజీనామా కు సిద్ధమంటూ ఆయన బెదిరింపులు సైతం దిగారు. ఒకవేళ తనకు మంత్రి పదవి ఇచ్చేందుకు సామాజిక సమీకర ణే అడ్డుగా మారితే తాను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తన ప్లేసులో బీసీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటానంటూ అతనికి మంత్రి పదవి కేటాయించా లని సైతం ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చేసిన ఈ కామెంట్ జిల్లాలో ఇది హాట్ టాపిక్ చర్చ నియాంశంగా మారింది. మరోపక్క పార్టీ సీనియర్ నేత జానారెడ్డిని సైతం రంగంలోకి దింపి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలంటూ అధిష్టానా నికి సైతం లేఖను మద్దతుగా పంపించేలా చేశారు. మంత్రివర్గ విస్తరణలో అధిష్టానం మళ్లీ కదలిక మొదలు కావడంతో గత వారం రోజులుగా మల్రెడ్డి రంగారెడ్డి ఢిల్లీలోనే మకాం వేశారు. తన అంచర వర్గం ని ఢిల్లీకి రప్పించుకొని మంతనాలు సాగిస్తున్నాడు.అధిష్టానం తీసుకునే నిర్ణయాల వల్ల తమ భవిష్యత్తు కార్యాచరణ గురించి వారితో చర్చిస్తున్నట్లు సమాచారం దీంతో మల్రెడ్డి రంగారెడ్డి వ్యవహారం అధిష్టానం కు కొంత తలనొప్పిగా మారినట్లు తెలుస్తుంది. వాస్తవానికి సర్పం స్థాయి నుంచి ఎదిగిన సీనియర్ నేత మల్రెడ్డి రంగారెడ్డి జిల్లా పరంగా చూస్తే మంత్రివర్గంలో ఆయనకు ఖచ్చితంగా అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ పార్టీ అధిష్టానం మాత్రం ఏమీ ఆలోచన చేస్తుందో ఎవరికి అంతు పట్టడం లేదు.రంగారెడ్డి జిల్లాలో ఎన్ని నియోజకవర్గాలు ఉంటే ఇబ్రహీంపట్నం,షాద్నగర్, కల్వకుర్తి నియోజకవర్గం సింహభాగం( ఆమనగల్, కడ్తాల, తలకొండపల్లి,మాడుగుల ) కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలుపొందగా.... ఎల్బీనగర్ నుంచి సుధీర్ రెడ్డి మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ నుంచి ప్రకాష్ గౌడ్ చేవెళ్ల నుంచి కాలే యాదయ్య శేర్లింగంపల్లి నుంచి అరికెపూడి గాంధీ లు టిఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందారు. అయితే మారిన రాజకీయ పరిణామాల కారణంగా వారంతా ఇటీవలనే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.మంత్రివర్గ విస్తరణ విషయంలో అధిష్టానం జాబితాపై కొలికి వచ్చినట్లు సమాచారం. అయితే రెడ్డి సామాజిక వర్గం విషయంలోనే అధిష్టానం ఎటు తేల్చుకోలేకపోతున్నట్లు పార్టీ పెద్దలు చెప్తున్నారు. పార్టీ సీనియర్ నేత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, నల్గొండ జిల్లా నుంచి మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మధ్య మంత్రివర్గ విషయంలో బిగ్ ఫైట్ నడుస్తుంది ఆది నుంచి మంత్రి పదవిని దక్కించుకునేందుకు ఇరువురు నేతలు సైతం విశ్వ ప్రయత్నాలు సైతం చేస్తూ వస్తున్నారు.బహిరంగల వేదికల మీదనే మంత్రి పదల గురించి వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం పార్టీలో ఆ టాపిక్ గా మారింది.... అధిష్టానం మాత్రం రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించి మల్రెడ్డి రంగారెడ్డికి డిప్యూటీ స్పీకర్ పోస్టు ఇవ్వాలని కొంత ఇంటు ఇచ్చినట్లు తెలుస్తుంది.. తనకు డిప్యూటీ స్పీకర్ పోస్ట్ వద్దు అంటూ తన అనుచరు వర్గం వద్ద మల్రెడ్డి రంగారెడ్డి కొంత అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం.తన నిర్ణయాన్ని ఇప్పటికే పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించినట్లు తెలుస్తుంది. అధిష్టానం మాత్రం మంత్రి పదవులు అవకాశం లేని వారికి పార్టీ మంచి పొజిషన్ కల్పిస్తామంటూ బుజ్జగింపుల పర్వం ఇప్పటికే స్టార్ట్ చేసినట్లు వార్తలు సైతం చెక్కలు కొడుతున్నాయి.మల్ రెడ్డి రంగారెడ్డి అనుచరులు మాత్రం ఎంతో ధీమాగా ఉన్నారు. తమ నేతకే మంత్రి పదవి దక్కుతుందని మా సార్ బుగ్గ కారు తప్పక ఎక్కుతాడంటూ వారంతా ఎంతో ధీమగా ఉన్నారు. చూడాలి మరి మల్రెడ్డి రంగారెడ్డి విషయంలో పార్టీ అధిష్టానం ఏమి నిర్ణయం.

## జనభేరి విజయంతో మరింత ఉత్సాహంతో పనిచేస్తాం

- జిల్లా అభివృద్ధిలో కంకణబద్ధులం అవుతాం
- సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు
- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్


**వనపర్తి వెలుతురు మే 29:**

సమస్యల పరిష్కారం... హక్కుల సాధన కోసం నిర్వహించిన జనభేరి బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చి మమ్మల్ని ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. గురువారం వనపర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బుదవారం నిర్వహించిన జనభేరి సభ సక్సెస్ వెనుక బీసీ పొలిటికల్ జేఏసీ నాయకుల సమిష్టి కృషి దాగి ఉందన్నారు. సభను విజయవంతం చేయాలని కేవలం ఒక్క పిలుపు ఇవ్వడంతో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 20 వేల మంది స్వచ్ఛందంగా తరలివచ్చారని, దీంతో మాపై బాధ్యత పెరిగిందని, మరింత ఉత్సాహంతో పనిచేస్తామన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీకి ఆడపడుచుల అండదండలు మెండుగా ఉన్నాయని అనడానికి నిన్న జరిగిన జనభేరి సభ ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు గ్రామస్థాయి నుంచి ఒక పటిష్టమైన వ్యవస్థ, క్యాడర్, ఉంటుందని, అలాంటి పార్టీలకు దీటుగా జనభేరి సభ విజయవంతం కావడం వెనుక జిల్లా ప్రజలకు మాపై ఉన్న నమ్మకాన్ని గుర్తుగా సూచిస్తుందన్నారు. కొద్దిమందితో ప్రారంభమైన బీసీ పొలిటికల్ జేఏసీ నేడు ఒక వ్యవస్థగా మారిందన్నారు. మేము జనభేరి సభ ద్వారా ప్రజల ముందు పెట్టిన డిమాండ్లను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లోపు పరిష్కరించాలని, లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ తరపున అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టి, వారిని గెలిపించుకుని సమస్యలు కూడా మేమే పరిష్కరించుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ యాదవ్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న యాదవ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, మదనాపూర్ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేందర్ సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో లేఖల లొల్లి...

**హైదరాబాద్, మే 29, ( వెలుతురు)**





తెలంగాణలో లేఖల రాజకీయం నడుస్తోంది. సాధారణంగా అధికార పార్టీలో ఉన్న నేతలకు ప్రతిపక్ష నేతలు బహిరంగ లేఖలు రాస్తుంటారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు ప్రతిపక్ష పార్టీలు ఓపెన్ లెటర్స్ రాయడం మీడియా హైలెట్ అవడం కామన్. కానీ తెలంగాణలో ఇప్పుడు నయా ట్రెండ్ నడుస్తోంది.సొంత పార్టీ నేతలే ఆయా పార్టీల అధినేతలకు లేఖలు రాస్తున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీల నేతలు వారి పార్టీలో ఉన్న సుప్రీం నేతలకు లేఖాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ లేఖల్లో విమర్శల కంటే ఎక్కువగా ఆవేదన, తమకు జరుగుతోన్న అన్యాయంపైనే గళమెత్తున్నారు నేతలు. తమ తమ పార్టీల్లో లోటుపాట్లు, క్యాడర్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ అగ్రనేతలకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు లేఖలు రాస్తుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది.బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన తండ్రి, అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ తెలంగాణలో పాలిటిక్స్‌లో కాక రాజేసింది. డియర్ డాడీ అని సంభాషిస్తూ పార్టీలో జరుగుతున్న విషయాలను అంశాల వారిగా కేసీఆర్‌కు వివరిస్తూ లేఖ రాశారు కవిత. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో తాను గుర్తించిన విషయాలను పాజిటివ్, నెగెటివ్‌గా క్యాటగరైజ్ చేసి మరీ కేసీఆర్‌కు లేఖ రాశారామె. పార్టీలో లోటుపాట్లు, క్యాడర్ చర్చించుకుంటున్న అంశాలను కవిత తన లేఖ ద్వారా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ లేఖ ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.కాంగ్రెస్ నేతలు సైతం ఏఐసీసీ పెద్దలకు తరచూ లేఖలు రాస్తుంటారు. ముఖ్యంగా పార్టీ చీఫ్ ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలకు రాష్ట్ర నేతలు లెటర్లు రాయడం కామనే. లేటెస్ట్‌గా పార్టీ పెద్దలకు తెలంగాణ నుంచి పలువురు నేతలు లేఖలు రాశారట. సీఎం, పీసీసీ చీఫ్‌లను పదే పదే ఢిల్లీకి పిలవడంపై తెలంగాణ కాంగ్రెస్ నేతల అసహనం వ్యక్తం చేస్తూ ఢిల్లీ పెద్దలకు లేసినట్లు తెలుస్తోంది. ఏఐసీసీ తీసుకునే నిర్ణయాలు ఆలస్యమైతే పార్టీ ఎలా నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారట.రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, మీనాక్షీ నటరాజన్‌లకు తెలంగాణకి సంబంధించిన పలు అంశాలను లేఖ రూపంలో రాస్తూ మెయిల్ చేసినట్లు పలువురు తెలంగాణ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. పార్టీ ఆలస్యంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల పార్టీ నేతలు, ఆశావాహులు నిరాశకు గురవుతున్నారని..ఇప్పటిదాకా పదులసార్లు తెలంగాణ నేతలను ఢిల్లీకి పిలిచి మంత్రివర్గాన్ని విస్తరించకపోవడం ఏంటని ప్రశ్నిస్తూ లేఖ రాశారట.పార్టీ కమిటీలను ఆలస్యం చేస్తే గ్రేటర్, స్థానిక ఎన్నికలపై ఎఫెక్ట్ పడుతుందని, ప్రభుత్వం ఏర్పాటై 17 నెలలు దాటినా కార్పొరేషన్ ఛైర్మన్లను ప్రకటించకపోవడం పట్ల కూడా లేఖలో అసంతృప్తి వెళ్లగక్కారట. ప్రభుత్వం ఏర్పాటైన మొదట్లోనే కార్పొరేషన్, నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తే ఇప్పటికి చాలామందికి అవకాశం వచ్చేదని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెద్దలకు కూడా రాష్ట్ర బీజేపీ నేతలు తరచూ లేఖలు రాస్తుంటారు. కాకపోతే బీజేపీ నేతలు రాసే లేఖలు బయటికి రావు. అధ్యక్షుడి ఎంపిక విషయంలో ఒకరి మీద మరొకరు అధిష్టానంకు ఇంటర్నల్‌గా లేఖలు రాసిన సందర్భాలు ఉన్నాయ్.అంతేకాదు ఆయనకు ప్రెసిడెంట్ పోస్ట్ ఇస్తే ఈ నష్టమని..ఈయనకు పదవి కోసం ఆ నష్టమని..అన్నీ లేఖల్లోనే వివరించారట కమలం లీడర్లు. రాజాసింగ్ లాంటి నేతలైతే తాను పార్టీ హైకమాండ్‌కు చెప్పాల్సిన విషయాలను సోషల్ మీడియాలోనే పెడుతున్నారు. మొత్తం మీద తెలంగాణలో అన్ని ప్రధాన పార్టీలలో లేఖాస్త్రం ట్రెండింగ్‌లో ఉంది. అన్ని పార్టీలలో ఇప్పుడు ఇదే ట్రెండ్ నడుస్తుంది.

## ఢిల్లీకి చేరిన మాదిగ సామాజిక ఎమ్మెల్యేలు

- మంత్రివర్గంలో చోటు కోసం డిమాండ్

**న్యూఢిల్లీ, మే29( వెలుతురు):**

తెలంగాణ కేబినెట్ విస్తరణ వివాదం ఢిల్లీకిచేరింది. కేబినేట్‌లో తమకు అవకాశం ఇవ్వాలని మాదిగ సామాజికవర్గం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీలో నలుగురు తెలంగాణ కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు మకాం వేశారు. అడ్లూరు లక్ష్మణ్, మందుల సామెల్, కవ్వం పల్లి సత్యనారాయణ, లక్ష్మీ కాంతారావు ఢిల్లీకి వెళ్లారు. వీరు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వీరు కలువనున్నారు. మంత్రివర్గ విస్తరణలో తమ సామాజిక వర్గ ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను ఈ నలుగురు ఎమ్మెల్యేలు కోరనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం గురించి సీఎం, పీసీసీ, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌కు తెలిపే ఢిల్లీ వచ్చామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ అన్నారు. మాదిగ కులస్తునికి ఖచ్చితంగా కేబినెట్‌లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మాదిగ సామాజికవర్గం పెద్ద సామాజిక వర్గమన్నారు. తమ సామాజిక వర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గ ప్రతినిధి ఉండాలన్నారు. మాదిగ వర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు అండగా ఉందని తెలిపారు. మాలలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం పట్ల తమకు అభ్యంతరం లేదని చెప్పారు. మంత్రివర్గంలో ఎవరుండాలనేది నిర్ణయించేది అధిష్టానం కాబట్టి ఢిల్లీ వచ్చామన్నారు. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి కచ్చితంగా స్థానం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. మొదటి కేబినెట్ ఏర్పాటు-లోనే తమకు అవకాశం దక్కుతుందని భావించామని.. ఇప్పుడు రెండోసారి కేబినెట్ విస్తరణ జరుగుతుంది కాబట్టి ఇప్పుడు మరోసారి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. మాదిగ సామాజిక వర్గంలో ఏ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చిన తమకు అభ్యంతరం లేదని నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

## ఉత్తమ నటుడిగా గద్దర్ అవార్డు

- ఇదొక గౌరవంగా భావిస్తున్నా: అల్లు అర్జున్




**హైదరాబాద్,మే29(వెలుతురు):**

తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడు(పుష్ప-2) అవార్డు దక్కింది. దీనిపై తాజాగా అల్లు అర్జున్ ఎక్స్ వేదికగా స్పందించారు. తనకు ఈ అవార్డును ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపాడు. పుష్ప-2 సినిమాకు గాను తొలిసారి బెస్ట్ యాక్టర్ అవార్డు తీసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ గౌరవాన్ని నాకు కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన ఘనత అంతా మా డైరెక్టర్ సుకుమార్, ప్రొడ్యూసర్లు, మా మూవీ టీమ్ కే దక్కుతుంది. ఈ అవార్డు నా ఫ్యాన్స్ కు అంకితం చేస్తున్నాను. అభిమానులు చూపించే అవాజ్యమైన ప్రేమ, మద్దతు నాలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటాయి' అంటూ అల్లు అర్జున్ రాసుకొచ్చారు. ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో పుష్ప మొదటి పార్టుకు జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే.

## యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ అరెస్ట్

- చెన్నైలో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు



**చెన్నై,మే29( వెలుతురు):**

యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. చెన్నై విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలే సన్నీ యాదవ్ బైక్‌పై పాకిస్థాన్ వెళ్లి వచ్చాడు. దీంతో పాకిస్థాన్ పర్యటనకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పాకిస్థాన్‌లో ఎవరితోనైనా సంబంధాలు కలిగి ఉన్నాడా? ఎలాంటి గూఢచర్యం చేశాడన్న విషయాలపై ఆరా తీస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన జ్యోతి మల్హోత్రాతో సహా పలువురిని జాతీయ దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జ్యోతి మల్హోత్రా.. పాకిస్థాన్ అధికారులతో చాలా క్లోజ్‌గా తిరిగింది. పాకిస్థాన్ ఐఎస్ఐతో కూడా మంచి సంబంధాలు ఉన్నట్లు-గా గుర్తించారు. ఇక జ్యోతి మల్హోత్రాకు సంబంధించిన యూట్యూబ్‌లో పాకిస్థాన్‌కు సంబంధించిన అనేక వీడియోలు ఉన్నాయి. ఆమె పాకిస్థాన్‌కు మూడు సార్లు వెళ్లి వచ్చింది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడికి ముందు కూడా జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌కు వెళ్లినట్లు-గా గుర్తించినట్లు- సమాచారం. పహల్గామ్‌కు సంబంధించిన వీడియోలను జ్యోతి మల్హోత్రా.. పాక్ అధికారులకు చేరవేసినట్లు- అనుమానించారు. ప్రస్తుతం ఆమె హర్యానా జైల్లో ఉంది. 9 రోజుల పాటు- ఆమెను దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మందిని హతమార్చారు. అనంతరం భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు సింధు జలాలు నిలిపేసింది. పాక్ వీసాలను రద్దు చేసింది. అటారీ సరిహద్దును మూసేసింది. అనంతరం మే 7న భారత్.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ ఘటనలో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి.

## కడపలో కదం తొక్కిన పసుపు సైన్యం

- బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన జనం

**కడప, మే29( వెలుతురు):**

కడపలో నిర్వహించిన మహానాడు బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి తెలుగు తమ్ముళ్లు కదం తొక్కారు. ఆశించిన మేర కన్నా అధిక సంఖ్యలో తరలిరావడతో కడప పరిసరాలు జనసంద్రంగా మారాయి. కడప పట్టణం పసుపు వర్ణంగా మారింది. తెలుగుదేశం జెండా వాహనాలతో రహదారులు కిటకిటలాడుతున్నాయి. మహానాడుకు సమీప గ్రామాల ప్రజలు ద్విచక్రవాహనాలు, కాలినడకన చేరుకున్నారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సభా ప్రాంగణానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేశారు. మహానాడు ప్రాంగణంలో 3 లక్షల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు- చేశారు. కార్యకర్తల కోసం కడప మార్గమధ్యంలో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు- చేశారు. దారిపొడవునా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లతో దాహార్తి తీరుస్తున్నారు. ఈ స్థాయిలో గతంలో ఎన్నడూ ప్రజలు తరలి రాలేదని అభిమానులు చెబుతున్నారు. ప్రజలు భారీగా రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటి సారిగా అభివర్ణిస్తున్నారు. దాదాపు 140 ఎకరాల సభా ప్రాంగణం మొత్తం ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఇసుకేస్తే రాలనంతగా పసుపు సైన్యం తరలివచ్చింది.

# ఇక ఇంటర్నెట్ విప్లవమేనా




**న్యూఢిల్లీ, మే29( వెలుతురు):**

భారత దేశంలో ఇంటర్నెట్ సేవలు అంటే అందరూ జియో గురించే చెబుతారు. జియో రాకతో టెలికం రంగంలో సంచలనంగా మారింది. తక్కువ ధరతో ఎక్కువ స్పీడ్ ఇంటర్నెట్ అందిస్తోంది. ప్రస్తుతం దేశంలో జియో, భారతి టెల్ టాప్‌లో ఉన్నాయి. ఇటీవల బీఎస్ఎన్ఎల్ వినియోగం కూడా పెరిగింది. ఈ క్రమంలో ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్ఎక్స్ సంస్థ అందిస్తున్న స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు భారతదేశంలో త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ సేవలు గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వేగవంతమైన, నమ్మదగిన ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించే లక్ష్యంతో రూపొందించబడ్డాయి.డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీవోటీ) నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ) పొందిన స్టార్‌లింక్, భారత మార్కెట్‌లో పోటీతత్వ ధరలతో సేవలను అందించేందుకు సన్నద్ధమవుతోంది. స్టార్‌లింక్ అనేది స్పేస్ఎక్స్ అభివృద్ధి చేసిన శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవ, ఇది లో-ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఈవో) శాటిలైట్‌ల ద్వారా హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను అందిస్తుంది. సంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు భిన్నంగా, ఇది ఫైబర్ కేబుల్స్ లేదా సెల్ టవర్‌లపై ఆధారపడకుండా, ఆకాశంలో స్పష్టమైన దృశ్యం ఉన్న ఏ ప్రాంతంలోనైనా ఇంటర్నెట్‌ను అందిస్తుంది. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు మరియు వ్యాపారాలకు ఈ సేవలు గణనీయమైన ప్రయోజనం చేకూర్చనున్నాయి.స్టార్‌లింక్ ఇప్పటికే 100కి పైగా దేశాల్లో సేవలను అందిస్తోంది, ఇందులో భూటాన్, బంగ్లాదేశ్ వంటి దక్షిణాసియా దేశాలు కూడా ఉన్నాయి. భారతదేశంలో ఈ సేవలు ప్రారంభమైతే, డిజిటల్ డివైడ్‌ను తగ్గించడంలో, రిమోట్ ప్రాంతాల్లో కనెక్టివిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.స్టార్‌లింక్ భారతదేశంలో పరిచయ ఆఫర్‌లలో భాగంగా నెలకు 850 రూపాయల (సుమారు 10 డాలర్లు) వద్ద అపరిమిత డేటా ప్లాన్‌లను అందించే అవకాశం ఉంది. ఇది యునైటెడ్ స్టేట్స్‌లోని రెసిడెన్షియల్ లైట్ ప్లాన్(నెలకు 80 డాలర్లు) లేదా భూటాన్‌లోని ప్లాన్‌ల (నెలకు 3వేలు-4,200 రూపాయలు)తో పోలిస్తే చాలా తక్కువ. అయితే, ఈ పరిచయ ధరలు ప్రమోషనల్ ఆఫర్‌లలో భాగంగా మాత్రమే ఉండవచ్చు, ఆ తర్వాత నెలవారీ ఛార్జీలు రూ.3 వేల నుంచి రూ.7 వేల వరకు ఉండే అవకాశం ఉంది. వినియోగదారులు స్టార్‌లింక్ హార్డ్‌వేర్ కిట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది, ఇందులో శాటిలైట్ డిష్, వై-ఫై రూటర్ ఉంటాయి. ఈ కిట్ ధర ప్రపంచవ్యాప్తంగా 250-380 డాలర్ల (21,300-32,400 రూపాయలు) మధ్య ఉంది, కానీ భారతదేశంలో రూ.25 వేల నుంచి రూ.35 వేల మధ్య ఉండవచ్చని అంచనా. ఈ ఒక్కసారి ఖర్చు, సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ సేవలతో పోలిస్తే ఎక్కువగా ఉండవచ్చు, ఇది భారతదేశంలో సగటున 700-1,500 రూపాయల నెలవారీ ధరతో అందుబాటులో ఉంటుంది.స్టార్‌లింక్ భారతదేశంలో 25-220 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ సేవలను అందించనుంది. ఇది సాంప్రదాయ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కంటే తక్కువ లేటెన్సీ (25 మిల్లీసెకండ్లు)తో ఉంటుంది. ఈ వేగం వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్, రిమోట్ వర్కింగ్ వంటి అనేక ఆధునిక అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. అయితే, స్టార్‌లింక్ యొక్క శాటిలైట్‌ల సంఖ్య (ప్రస్తుతం 7 వేలకు పైగా) భారతదేశం వంటి జనాభా ఎక్కువగా ఉన్న దేశంలో సామర్థ్య పరిమితులను ఎదుర్కొనవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.స్టార్‌లింక్ భారతదేశంలో సేవలను ప్రారంభించడానికి ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) నుంచి తుది అనుమతి, స్పెక్ట్రమ్ కేటాయింపు అవసరం. 2022లో, స్టార్‌లింక్ అనుమతులు లేకుండా ప్రీ-ఆర్డర్‌లను స్వీకరించడంతో ప్రభుత్వం దానిని నిలిపివేసింది. ఇటీవల, మణిపూర్ వంటి ప్రాంతాల్లో స్టార్‌లింక్ పరికరాలను అక్రమంగా ఉపయోగించడంతో భద్రతా ఆందోళనలు తలెత్తాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు స్టార్‌లింక్ భారత ప్రభుత్వం యొక్క భద్రతా నిబంధనలను అంగీకరించింది.భారతదేశంలో భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో వంటి ప్రముఖ టెలికాం సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యాలు స్టార్‌లింక్ సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడానికి సహాయపడతాయి. అయితే, భారతీ ఎంటర్‌ప్రైజెస్ మద్దతుగల యూటెల్‌సాట్ వన్‌వెబ్, జియో-ఎస్ఈఎస్ జాయింట్ వెంచర్ వంటి పోటీదారులు కూడా మార్కెట్‌లో ఉన్నారు. అమెజాన్ ప్రాజెక్ట్ కైపర్ కూడా భారతదేశంలో సేవలను ప్రారంభించేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసింది.స్టార్‌లింక్ సేవలు భారతదేశంలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరచవచ్చు, ఇది డిజిటల్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. అయితే, ఎక్కువ హార్డ్‌వేర్ ఖర్చు, సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ సేవలతో పోలిస్తే అధిక నెలవారీ ఛార్జీలు సామాన్య వినియోగదారులకు అడ్డంకిగా ఉండవచ్చు. స్టార్‌లింక్ భారతదేశం కోసం ప్రత్యేక ధరల వ్యూహాన్ని రూపొందించాల్సి ఉంటుంది, తద్వారా ఇది ధర-సున్నితమైన మార్కెట్‌లో పోటీపడగలదు.

# ద్రవిడ రాజకీయాల్లో కొత్త కూటమి





**చెన్నై, మే29( వెలుతురు):**

తమిళనాడు రాజకీయాలంటే గుర్తుకు వచ్చేది రెండే రెండు పార్టీలు. అవి డీఎంకే, ఏఐడీఎంకే ఆరెండు పార్టీల అధిపత్యమే దశాబ్దాలుగా కొనసాగుతోంది. మరో పార్టీ పుట్టినా.. దానికంత స్కోపు.. స్పేసు.. ఇవ్వడంలేదీ రెండు పార్టీలు. అంతలా తమిళుల నరనరాన ఇంకిపోయాయా రెండు పార్టీలు. అయితే 2026లో సరికొత్త రాజకీయం చోటు చేసుకోబోతోందన్న చర్చ తమిళనాడులో జోరుగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల్లోటీడీపీ, బీజేపీ, జనసేన జట్టు కట్టి వైసీపీని ఓడించాయి. ఇప్పుడు తమిళనాడులో కూడా ఈతరహా కూటమికి రంగం సిద్ధమవుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, ఏఐడీఎంకే2026 ఎన్నికల కోసం కూటమి కట్టాయి. అయితే హీరో విజయ్ పార్టీ టీవీకే కూడా తమ కూటమిలోకి రానుంద నేతలు సంకేతాల ఇచ్చారు. ఎందుకంటే రెండు పార్టీలూ అధికారాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో సాగుతున్నవే కాబట్టి జట్టు కట్టినా ఆశ్చర్యంలేదన్నది విశ్లేషకుల మాట.అయితే ఏపీలో కూటమి విజయానికి సామాజిక సమీకరణలు కీలక పాత్ర పోషించాయి. తమిళనాడులోనూ సామాజిక సమీకరణలే కీరోల్ పోషిస్తాయి. వన్నియార్, తేవర్, ముక్కులతోర్, దళిత వర్గాలు రాజకీయంగా కీలకపాత్ర పోషిస్తున్నాయి.ఏఐడీఎంకే తేవర్, ముక్కులతోర్ వర్గాల్లో బలంగా ఉంది. విజయ్‌పార్టీ యువ ఓటర్లు, దళిత వర్గాలను ఆకర్షిస్తోంది. బీజేపీ పట్టణ మధ్యతరగతి ఓట్లపై ఆధారపడుతోంది. ఈ మూడు పార్టీలు జట్టుకడితే సామాజిక వర్గాల ఓట్లను సమీకరించి ఓటు బ్యాంకును చీల్చవచ్చు.2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, ఏఐడీఎంకే విడివిడిగా పోటీ చేసిన 20 నియోజకవర్గాల్లో రెండు పార్టీల ఓటు షేర్ కలిపితే గణనీయమైన ప్రభావం చూపిస్తోంది. అయితే, విజయ్ పార్టీకి కమలం పార్టీపై వ్యతిరేకతతో ఉంది. మరి ఈ పరిస్థితుల్లో జట్టు కట్టే అవకాశం ఉందా అన్న చర్చ కూడా వస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లోబీజేపీ, ఏఐడీఎంకే కూటమి 2026 ఎన్నికల కోసం బలమైన ప్రతిపక్ష పాత్ర పోషించడం ఖాయం. ఈశక్తి విజయ్ పార్టీ తోడైతేను సులభంగా ఓడించవచ్చని ఏఐడీఎంకే నేతలు భావిస్తున్నారు.ఇప్పటికే బీజేపీ, ఏఐడీఎంకే నేతలు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అయితే బలం సంక్షేమ పథకాలు. ప్రస్తుతం ఆపార్టీ మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం లాంటి పథకాలతో ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. అయితే ఏపీలో వైసీపీపై వ్యతిరేకతతో కూటమి విజయం సాధించినట్లు, తమిళనాడులోనూ ప్రతిపక్ష ఓట్లను ఏకం చేసి విజయం సాధించాలని ఏఐడీఎంకే యోచిస్తోంది. కానీ ఇంతవరకు విజయ్ పార్టీ నుంచి అలాంటి సంకేతాలు అయితే రాలేదు. పైగా తమిళనాడులో డీఎంకేకు- టీవీకే పార్టీల మధ్యే పోటీ అని విజయ్ ఇదివరకే ప్రకటించారు. మరి ఈ పరిస్థితుల్లో కూటమి సాధ్యమా.. అన్న చర్చ జరుగుతోంది.తమిళనాడులో ఏపీ తరహా కూటమి ఏర్పాటు అవకాశాలు ఉన్నా.. విజయం సామాజిక రాజకీయ డైనమిక్స్, పార్టీల సమన్వయంపై ఆధారపడి ఉంటుంది. బీజేపీ, ఏఐడీఎంకే కూటమి ఖరారైనప్పటికీ, చేరిక ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. అయితే కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తే.. డీఎంకే ఓడిపోయే అవకాశం ఉందంటున్నారు విశ్లేషకులు. ద్రవిడ పార్టీగా డీఎంకేపై ప్రజల్లో ఉన్న క్రేజు, అలాగే సంక్షేమ పథకాలు ఆపార్టీని మరోసారి అధికారంలోకి తెస్తాయన్న విశ్లేషణలూ వస్తున్నాయి. పైగా విజయ్ పార్టీ సింగిల్‌గానే రాణిస్తామన్న దీమాతో ఉంది. మరోవైపు బీజేపీ, ఏఐడీఎంకే మధ్య గత ఎన్నికల నుంచి కొనసాగుతున్న విభేదాలు కూడా సవాళ్లుగా నిలుస్తాయి. మరి చూడాలి.. విభేదాలు పక్కనపెట్టి గెలుపుకోసం బీజేపీ, ఏఐడీఎంకే పార్టీలు టీవీకేను తమవైపు తిప్పుకుంటాయా..లేదా అన్నది..!

## కారుకు కీ దొరికేనా

**హైదరాబాద్, మే29( వెలుతురు):**

మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రస్తుతం బీఆర్ఎస్ లో కీలక నేతగా మారారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మించి హరీశ్ దూసుకు పోతున్నారు. ప్రతి అంశంలో హరీశ్ ముందుంటున్నారు. హరీశ్ జిల్లాల పర్యటనకు వెళుతున్నప్పుడు వచ్చే రెస్పాన్స్ మామూలుగా ఉండటం లేదు.అదే ఇప్పుడు గులాబీ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వరసగా అనేక జిల్లాల్లో ఆయన పర్యటించి వచ్చారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా హరీశ్‌రావు నాయకత్వంపై గులాబీ పార్టీ క్యాడర్‌లో నమ్మకం పెరుగుతుంది. పార్టీ ఓటమి చెందినా ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా కార్యకర్తలకు అండగా ఉండే మాస్ లీడర్ గా హరీశ్ రావు గుర్తింపు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెచ్చుకున్నట్లుంది. ట్రబుల్ షూటర్ గా కూడా మారారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆయన కేవలం మంత్రిగానే ఉన్నారు. అప్పుడు పాలన అంతా కేసీఆర్, కేటీఆర్ చేతుల్లోనే నడిచేది. ఇక ఎన్నికల సమయంలో టిక్కెట్లను ఖరారు చేసే సమయంలో కూడా మామ కేసీఆర్ మేనల్లుడు హరీశ్ రావు ప్రతిపాదనలను పెద్దగా పట్టించుకోలేదన్నారు. అంతా కేసీఆర్, కేటీఆర్ ఇష్టారాజ్యంగానే టిక్కెట్ల కేటాయింపు జరిగింది. ఇక రాజ్యసభ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలోనూ హరీశ్‌రావు జోక్యం అనేది ఏమాత్రం తొమ్మిదేళ్ల పాటు జరగలేదు. దీంతో హరీశ్‌రావు తనకు అత్యంత సన్నిహితులు, అనుచరులకు కూడా ఆయన నామినేటెడ్ పదవులు కూడా ఇప్పించు కోలేకపోయారంటారు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ను నియమించినప్పుడు కూడా హరీశ్‌రావు ఒకింత అసంతృప్తికి గురయ్యారని చెబుతారు. అందుకే కేటీఆర్ ఆయన ఇంటికి వెళ్లి మరీ కలసి బావతో మాట్లాడి వచ్చారని చెబుతారు. హరీశ్‌రావు గులాబీ పార్టీకి పెద్ద ఎస్సెట్. అందులో ఏమాత్రం సందేహం లేదు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి మామ కేసీఆర్ వెన్నంటి ఉంటూ ఆయన చెప్పిన పని చేస్తూ వచ్చిన హరీశ్ రావు తర్వాత మంత్రివర్గంలో చేరినా పెద్దగా పాలనలో జోక్యం లేకుండా చేశారన్న ఆరోపణలున్నాయి. అలాగే పార్టీపై ఆయనకు పట్టు పెంచే పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే బీఆర్ఎస్ లో ఆయనకు కీలక పదవి ఏమీ లభించకపోవడమే ఇందుకు కారణం. కానీ హరీశ్‌రావు కేసీఆర్ నాయకత్వాన్ని ఎన్నడూ వ్యతిరేకించలేదు. అధికారం కోల్పోయిన తర్వాత హరీశ్‌రావు మరింతగా పాపులర్ అవుతున్నారు. తాజాగా కవిత ఎపిసోడ్ తర్వాత హరీశ్ రావుకు మరింతగా పార్టీ అధినాయకత్వంలో నమ్మకం పెరిగింది. దాదాపు ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు వెళ్లి హరీశ్ రావు సమావేశమవుతున్నారు. కేవలం కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యే అంశాలు మాత్రమే కాకుండా రాష్ట్ర రాజకీయ పరిస్థితులను గురించి కూడా చర్చిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం విరుచుకుపడుతూ హరీశ్ రావు బీఆర్ఎస్‌లో ఏ ఘటన జరిగినా హరీశ్ ముందుంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ లో కేసీఆర్, కేటీఆర్‌లను మించి మరింత పదునుగా విమర్శలు ప్రభుత్వంపై చేస్తుండటంతో కారు పార్టీలో హరీశ్ కు ఫ్యాన్స్ మరింత పెరుగుతున్నారు.



# ఫోన్ ట్యాప్ కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

- మూడ్రోజుల్లో ఇండియాకు రావాల్సిందే
- మాజీ ఐపిఎస్ ప్రభాకర్ రావుకు ఆదేశం

**న్యూఢిల్లీ,మే29( వెలుతురు):**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులోఐపీఎస్ అధికారి, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంలో కాస్త ఊరట లభించింది. ఈ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్‌రావు.. ముందస్తు బెయిల్ కోసం సుప్రీంలో పిటిషన్ వేయగా.. గురువారం విచారణ జరిగింది. ప్రభాకర్ రావుకు తాత్కాలిక ముందస్తు బెయిల్‌ను సుప్రీం కోర్టు మంజూరు చేసింది. అలాగే ఇండియా వచ్చేందుకు పాస్ పోర్ట్‌ను కూడా సుప్రీం ధర్మాసనం మంజూరు చేసింది. మూడు రోజుల్లో ఇండియా రావాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావుకు న్యాయస్థానం ఆదేశించింది. మూడు రోజుల్లో ఇండియా వచ్చి దర్యాప్తునకు సహకరిస్తా అని వెంటనే అండర్ టేకింగ్ ఇవ్వాలని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం ఆదేశించింది. ఇప్పటికిప్పుడు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశించింది. ఇలాంటి కేసుల్లో ముందస్తు బెయిల్ అంశంపై తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వెల్లడించింది. కాగా.. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ గతంలోనే తెలంగాణ కోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ ఇస్తే ఇండియాకు తిరిగి వస్తానని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. ప్రభాకర్ రావుకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ క్రమంలో మే 9న హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు ప్రభాకర్ రావు.



ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే భారత్‌కు తిరిగి వస్తానని పిటిషన్‌లో వెల్లడించారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారించిన సుప్రీం ధర్మాసనం.. ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో పాటు– వెంటనే ఇండియాకు తిరిగి రావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. . తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలంటూ అమెరికాలో ప్రభాకర్ రావు పిటిషన్ వేయగా.. అందుకు అమెరికా ప్రభుత్వం తోసిపుచ్చిన విషయం తెలిసిందే. మరోవైపు జూన్ 20 లోపు కోర్టులో హాజరుకావాలని లేదంటే ప్రకటిత నేరస్థుడిగా ప్రకటిస్తామంటూ నాంపల్లి కోర్టు ఇటీ–వల స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు ఇంటి గోడకు పోలీసులు నోటీ–సులు కూడా అంటించారు. ఇలా ప్రకటిస్తే ప్రభాకర్ రావు ఆస్తులను కూడా జప్తు చేసే అధికారం దర్యాప్తు సంస్థకు ఉంటుంది.

# పాక్ గూఢచర్యలో ప్రభుత్వ ఉద్యోగి

- జైసల్మేర్‌లో షకుర్ ఖాన్ అరెస్ట్
- సంబంధాలపై పోలీసులు ఆరా

**జయపుర,మే29( వెలుతురు):**

పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన రాజస్థాన్‌కు చెందిన ప్రభుత్వోద్యోగి షకుర్ ఖాన్‌ను బుధవారం రాత్రి జైసల్మేర్‌లో నిఘా అధికారుల బృందం అరెస్ట్ చేసింది. షకుర్ ఖాన్‌పై గత కొన్ని వారాలుగా దర్యాప్తు బృందాలు నిఘా పెట్టాయి. పాక్ దౌత్య కార్యాలయంతో సంబంధాలు ఉన్నట్లు– అనుమానిస్తున్నారు. ఉన్నత స్థాయి సమాచారం మేరకు షకుర్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సుధీర్ చౌదరి తెలిపారు. ఇక షకుర్ ఖాన్ ఫోన్‌లో పలువురి పాకిస్థానీయుల నంబర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి గురించి సరైన సమాధానం ఇవ్వలేనట్లుగా తెలుస్తోంది. అతను పాకిస్థాన్‌కు ఏడు సార్లు వెళ్లినట్లుగా గుర్తించారు. అయితే మొబైల్స్‌లో కొన్ని ఫైల్స్ డిలీట్ అయినట్లుగా కనిపెట్టారు. అలాగే బ్యాంక్ ఖాతాలపై కూడా దృష్టి పెట్టారు. ఇటీవలే ఒక ఖాతా క్లోజ్ అయింది. దానిపై కూడా ఆరా తీస్తున్నారు. షకుర్ ఖాన్ తరచుగా మొహమ్మద్ తండ్రి ఘాజీ ఫకీర్‌ను కలిసేవాడని స్థానికులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో షకుర్ ఖాన్, మొహమ్మద్, ఘాజీ ఫకీర్ ఫొటోలు ప్రత్యక్షమయ్యాయి. ఇక 2021లో ఘాజీ ఫకీర్ మరణించారు. మే 7న ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్–పాకిస్థాన్ సరిహద్దులో జైసల్మేర్‌పై అధికారులు నిఘా పెట్టినట్లుగా పోలీసు సూపరింటెండెంట్ సుధీర్ చౌదరి తెలిపారు. సరిహద్దులో అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులను ప్రశ్నించడానికి అదుపులోకి తీసుకున్నారు. విచారణ కోసం అదుపులోకి తీసుకున్న ఏడో వ్యక్తి షకుర్ ఖాన్ అని వెల్లడించారు.

# బనకచర్లతో రాయసీమకు మహర్దశ

- సీమ అభివృద్ధికి ఇక అడ్డు ఉండనే ఉండదు
- కడప బహిరంగ సభలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి

**కడప,మే29( వెలుతురు):**



మనకు కేవలం నదులపై ఆనకట్టలు కనిపిస్తే.. చంద్రబాబుకు మాత్రం నదుల అనుసంధానం గుర్తొస్తుందని, నిజమైన విజనరీ అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. దానికి కార్యరూపమే పట్టిసీమ ఎత్తిపోతల పథకం అన్నారు. పోలవరాన్ని పూర్తి చేసి.. కృష్ణా జలాలను బనకచర్ల రిజర్వాయర్ వరకు తీసుకొస్తే.. రాయలసీమ అభివృద్ధిని ఆపే శక్తి ఎవరికీ ఉండదని మాధవి రెడ్డి అన్నారు. కడప సభలో ఆమె మాట్లాడుతూ..తెలుగువాడి ఆత్మగౌరవ అగ్నిజ్వాలను నాటి దిల్లీ పాలకులకు తెలియజేయడం కోసం పుట్టిన పార్టీయే తెదేపా అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టి 9 నెలల్లోనే అధికారం చేపట్టి సత్తా చాటారని అన్నారు. అలాంటి పార్టీ బడుగు,బలహీనవర్గాలకు అండగా ఉంటోందని అన్నారు. బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి, రాజకీయ స్వాతంత్ర్యం కోసమే ఈ పార్టీ పుట్టిందన్నారు. మహానాడులో ఆమె మాట్లాడుతూ.. 43 ఏళ్ల తెదేపా చరిత్రలో తొలిసారిగా కడపలో మహానాడు నిర్వహించుకుంటున్నందుకు అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ పార్టీకి క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కార్యకర్తలే వెన్నెముక. రాష్ట్రంలో మొట్టమొదటిసారి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌లు ఇచ్చిన మహానాయకుడు ఎన్టీఆర్ అయితే.. వాటిని రూ. 4 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచిన ఘనత నారా చంద్రబాబునాయుడిదని అన్నారు. రాయలసీమ కోసం ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టును నిర్మిస్తే.. ఎస్ఆర్‌బీసీ, హెచ్ఎన్ఎస్, సీఎన్ఎస్ఎస్, కేసీ కెనాల్‌లను అభివృద్ధి చేసిన చంద్రబాబు.. లక్షలాది మంది రాయలసీమ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగిస్తూనే.. పరిపాలన, సంక్షేమం, అభివృద్ధిలో పలు సంస్కరణలను తీసుకొచ్చారని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, అకుంఠిత దీక్ష, నేర్పు, ఓర్పు కలిగిన విజనరీ నాయకుడిగా చంద్రబాబును యావత్ ప్రపంచం కీర్తిస్తోందన్నారు.

# సొంతవారి కోసమే చంద్రబాబు సంక్షేమం

- పేదలను విస్మరించి సాగిస్తున్న పాలన
- మీడియా సమావేశంలో మండిపడ్డ మాజీమంత్రి విడుదల రజని

**అమరావతి,మే29( వెలుతురు):**

సొంతవారికి దోచిపెట్టేందుకే చంద్రబాబు పాలన చేస్తున్నారని, అర్థిక అభివృద్ధి పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు తన మనుషులకే మేలు చేస్తున్నారని మాజీ మంత్రి విడదల రజని మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి విడదల రజని మీడియాతో మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమం అనేది చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. మహమ్మారి కరోనా సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకూ మేలు చేశారని, చంద్రబాబు పాలనలో ప్రజలకు అలాంటి ఆశలన్నీ నీరుగారి పోయాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాన్ని ఏం చేయదలచుకున్నారు అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ బిల్లులు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, జనాలను ఎందుకు ఇలా పట్టి పీడిస్తున్నారు అని విడదల రజని నిలదీశారు. చంద్రబాబు నాయుడు పాలనలో రైతులు రోడ్డెక్కారు, పరిశ్రమల ఊసే లేదు. అర్థిక అభివృద్ధి పేరుతో బాబు తన మనుషులకే మేలు చేస్తున్నారు. పేద, మధ్యతరగతి



ప్రజలకు సంక్షేమం అనేది ఆయనకు ఇష్టం లేదు. కరోనా సమయంలో వైఎస్ జగన్ అన్ని వర్గాలకూ మేలు చేశారు. కానీ చంద్రబాబు పాలనలో ప్రజలకు అలాంటి ఆశలన్నీ నీరుగారిపోయాయి. ఇప్పుడు ఏదడిగినా పీపీపీ పద్ధతి అంటు–న్నారు. మెడికల్ కాలేజీల ద్వారా ఆరోగ్య సేవలను జగన్ గారు విస్తృత పరిచారు. రాష్ట్ర ప్రజలకు మంచి వైద్యం అందించాలని ఆయన భావించారు. 17 మెడికల్ కాలేజీలను తెచ్చారు. వైద్య విద్య చదివే వారి ఆశలను నిజం చేయాలని జగన్ చూశారు. కార్పొరేట్ స్థాయిలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు– చేయాలని జగన్ భావించారు. నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించటానికి అడుగులేశారు. అలాంటి మెడికల్ కాలేజీలను చంద్రబాబు నాయుడు ప్రయివేటీ–కరణ చేస్తున్నారు. ఒక సంస్థతో సర్వే చేయించినట్టుగా కథ నడిపి వారితో రిపోర్టును తెప్పించారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో వారికి అనుగుణంగా రిపోర్టు ఇచ్చారు. ఒక్కో కాలేజీని సంవత్సరానికి 5 వేల చొప్పున లీజుకు ఇస్తున్నారు. 5 వందల కోట్ల విలువైన ఆస్తిని 5 వేలకు ఇవ్వటం ఏంటి?' అని మాజీ మంత్రి విడదల రజని ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాన్ని చంద్రబాబు నాయుడు ఏం చేయదలచుకున్నారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ బిల్లులు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బాబు ప్రజలను ఎందుకు ఇలా పట్టి పీడిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవటం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యత నుండి చంద్రబాబు ప్రభుత్వం తప్పుకోవడం సరికాదు. మేము అధికారంలోకి వచ్చాక మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై రివ్యూ చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్యం కోసం వైఎస్ జగన్ అనేక ఏర్పాట్లు– చేశారు. ఇప్పుడు వాటిని కూడా ఈ ప్రభుత్వం నాశనం చేసింది. గిరిజనులకు మరలా డోలీల బాధ తప్పటం లేదు' అని విడదల రజని ఆవేదన వ్యక్తం చేశారు.

# మారు వేషంలో కలెక్టర్ పర్యటన

- గుంతకల్ల ఆస్పత్రి పరిశీలించి ఆరా

**అనంతపురం,మే29( వెలుతురు):**

అనంత జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్ కుమార్ మారువేషంలో జిల్లాలో పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన ఈ పని చేశారు. ప్రజాసేవకు నూతన మార్గంగా జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలతో.. అనంతపురం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తాజాగా, కలెక్టర్ వినోద్ కుమార్ మారువేషంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో అర్ధరాత్రి తనిఖీలు చేశారు. అయితే, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సామాన్యుడిలా



గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కలియతిరుగుతూ.. రోగుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖానికి మాస్క్, మెడలో టవల్ కప్పుకుని ప్రభుత్వ ఆసుపత్రి మొత్తాన్నీ పరిశీలించారు. ఆసుపత్రి బయట చెప్పులు విడిచి వెళ్లి.. రోగులు, ప్రభుత్వాసుపత్రి సిబ్బందిని కలెక్టర్ వినోద్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.






https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# గద్దర్ అవార్డుల ప్రకటన

## ఉత్తమ చిత్రంగా కల్కి మూవీ

## ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్

## ఉత్తమ నటిగా నివేదా థామస్

## ఉత్తమ గాయనిగా శ్రేయా ఘోషాల్

### అవార్డుల వివరాలు ప్రకటించి జయసుధ, దిల్‌రాజ్



గద్దర్ అవార్డుల విభాగంలో ఉత్తమ చిత్రంగా కల్కి, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమగాయనిగా శ్రేయా ఘోషల్ ఎంపికలయ్యారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ మీడియా సమావేశంలో 2024కు సంబంధించిన అవార్డులను ప్రకటించారు. మొత్తం 1248 నామినేషన్లను పరిశీలించిన కమిటీ–.. విజేతలను ఎంపిక చేసింది. తెలంగాణ యుద్ధ నౌక, దివంగత ఉద్యమ నేత గద్దర్ పేరు మీద.. సినీ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఈ అవార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో







ఉన్న నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలిసారి గద్దర్ అవార్డులు అందజేయనున్నారు. ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్, ఉత్తమ చిత్రంగా కల్కి సినిమాను కమిటీ ఎంపిక చేసింది. ప్రముఖ నటి జయసుధ నేతృత్వంలో సినీ అవార్డుల జూరి ఏర్పాటు–అయ్యింది. ఈ క్రమంలో గురువారం ఉదయం గద్దర్ తెలంగాణ సినిమా అవార్డుల వివరాలను అవార్డుల కమిటీ–చైర్మన్ జయసుధ ప్రకటించారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవార్డులను ఇవ్వబోతోందని ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా పారదర్శకంగా అవార్డులను ఎంపిక చేశామని జయసుధ చెప్పారు. అవార్డులు తమకు బూస్ట్ ఇస్తాయని.. ప్రభుత్వం తమకు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భట్టి విక్రమార్క , కోమటిరెడ్డి , దిల్ రాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. 14 ఏళ్ల అనంతరం అవార్డులు ఇవ్వటం సంతోషమన్నారు. బెస్ట్ ఆఫ్ బెస్ట్ కే అవార్డులు వస్తున్నాయని అన్నారు. జూన్ 14న హైటెక్స్‌లో అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. అలాగే 2014–23 సంవత్సరాలకు సంబంధించిన అవార్డులను త్వరలో ప్రకటిస్తామన్న జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ వెల్లడించారు.

### గద్దర్ అవార్డులు దక్కిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఉత్తమ చిత్రం – కల్కి
ఉత్తమ రెండో చిత్రం – పొట్టేల్
ఉత్తమ మూడో చిత్రం – లక్కీభాస్కర్
ఉత్తమ నటుడు – అల్లు అర్జున్ (పుష్ప–2)
ఉత్తమ నటి – నివేదా థామస్ (35 చిన్న కథకాదు)
ఉత్తమ డైరెక్టర్ – నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ సహాయ నటుడు – ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి – శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్)
ఉత్తమ హాస్యనటుడు – సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా)
ఉత్తమ సంగీత దర్శకుడు – భీమ్స్ (రజాకార్)
ఉత్తమ స్టోరీ రైటర్ – శివ పాలడుగు
ఉత్తమ స్క్రీన్ ప్లే – వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గాయకుడు – సిద్ద్ శ్రీరామ్ (ఊరుపేరు భైరవకో)
ఉత్తమ గాయని – శ్రేయా ఘోషల్ (పుష్ప–2)
ఉత్తమ కొరియోగ్రాఫర్ – గణేష్ ఆచార్య (దేవ)
స్పెషల్ జ్యూరీ అవార్డు – దుల్కర్ సల్మాన్ (లక్కీభాస్కర్)
స్పెషల్ జ్యూరీ అవార్డు – అనన్య నాగళ్ల (పొట్టేల్)
బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ డైరెక్టర్ – యధువంశీ (కమిటీ– కుర్రాళ్లు)
2024 ఉత్తమ బాలల చిత్రం – 35 చిన్న కథకాదు
బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ – హెరిటేజ్–హిస్టరీ విభాగం – రజాకార్
నేషనల్ ఇంటెగ్రిటీ– సోషల్ అప్‌లిఫ్ట్ విభాగం – కమిటీ–కుర్రాళ్లు

# గద్దర్ అవార్డులతో చిత్ర సంస్థల అభినందనలు

### అవార్డులు దక్కినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు




తెలంగాణ ప్రభుత్వానికి టాలీవుడ్ నిర్మాణసంస్థలు కృతజ్ఞతలు తెలిపాయి. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం గద్దర్ అవార్డును ప్రకటించింది. ఇందులో పలు సినిమాలు అవార్డులను సొంతం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా నిర్మాణసంస్థలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పోస్ట్‌లు పెట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డికి దర్శక, నిర్మాతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్ అవార్డుల్లో లక్కీ భాస్కర్ సినిమా హవా చూపింది. ఏకంగా నాలుగు అవార్డులను (ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటర్) సొంతం చేసుకుంది. ఇది టీమ్‌కు ఎంతో గర్వకారణమని నిర్మాణసంస్థ పేర్కొంది. ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పింది. అలాగే తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఉత్తమ చిత్రంగా 'కల్కి 2898 ఏడీ' అవార్డును సొంతం చేసుకుంది. దీనిపై నిర్మాణసంస్థ వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. చిత్ర బృందాన్ని ప్రోత్సహించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఉత్తమ పరిచయ దర్శకుడిగా 'కమిటీ– కుర్రాళ్లు'కు గాను యధువంశీ అవార్డును సొంతం చేసుకున్నారు. వంశీకి అవార్డు ఇచ్చినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్ చెబుతూ నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్ పోస్ట్ పెట్టింది. 'కమిటీ– కుర్రాళ్లు టీమ్‌కు ఇదో ఒక మైలురాయి. తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, సినిమాటోగ్రఫీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మా కృతజ్ఞతలు. మా శ్రమను గుర్తించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ సభ్యులకు ధన్యవాదాలు. ఈ గుర్తింపు మా గౌరవాన్ని మరింత పెంచిందని పేర్కొంది. ఇక 'ఆయ్' సినిమా ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా నిలిచింది. దీంతో చిత్రబృందం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొంది.




# హరిహర వీరమల్లు కోసం పవన్ తపన


### ఏకబిగిన నాలుగు గంటలు డబ్బింగ్

అగ్ర కథానాయకుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సినిమాల వేగాన్ని పెంచారు. ఇప్పటికే 'హరిహర వీరమల్లు' షూటింగ్ పూర్తి కాగా, ఇందుకు సంబంధించిన డబ్బింగ్‌ను కూడా పూర్తి చేశారు. ఇందుకోసం నాలుగు గంటలు ఏకబిగిన డబ్బింగ్ చెప్పేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం అప్‌డేట్‌ను పంచుకుంది. హరి హర వీరమల్లు' డబ్బింగ్‌ను అన్‌స్టాపబుల్ ఫోకస్, ఫైర్‌తో పవన్‌కల్యాణ్ పూర్తి చేశారు. ఆయనకున్న బిజీ షెడ్యూల్ కారణంగా రాత్రి 10 గంటలకు డబ్బింగ్ మొదలవగా ఏకధాటిగా నాలుగు గంటల్లో పూర్తి చేశారు. పవర్ తుపానుకు సిద్ధంగా ఉండండి. జూన్ 12న మీ ఉత్తేజం ఉరకలేస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీలో పవన్‌కల్యాణ్ పోరాట యోధుడిగా కనిపించనున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. కొన్నేళ్లుగా వాయిదా పడుతూ వచ్చిన ఈ చిత్రం ఎట్టకేలకు పూర్తయింది. క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1– స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది.

# మహేశ్ ఖలేజా నేడు రీ రిలీజ్

### నష్టాలను పూడ్చుకుంటామన్న నిర్మాత కళ్యాణ్

మహేశ్ బాబు కెరీర్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన సినిమాల్లో ఖలేజా ఒకటి. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 30న రీ రిలీజ్ కానుంది. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా దీనిని రీ రిలీజ్ చేస్తున్నారు. సినిమా విడుదలైన చాలా ఏండ్లు అయినప్పటికీ ఈ చిత్రానికి సెఫరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. రీ రిలీజ్‌పై ప్రీ సేల్స్ అంశంలో సరికొత్త బెంచ్‌మార్క్ నమోదు చేసి అభిమానుల్లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తుంది. ఖలేజా రీ రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఇటీవల మూవీ నిర్మాతల్లో ఒకరైన సీ కల్యాణ్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. 2010లో సినిమా ఒరిజినల్ రిలీజ్ గురించి ఆయన మాట్లాడుతూ.. బాక్సాఫీస్ వద్ద మహేశ్ బాబు అభిమానులే స్వయంగా సినిమాను చంపేశారంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. మహేశ్ బాబు అభిమానులు ప్రత్యేక అంచనాలతో థియేటర్లకు వచ్చారు. అయితే సినిమా చూసిన తర్వాత అంచనాలు అందుకోలేకపోవడంతో నిరాశే మిగిలిందంటూ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో చాలా మంది అభిమానులు వ్యక్తిగతంగా విమర్శించారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ అభిమానులే బిగ్ స్క్రీన్‌పై మరోసారి సినిమా చూసేందుకు ఎదురుచూస్తున్నారు. బహుశా ఖలేజా బాకీ బడ్డది కేవలం 15 ఏండ్ల తర్వాతే తిరిగి చెల్లించాలని రాసి పెట్టుందేమోనన్నారు సీ కల్యాణ్. గతంలో మిస్సయిన గుర్తింపు రీ రిలీజ్ అయిన తర్వాత అయినా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో అనుష్కా శెట్టి, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం, అలీ, సునిల్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# హోంబలే ఫలిమ్స్‌తో హృత్రిక్ రోషన్ జోడీ

### అధికారికంగా ప్రకటించిన చిత్ర నిర్మాణ సంస్థ

కేజీఎఫ్, కాంతార, సలార్ వంటి భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో అగ్ర నిర్మాణ సంస్థగా ఎదిగిన హోంబాలే ఫిలిమ్స్, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌తో కలిసి ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కలయికపై సినీ వర్గాలతో పాటు– ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. హోంబాలే ఫిలిమ్స్ తమ సోషల్ మీడియా ఖాతాలో ఈ విషయాన్ని వెల్లడిస్తూ, హృతిక్ రోషన్‌కు ఘనంగా స్వాగతం పలికింది. అతడిని గ్రీక్ గాడ్ అని పిలుస్తారు. అతను హృదయాలను పరిపాలించాడు, పరిమితులను బద్దలు కొట్టాడు. నిజంగానే ఆయన ఒక అద్భుతం! హృతిక్ రోషన్‌ను హోంబాలే కుటుంబానికి స్వాగతించడానికి మేము గర్విస్తున్నాము. ఏళ్లుగా నిర్మాణంలో ఉన్న ఈ కలయిక, ధైర్యం, గొప్పదనం, కీర్తి కథను విప్పబోతోంది. ఇంటెన్సిటీ ఊహలను కలిసే చోట, బిగ్ బ్యాంగ్ ప్రారంభమవుతుందని ఆసక్తికరమైన క్యాప్షన్‌ను పోస్ట్ చేసింది. హృతిక్ రోషన్ కూడా ఈ భాగస్వామ్యం పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. హోంబాలే ఫిలిమ్స్ ఎల్లప్పుడూ ప్రత్యేకమైన కథలకు నిలయమని, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమా అనుభవాన్ని అందించడానికి తాను ఎదురుచూస్తున్నానని తెలిపారు. ప్రస్తుతానికి, ఈ ప్రాజెక్ట్ గురించి పూర్తి వివరాలు వెల్లడి కాలేదు. దర్శకుడు, ఇతర నటీ–నటు–లు, సాంకేతిక నిపుణుల వివరాలను నిర్మాణ సంస్థ ఇంకా ప్రకటించలేదు. అయితే, ఈ చిత్రం పాన్ ఇండియా సినిమాగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో విడుదల కానుంది. హృతిక్ రోషన్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ తో కలిసి 'వార్ 2' సినిమాలో నటిస్తున్నారు. మరోవైపు, హోంబాలే ఫిలిమ్స్ కూడా 'కాంతార: చాప్టర్ 1', ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న 'డ్రాగన్' వంటి ప్రతిష్టాత్మక చిత్రాలతో బిజీగా ఉంది. ఈ కొత్త ప్రాజెక్ట్ భారతీయ సినిమా పరిశ్రమలో కొత్త సంచలనం సృష్టించడం ఖాయమని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



వెలుతురు
రాష్ట్రీయం । జాతీయం
https://epaper.velthuru.com
శుక్రవారం 30 మే 2025

# కెసిఆర్ ఫ్యామిలీ డ్రామాలు అదుర్స్

- కవిత లేఖ..వ్యాఖ్యలతో మరింత స్పష్టం: ఆది శ్రీనివాస్



**కరీంనగర్,మే29( వెలుతురు):**
బిఆర్ఎస్‌లో రాజకీయ డ్రామాలు పరాకాష్టకు చేరాయని, డాడీ డాటర్ లేఖపై ప్రజల్లో చర్చ జరుగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కవిత లేఖతో కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని ప్రజలు గ్రహించారన్నారు. అలాగే తాజాగా కవిత వ్యాఖ్యలు చూస్తుంటే ఫ్యామిలీ గొడవలు తారాస్థాయికి చేరాయని అర్థం అవుతోందన్నారు. తెలంగాణ ప్రజలను వంచింది, ఎందరో ఉద్యమకారులను అణచివేసి అధికారం అనుభవించారని అన్నారు. అధికారం కోసం రాష్ట్రం ఏమైనా ఫర్వాలేదని అప్పులు చేసిన ఘనమైన కుటుంబం వారిదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం విచారణ సమయంలో ఇలాంటి డ్రామాలను ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరును ప్రజలు మెచ్చుకుంటున్నారని తెలిపారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిజమే అని కవిత లేఖతో స్పష్టమైందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ప్రతికూల వాతావరణం

- ప్రధాని సిక్కిం పర్యటన రద్దు



**న్యూఢిల్లీ,మే29( వెలుతురు):**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిక్కిం పర్యటన రద్దయింది. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన సిక్కిం పర్యటన రద్దు అయింది. అయితే సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా తన సందేశం వినిపించారు. రూ.750 కోట్ల ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. కాగా గురువారం నుంచి మూడు రోజుల పాటు- ప్రధాని మోదీ ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. 6 బహిరంగ సభలతో పాటు- రోడ్ షోలు నిర్వహించనున్నారు. సిక్కిం, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ లో ప్రధాని పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై తన సభల్లో ప్రధాని మోదీ ఫోకస్ చేయనున్నారు. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఈరోజు మోదీ సిక్కిం పర్యటన రద్దయింది. తర్వాత ఆయన రాష్ట్రాల పర్యటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# లేఖలు, లీకులు కాదు..వాస్తవాలు చెప్పండి

- కవితకు ఎంపి చామల సూటి ప్రశ్న



**న్యూఢిల్లీ,మే29( వెలుతురు):**
ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ గురించి వాస్తవాలు చెప్పాలని అనుకుంటే లేఖలు, లీకులు కాదని.. అందుకు అవసరమైన ఆధారాలు కవిత బయటపెట్టాలని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో జరిగిన అవినీతిపై కవిత దర్యాప్తు కోరాలని అన్నారు. గురువారం ఢిల్లీలో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దెయ్యాలు ఎవరో కవిత బయటపెట్టాలని.. దర్యాప్తు కోరాలని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తున్నాయని తమ నేతలు మొదటి నుంచి చెబుతునే ఉన్నారని గుర్తుచేశారు. ఈరోజు కవిత వ్యాఖ్యలు దాన్ని నిజం చేశాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌కి కవిత అవసరం లేదని.. తమకు సమర్థమైన నాయకత్వం ఉందని.. తమ పార్టీలోకి కొత్త వాళ్లు అవసరం లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# కేసీఆర్ అసలు రంగు బయటపడింది: బీర్ల ఐలయ్య




**హైదరాబాద్,మే29( వెలుతురు):**
కవిత వ్యాఖ్యలతో కేసీఆర్ అసలు రంగు బయటపడిందని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్‌ను కలపాలని ఆయన చూసినట్లు- బయటపడిందని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న ముసుగు తొలగిపోయిందని చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి 8 సీట్లు రావడానికి బీఆర్ఎస్ పార్టీనే కారణమని అన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బ తీయడానికి ఆ రెండు పార్టీలు ఏకమయ్యాయని చెప్పారు బీర్ల ఐలయ్య. కేసీఆర్ ఎందుకు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారో కవిత బయట పెట్టాలని బీర్ల ఐలయ్య కోరారు. కేటీఆర్ బండారాన్ని కవిత బయట పెట్టిందని చెప్పుకొచ్చారు. పార్టీ నుంచి కవితను బయటకు పంపించడానికి కేటీఆర్ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సొంత చెల్లిని చూసి ఓర్వలేని కేటీఆర్ తెలంగాణ ఆడబిడ్డలను ఎలా గౌరవిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీఆర్ దమ్ముంటే కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీతో డీల్‌పైన బీఆర్ఎస్ కార్యకర్తలకు సమాధానం చెప్పాలని కోరారు. కుటు-ంబాన్ని చక్కపెట్టుకోలేని కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడుతారా అని బీర్ల ఐలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అధికారం కోసం రాజకీయ డ్రామాలు

- ఎందరో ఉద్యమకారులను మింగిన బిఆర్ఎస్
- అధికారం కోసం ఏమైనా చేసే కెసిఆర్ కుటుంబం
- ఎందరో రాజకీయ జీవితాలను నాశనం చేసిన ఘనత
- కెసిఆర్ ఫ్యామిలీపై మండిపడ్డ ఎమ్మెల్యే యెన్నం



**హైదరాబాద్,మే29( వెలుతురు):**
బీఆర్ఎస్‌లో కవిత ఎపిసోడ్ తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. కవిత తన తండ్రి కేసీఆర్‌కు లేఖ రాయడం, లేఖలోని అంశాలు, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. అలాగే కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న పరిస్థితులపై అధికారపక్ష నేతలు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. ఇందంతా డ్రామా అటూ కొట్టిపారేస్తున్నారు. తాజాగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ.. కల్వకుంట్ల ఫ్యామిలీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత కుటుంబ సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చేందుకే ఇలాంటి కుతంత్రాలకు తెరతీశారంటూ మండిపడ్డారు. ఇదంతా కేవలం స్టంట్ రాజకీయమని అన్నారు. భారత దేశం కర్మ భూమి అని.. ఇక్కడి పాపలకు ఇక్కడే శిక్ష అనుభవించాలన్నారు. ఉద్యమకారుల గొంతులను కొడుకు, బిడ్డలు కోశారని.. అందులో కవిత పాత్ర కూడా ఉందని ఆరోపించారు. ఎంతో మంది రాజకీయ జీవితాలతో ఆడుకున్న కుటుంబం వాళ్ళది అంటూ కల్వకుంట కుటుంబంపై విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబాన్ని మేనేజ్ చేసుకోలేని వ్యక్తి తెలంగాణను మళ్ళీ ఎలా పాలిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం ఉంటే తెలంగాణ నాశనం అవుతుందని అప్పుడే చెప్పానన్నారు. పనికి రాని ప్రాజెక్టులు కట్టి.. అప్పులు ప్రజలకు రుద్దారని ఫైర్ అయ్యారు. అధికారం లేకపోతే ఒక్క నిముషం కూడా ఉండలేని కుటుంబం అని.. సొంత కుటుంబం సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారని అన్నారు. దీనితో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అధికారంలోకి రావడానికే కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. కేకే, మహేందర్ రెడ్డిని గెంటేసింది తమరు కాదా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పెట్టడానికి, అధికారంలోకి రావడానికి కృషి చేసిన వేలమంది గొంతులు తడిగుడ్డతో కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు కల్వకుంట్ల కుటుంబం కొత్త సినిమా చూపిస్తోందని అటూ కామెంట్స్ చేశారు. పాలనకు కేటీ-ఆర్ అనర్హుడని కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ అధికారం కోసం మాత్రమే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. అధికార దాహం కోసం చూస్తున్నారన్నారు. కేసీఆర్‌ను మరోసారి అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రజలు సిద్ధంగా లేరని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వీరి డ్రామాలు ఇక చాలించాలని, ప్రజలుకూడా వీరి రాజకీయాలు గమనించాలని అన్నారు.

# ప్యాకేజీ లభిస్తే..బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఖాయం

- ఇలాంటి రాజకీయాలతోనే బిజెపి నష్టపోతోంది
- లేకుంటే ఎప్పుడో అధికారంలోకి వచ్చేది
- కవిత వ్యాఖ్యల నేపథ్యంలో రాజాసింగ్ సంచలన కామెంట్స్



**హైదరాబాద్,మే29( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకు అడ్డుగా ఉన్న తనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అయితే.. కవిత కామెంట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ ది రికార్డు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు నిజమేనని తాను భావిస్తున్నానంటూ తెలిపారు. బీజేపీకి చెందిన కొంతమంది నేతలు పెద్ద ప్యాకేజీ లభిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉంటారని వ్యాఖ్యానించారు. ప్రతి ఎన్నికల్లో మా వాళ్లు కుమ్మక్కై-పోతారు, అందుకోసమే బీజేపీకి ఎంతో నష్టం జరిగిందని రాజాసింగ్ అన్నారు. ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయినది, ఎందుకు అనే విషయాన్ని సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. చెబితే వారిని సస్పెండ్ చేస్తారు. అందుకే కార్యకర్తలు గానీ, నాయకులు గానీ పాపం నోరు మూసుకొని కూర్చుంటున్నారని ఆయన వాపోయారు. ఇదే సందర్భంగా బీఆర్ఎస్‌పై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు నిజమే అని అనుకుంటున్నాని అన్నారు. ఒకవేళ బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పోటీ చేయాలని అనుకుంటే ఎక్కడి నుంచి నిలబడాలి అనేది కూడా బీఆర్ఎస్ వాళ్లే డిసైడ్ చేస్తారన్నారు. గతంలో కూడా ఇదే జరిగిందని అందుకే బీజేపీ నష్టపోయిందని అన్నారు. ప్రతీ ఎన్నికల్లో తమ పార్టీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. దీని వల్ల బీజేపీ చాలా నష్టపోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఈ విషయం తెలుసని.. అయినా ఎవరూ బయటపడరన్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకు వెళ్తే సస్పెండ్ చేస్తారనే భయంతో కార్యకర్తలు, అధికారులు నోరు మూసుకుని కూర్చున్నారంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు రాజాసింగ్ ఓ లేఖను విడుదల చేశారు. అయితే సొంత పార్టీపై విమర్శలు చేయడం రాజాసింగ్‌కు కొత్తేమీ కాదు. గతంలో కూడా బీజేపీపై పలు విమర్శలు చేశారు. పదేళ్ల పాటు- బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పూర్తి స్థాయిలో అధికారపార్టీకి తొత్తులుగా మారేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అధికారంలో ఎవరు ఉంటే వారితో చేతులు కలుపుతూ వారికి వంత పాడటం అనేది బీజేపీ రాష్ట్ర నాయకుల్లో కొంతమందికి అలావాటు- అయ్యిందని, పాత స్క్రాబ్‌ను తీసివేస్తే తప్ప పరిష్కారం లభించదంటూ గతంలో కూడా రాజాసింగ్ హాట్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే.

# ఆదివారాల్లోనూ రేషన్ పంపిణీ

- జూన్ 1 నుంచే అమలుకు నిర్ణయం
- పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్




**అమరావతి,మే29( వెలుతురు):**
జూన్ 1 నుంచి దివారాల్లోనూ రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టాం అని, రైస్ స్మగ్లింగ్ అనేది లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పనులు మానుకుని రేషన్ వ్యాన్ కోసం ఎదురు చూసే విధానానికి స్వస్తి పలికామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజల కోసం పని చేస్తున్నాయని చెప్పారు. మార్కెట్‌లో ధరల పెరుగుదల ఉంటే.. సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా ఇస్తామని స్పష్టం చేశారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో కూడా రేషన్ షాపులు పని చేస్తాయని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీకి ప్రభుతం అన్ని ఏర్పాట్లు చేసింది. దాదాపు 29,760 రేషన్ డిపోల ద్వారా ఇచ్చేలా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు- పూర్తి చేసింది. విజయవాడ మధురానగర్‌లోని 218 రేషన్ షాపులో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ స్వయంగా పరిశీలించారు. ఈపోస్ మిషన్, ఎలక్ట్రానిక్ కాటా పని తీరును దగ్గరుండి మరీ చెక్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... 'జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తాం. 29,760 షాపుల్లో అన్ని ఏర్పాట్లు- చేశాం. గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పేరుతో మాయ చేసింది. వేల కోట్లు- దుర్వినియోగం అయ్యేలా చేశారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టాం. రైస్ స్మగ్లింగ్ అనేది లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈకేవైసీ 96 శాతం పూర్తి చేశాం.. దేశంలోనే ఇది ఒక రికార్డు. పనులు మానుకుని రేషన్ వ్యాన్ కోసం ఎదురు చూసే విధానానికి స్వస్తి పలికాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజల కోసం పని చేస్తున్నాయని చెప్పారు.'కోటి 46 లక్షల రేషన్ కార్డులు ఏపీలో ఉన్నాయి. జూన్ ఒకటి నుంచి 4.40 లక్షల మందికి సరుకులు ఇస్తున్నాం. మార్కెట్‌లో ధరలు పెరుగుదల ఉంటే సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా ఇస్తాం. ప్రతి రేషన్ షాపు ఫొటో తీసి యాప్ ద్వారా ఆన్ లైన్లో ఉంచాం. అన్ని షాపులకు ఈ సాయంత్రానికి సరుకులు చేరుతాయి. ఈపోస్ మిషన్, కాటా, సర్వీసింగ్ ఉచితంగా చేయిస్తున్నాం. నేడు రాష్ట్ర వ్యాప్తంగా ట్రయల్ రన్ నిర్వహించాం. 218 షాపు డీలర్ పసుపులేటి శివప్రసాద్ ముప్పై యేళ్లుగా డీలర్‌గా ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్లకే వెళ్లి సరుకులు అందజేస్తాం. అన్ని విధాలా డీలర్లను కూడా ఇందుకు సన్నద్ధం చేశాం. 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో కూడా రేషన్ షాపులు పని చేస్తాయి. ఎండియూలు పది శాతం డబ్బులు కట్టారు. మిగతా డబ్బు కార్పొరేషన్ ద్వారా కట్టి.. వాహనాలు వారికే ఇస్తున్నాం. ప్రజలు కూడా రేషన్ షాపుల ద్వారానే ఇవ్వాలని కోరుతున్నారు. 15 రోజుల్లో వారికి వీలున్న సమయాల్లో సరుకులు తెచ్చుకుంటారు. 29,760 రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ ఉంటు-ంది. మార్కెట్లో పెరిగే వస్తువులను బట్టి.. రేషన్ షాపుల్లో తక్కువ ధరకే అందిస్తాం. ప్రతి కుటు-ంబానికి ఆహార భద్రత కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశం' అని మంత్రి నాదెండ్ల తెలిపారు.

## అధికారిక ర్యాలీలో ఉగ్రదాడి సూత్రధారి

- పాక్ వార్షికోత్సవ ర్యాలీలో కనిపించిన సైఫుల్లా కసూరి



**లాహోర్,మే29( వెలుతురు):**
పాకిస్థాన్ మర్కజి ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) ఆధ్వర్యంలో దేశ అణు పరీక్షల వార్షికోత్సవ ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీలో రాజకీయ నేతలతో కలిసి పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సైఫుల్లా కసూరీ సైతం పాల్గొన్నాడు. ఈ సందర్భంగా సైఫుల్లా కసూరీ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారిని తానేనంటూ భారత్ ప్రకటించిందన్నారు. ఈ విధంగా తాను ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించానని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ పేరిట భారత్ జరిపిన దాడిలో మరణించిన ముద్దస్సిర్ షాహీద్ పేరిట పంజాబ్ ప్రావిన్స్‌లోని అల్లాఅబాద్‌లో ఆసుపత్రులు, రహదారులను నిర్మిస్తామన్నారు. అలాగే అతడి పేరును ఒక సెంటర్‌కు పెడతామని చెప్పారు. ఇక భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుల జాబితాలో ఉన్న తల్హా సయీద్ సైతం ఈ ర్యాలీలో పాల్గొని భారత్‌కు వ్యతిరేకంగా విషం చిమ్మాడు. లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ కుమారుడే ఈ తల్హా సయీద్. 2024లో ఆ దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లాహోర్ ఎన్ఏ 22 స్థానం నుంచి పోటీ- చేసి ఈ తల్హా సయీద్ ఓటమి పాలయ్యాడు. అతడు పాకిస్థాన్ మర్కజి ముస్లిం లీగ్‌కు అనుబంధంగా కొనసాగుతున్నాడు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో గతంలో చేసుకున్న సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. భారత్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. పాకిస్థాన్‌లోని లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్, ఫైసలాబాద్ తదితర నగరాల్లో పీఎంఎంఎల్ ఆధ్వర్యంలో భారీగా ఆందోళనలు చేపట్టింది. ఈ ఆందోళనల్లో హాపీజ్ సయీద్ సైతం పాల్గొని భారత్‌కు వ్యతిరేకంగా విమర్శలు గుప్పించిన విషయం విధితమే. ఇక అంతర్జాతీయంగానే కాదు.. పాకిస్థాన్‌లో సైతం లష్కరే తోయిబాపై నిషేధం ఉంది. 2008 ముంబై దాడులకు ఇతడే సూత్రధారి అని ఐక్యరాజ్యసమితి గతంలోనే ప్రకటించింది. అతడు ఈ పీఎంఎంఎల్ వెనుక ఉండి నడిపిస్తున్నాడనే చర్చ బలంగా సాగుతోంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com